ఓం

శ్రీః

శివరాత్రి

(శివకథాశతకము-శివరాత్రిజాగరణపద్యాలు)

మా తల్లిదండ్రులు శ్రీ సుబ్బారావు,శ్రీమతి జోగమ్మ వారలకు అంకితము

రచయిత

బొడ్డుచెర్ల మార్కండేయప్రసాద్

(ఆంధ్రరైపీఠ విశ్రాంతాధికారి)

101, ప్రైమ్ ఎంక్లేవ్,

అలకాపురి, కొత్తపేట,

భాగ్యనగరము,

తెలంగాణము (500035) 500102

చరవాణి :: 94402 60163

హూణ- 10-01-2026

(శాలివహన శకం 1947- విశ్వావసు పుష్యబహుళసప్తమి- ఆదివారము)

మనవి

సాహిత్యాభిమానులకు -

మన తెలుగుసాహిత్యంలో శతకాలు కోకొల్లలని అందరకు తెలిసినదే. ఆ శతకసాహిత్య సముద్రంలో ఇది ఒక బుడగ.

రాబోయే ఈ శివరాత్రికి ఏమి చేద్దామా అని ఆలోచించుకొంటూ ఉంటే- ఆ నాడు జాగరణ చేసేటప్పుడు మన వాళ్ళందరతో కలసి చదువుకొనటానికి ఏదైన ఒక పుస్తకాన్ని వ్రాస్తే బాగుంటుందని తోచింది. దాని ఫలితమే ఈ చిన్న రచన.

దీనిలో కవిత్వం అనే దానిని వెదకటం అప్రయోజనం. కేవలం సత్కాలక్షేపానికి పనికి వస్తుందని మాత్రమే నా అంచనా.

దీనిలో నా సొంతం ఏమీ లేదు. చాటుశ్లోకాలను, పురాణకావ్యకథలను, ఆధారంగా చేసుకొని, సాధ్యమైనంతవరకు ప్రతి పద్యానికి ఏదో ఒక పురాణగాథ స్ఫురించే టట్లు వ్రాసాను. అక్కడక్కడ పునరుక్తి ఉండవచ్చు.ఎక్కడన్న కొద్దిగా హాస్యం ఉండవచ్చు.

నేటి తరం వాళ్ళకు సులువుగా తెలియాలని పదవిభాగాన్ని, అర్థాలను చేర్చాను.

దీనిని మా తల్లిదండ్రులకు అంకితం చేయటం నాకు ముదావహం.

ఇది ఏ కొందరకు నచ్చినా నేను ధన్యుడనే. నా ఇతరరచనలతో పాటు దీనిని కూడ, నేను నడపే విశ్వవేదిక(వెబ్ సైట్) www.vyshnavikrishnamemorial.in లో చూడవచ్చు

మార్కండేయ ప్రసాద్, **భాగ్యనగరం**

విశ్వావసు-పుష్య బహుళసప్తమి. **10-01-2026.**

శివరాత్రి

(శివకథాశతకము - శివరాత్రి జాగరణ పద్యాలు)

యజ్వా, భూతాని, సూర్యేందూ; అష్టామీ యస్య మూర్తయః ;

స సర్వకామదః సర్వాన్ సర్వదా పాతు నః శివః .

యజ్వా=యజ్ఞము చేసే వాడు; భూతాని=నేల,నీరు,నిప్పు,గాలి,నింగి- ఈ ఐదు భూతాలు; సూర్య-ఇందూ=సూర్యచంద్రులు; అమీ,అష్ట= ఈ ఎనిమిది; యస్య, మూర్తయః=ఎవనియొక్క రూపాలో,

సర్వ-కామదః, సః, శర్వః=అన్ని కోరికలను తీర్చే ఆ శివుడు;

సర్వాన్,నః, సర్వదా, పాతు= మనలను అందరను ఎల్లప్పుడు కాపాడును గాక.

అష్టమూర్తి ఐన శివుడు మనలనందరను కాపాడాలి అని భావం.

ఈ శ్లోకం మొత్తం కాళిదాసు దగ్గర కాజేసినదే. శాకుంతలంలోని నాందీశ్లోకపు త్రివిక్రమరూపానికి ఇది వామనాకారం.

శ్రీకారారాంభము మేల్

చేకూర్చుట నిజమొ కాదొ! సిద్ధాంతమిదే,

కైకొన్న మొదటి పద్యపు

వా కడ యతికొరకు వెదకు బాధలు తగ్గున్. 1

శ్రీకార-ఆరంభము,మేల్, చేకూర్చుట,నిజమొ,కాదో=శ్రీకారముతో మొదలుపెట్టటం అనేది శుభాన్ని కలిగించటం నిజమో కాదో! తెలియదు.

సిద్ధాంతము,ఇదే= నిశ్చితమైన విషయం మాత్రం ఇదే. ఏమంటే-

కై,కొన్న,మొదటి,పద్యపు,వా,కడ= అందుకొన్న తొలి పద్యపు మొదటిలో,

(వా=మొగము/నోరు, మొదలు)

యతికొరకు,వెదకు,బాధలు,తగ్గున్= యతి స్థానంలో పడవలసిన మిత్రాక్షరంకోసం వెదకుకొనే కష్టాలు తక్కువ ఔతాయి.

శ్రీ అనే అక్షరంతో గ్రంథాన్ని మొదలు పెట్టటం మన తెలుగు కవుల సంప్రదాయం. శ్రీ అనే అక్షరంతో యత్రి మైత్రి చెల్లే అక్షరాలు చాలా ఉంటాయి గాబట్టి విశ్రమస్థానంలో దానికి సరిపడే అక్షరం సులువుగా పడటానికి ఎన్నో మార్గాలు ఉంటాయి.

ఆదికవి నన్నయ, సరే;

సోది కవి బిరుదము నాకు చొప్పడ రాదా!

ఏదీ ఫల మిక, గడ్డియు

గాదముఁ గూర్చి రచియించు కవినగు నాకుస్ ? 2

ఆదికవి,నన్నయ .సరే = ఆదికవి అంటే నన్నయ్య. అది సరే, కానీ.

సోది కవి, బిరుదము, నాకు, చొప్పడ రాదా! = సోదికవి అనే బిరుదు నాకు కలుగగూడదా! (చొప్పడుట=కలుగుట)

గడ్డియు,గాదమునున్,కూర్చి, రచియించు,కవిన్,అగు, నాకున్= చెత్త చెదారాన్ని పోగు చేసి రచన చేసే కవినైన నాకు,

ఇక,ఫలము,ఏదీ? = ఇంతకంటే వేరు ఫలితం ఏముంది?

నన్నయ్య ఆదికవే. ఆ బిరుదు ఆయనదే. సందేహం లేదు. నన్ను కనీయసంగా సోది కవి అని ఐనా పిలువవచ్చు గదా!

నన్నయవంటి వాళ్ళు మాత్రమే గొప్ప కవులు,మాబోటి వాళ్ళు అల్లాటప్పా గాళ్ళు,అని భావం.

గడ్డి గాదము అనే పలుకుబడి, తెలుగులో వాడే తోడు మాటలలో ఒకటి. చెట్టు చేమ, ఇల్లు వాకిలి, రోగం రొష్టు, మొదలైనవి ఇలాంటివి.

రసవత్సుందరకవితా

విసరము సృష్టింప, నేల వితకష్టపడన్?

పసి మేయు గడ్డి వంటిదొ,

బుస వంటిదొ కూర్పవచ్చు మోపుల్ మోపుల్ ? 3

రసవత్-సుందర-కవితా-విసరమున్,సృష్టింపన్= రసవంత మైన మంచి కవిత్వాలను రచించటానికి

విత,కష్టపడన్,ఏల? = ఊరకే/వృథాగా కష్టపడటం దేనికి?

పసి,మేయు, గడ్డివంటిదో = పశువు తినే గడ్డివంటి దానిని గాని,

బుస వంటిదొ = పొల్లు/పొట్టు వంటి దానిని గాని, ('బుసము' అని అనాలి.)

మోపుల్,మోపుల్, కూర్పవచ్చు = కట్టలు కట్టలు వ్రాయవచ్చు.

'మంచి కవిత్వాన్ని వ్రాయాలని పడి కొట్టుకోవటం ఎందుకు? చెత్త వ్రాతలను కుప్పలు కుప్పలుగా వెదచల్ల వచ్చుగా!' అని వ్యంగ్యం.

మోపులు మోపులు అనేది 'ఎంతో ఎక్కువగా' అనే అర్థంలో వాడే పలుకుబడి.

సిరి దొరను నీవె కొలుతువొ!

సిరి మగడే నిన్నుఁ గొలువఁ జేరునొ! గిరిశా!

సరిగాఁ గూడఁ బలుకుకొని

యిరువురుఁ బట్టితిరి జగము లేలు పదములన్ 4

గిరిశ = శివా!

నీవు+ఎ, సిరిదొరను,కొలుతువు+ఒ = నీవే విష్ణువును సేవిస్తావో!

సిరి మగడు+ఏ, నిన్నున్,కొలువన్,చేరును+ఒ=విష్ణువే నిన్ను సేవించాలని వస్తాడో!

సరి,కాన్, కూడన్,పలుకుకొని = సమాన మయ్యేటట్లు ఇద్దరు కలగ దెలుపుకొని,

ఇరువురున్, జగములు,ఏలు,పదములన్, పట్టితిరి = మీ ఇద్దరు కూడ,లోకాలను ఏలే పదవులను బట్టారు.

విష్ణువుకంటె నీవు గొప్పవాడవో, నీకంటె విష్ణువు గొప్పవాడో, తెలియదు గాని, మీ ఇద్దరు మాత్రం మీలో మీరు మాట్లాడుకొని, లోకాలను ఏలే అధికారాన్ని సమానంగా పంచుకొన్నారు.

కూడబలుకుకోవటం అనేది ఒక నుడికారం. 'తమలో తాము ఒక ఒప్పుదలకు రావటం' అని.

సరి, నీవు గిరీశుడవే,

గిరీశు పుత్రికను వలచి కేల్పట్టితివే!

సరి పేరు వారి వీయము

సరి యనియే కా! మరేమి! సరిలేని హరా! 5

సరి,లేని,హరా= సాటి లేని వాడవైన శివా!

నీవు, గిరీశుడవు+ఏ,సరి = నీవు గిరీశుడనే పేరు గల వాడవు, అది సరే.

గిరి+ఈశు,పుత్రికను,వలచి, కేల్, పట్టితివే! = కొండలరాజైన హిమవంతుడి కూతురిని ప్రేమించి పెళ్ళి చేసుకొన్నావు గదా!

సరి,పేరు,వారి,వీయము,సరి,అని+ఏ, కా,మరి,ఏమి? =సమానమైన పేరుగల వాళ్ళతో వియ్యం బాగుగా సరిపోతుందనే కదా! ఇంకేమున్నది!

మన వాడుకలో పేరు అంటే నామధేయం అనే కాక, కీర్తి అని కూడ అర్థం. 'ఆయన బాగా పేరున్న వాడు' అని అంటాము కదా, అలా. ఇక్కడ, 'సరి పేరు' అంటే, 'ఒకే పేరు' అని, 'సమానమైన కీర్తి' అని కూడ, అర్థం. శివుడు గిరీశుడు, హిమవంతుడు కూడ గిరీశుడే. కాబట్టి ఇద్దరూ 'సరిపేరు' వారు.

కేలు పట్టు,చెట్ట పట్టు,కాలు త్రొక్కు,మొదలైన నుడికారాలకు అర్థం, 'పెళ్ళి చేసు కోవటం' అని.

కరి మోర మాసి మొండెము

బెరసిన నీ కొడుకు హరుడ! విఘ్నేశ్వరుడా?

సిరియును దొరతనముఁ గలుగు

దొరల కొడుకులకు పదములు దొరకుట యరుదా! 6

హరుడా = శివా!

కరి,మోర,మాసి,మొండెము,బెరసిన,నీ,కొడుకు,విఘ్నేశ్వరుడా! = ఏనుగు మొగము, మనిషి మొండెము , కలిసిన నీ కొడుకు విఘ్నగణాలకు నాయకుడా? (మాసి=మనుషి)

సిరియును, దొరతనమున్,కలుగు,దొరల,కొడుకులకు = సంపద, అధికారము, ఉన్న పెద్దవాళ్ళ బిడ్డలకు,

పదములు,దొరకుట, అరుదా = పదవులు దొరకటం అనేది, అరుదు కాదు గదా!

ఇది, శివుడు వినాయకుడికి విఘ్నగణాధిపత్యాన్ని ఇచ్చిన పురాణకథకు సంబంధించినది.

దీనిలో ఉత్తరార్ధము సర్వలఘువు. చివరి అక్షరం ఎలాగూ గురువు కావలసిందే.

అన్ని దిను వాడు కన్నుగ

నెన్నికఁ గన్నట్టి దంట వీవని నిన్నున్,

అన్నిండ్ల వెన్నఁ దినియును

మన్నునుఁ దిన్నట్టి వెన్ను మరొకనిఁ దలతున్. 7

అన్ని,తిను,వాడు,కన్నుగన్,ఎన్నికన్,కన్న+అట్టి, దంటవు,అని, నిన్నున్= సర్వ భక్షకుడైన అగ్నియే కన్నుగా ఉన్న వాడని పేరుపడ్డ దిట్టవు అని, నిన్ను ఒకడిని,

మరి+ఒకనిన్=ఇంకొకడిని,

అన్ని,ఇండ్ల,వెన్నన్, తినియును = అన్ని ఇళ్ళలోని వెన్నను తిని సైతం,

మన్నునున్,దిన్న+అట్టి,వెన్నున్= మట్టిని కూడతిన్న ఆ విష్ణువును,

తలతున్= స్మరిస్తాను.

శివకేశవులను ఇద్దరను తలచుకొంటానని భావం.

నాకిమ్మని నిన్నడిగినఁ

గైకొమ్మని నీవొసంగఁ గల దేది శివా!

ఏ కాటి బూదియో, లే

క కేశమునో, యనంతకేశ! యొసగెదే ! 8

శివా!,నాకు,ఇమ్ము,అని,నిన్ను,అడిగినన్ = శివా! 'నాకు ఇవ్వు' అని నిన్ను అడిగితే,

కై,కొమ్ము,అని = ' తీసుకో' అని,

నీవు,ఒసంగన్,కలది,ఏది? = నీవు ఇవ్వగలది ఏమిటి?

అనంత-కేశా!= ఆకాశమే జుట్టుగా ఉన్నవాడా! (శివుడు వ్యోమకేశుడు.)

ఏ,కాటి,బూది+ఓ = ఏ వల్లకాటిలోని బూడిదనో,

లేక, ఏ,కేశమునో,ఒసగెదు+ఏ? = లేకపోతే, ఏ వెండ్రుకనో ఇస్తావా?

వల్లకాడే నీ ఇల్లు గాబట్టి, నీవు ఏమైనా ఇస్తే బూడిదను ఇస్తావు, కాదంటే, అనంతకేశుడవు కాబట్టి ఒక వెండ్రుకను ఇస్తావేమో! అని వ్యంగ్యం.

అనంత-కేశుడు = ఆకాశమే జుట్టుగా ఉన్నవాడు,

న+అంత=కేశుడు=అంతు లేనన్ని వెండ్రుకలు ఉన్న వాడు. అన్ని వెండ్రుకలలో ఒకటి ఇచ్చినా పోయేది ఏమీ ఉండదుగా!

సరి గాని కనుల నీకున్

సరిఁ గాన రటయ్య జనులు, సరి సరి! యురగే

శ్వరపర్యంకుని నెచ్చెలి!

సరిగా యురగంబు నీకు సరిపోయె హరా! 9

సరి,కాని,కనుల,నీకున్,సరిన్, జనులు, కానరు-అట-అయ్య! = బేసి కన్నులు ఉన్న నీకు సాటి ఐన వాడిని, ప్రజలు ఎరుగరటయ్యా!

సరి,సరి! = సరే, సరే, బాగున్నది!

ఉరగ+ఈశ్వర-పర్యంకుని, నెచ్చెలి! = నాగరాజు పరుపుగా ఉన్న విష్ణుడికి మిత్రమైన వాడా!

సరిగా,ఉరగంబు, నీకు, సరిపోయెన్ = మెడలో దండగా పాము, నీకు బాగా కుదిరింది.

సరి కానిది = బేసి ఐనది. శివుడు బేసికన్నులవాడు.మూడు కనులు గదా! మూడు బేసి సంఖ్య.

సరి = సాటి; దండ.

ఇద్దరు మిత్రులలో ఒకరికి పడుకగాను, ఒకరికి దండగాను, పాము ఉన్నది. సరిపోయింది.

స్థాణువును నిన్ను గొలిచినఁ,

బ్రాణములకు జాలి దప్ప, ఫల మేముండున్?

నీ నాతి చాయఁ జేరుట

కేనియు, నామెయు నపర్ణయే యయ్యెఁ గదా! 10

స్థాణువును,నిన్నున్,కొలిచినన్ = వట్టి స్థాణువుపైన నిన్ను సేవిస్తే, (స్థాణువు = మొండి చెట్టు)

ప్రాణములకున్,జాలి,తప్ప,ఫలము,ఏమి,ఉండున్? = ప్రాణానికి శ్రమ తప్ప, ప్రయోజనం ఏముంటుంది? (జాలి = కష్టము)

నీ,నాతి,చాయన్,చేరుటకు,ఏనియున్ = నీ భార్య వైపు చేరటానికైనా,

ఆమెయున్, అపర్ణ+ఏ,అయ్యెన్,కదా! = ఆమెకూడ అపర్ణయే ఐ ఉన్నది కదా!

(అపర్ణ = ఆకులు లేనిది)

శివుడికి ఉన్న పేర్లలో స్థాణువు అనేది ఒకటి. ఆ మాటకు, 'మొండి మ్రాకు' అని కూడ అర్థం. ఫలం అంటే, ఫలితము/ప్రయోజనం అని, పండు అని,అర్థాలు. మొండి మాకు దగ్గరకు పోతే పండ్లు దొరకవు గదా! మరి స్థాణుపైన శివుడిని సేవిస్తే మాత్రం ఏమి ఫలితం దొరకుతుంది?

తపస్సు చేసేటప్పుడు పర్ణాలను,అంటే, ఆకులను, కూడ తినలేదు గాబట్టి పార్వతికి అపర్ణ అని పేరు వచ్చింది. అపర్ణ అంటే, 'ఆకులు లేనిది' అని కూడ అర్థం. ఆకులే లేని దాని దగ్గరకు పోతే, పండ్ల సంగతి అలా ఉంచి, కనీసం నీడ కూడ దొరకదు గదా! శివుడి సేవే నిష్ఫలం అనుకొంటే, ఆయన భార్య సేవ ఇంకా నిష్ఫలతరం అని వ్యంగ్యం.

(జాలి అంటే దయ అని మన వాడుకలో అర్థం. దానికి కష్టం/శ్రమ అని కూడ అర్థం. చాయ అంటే నీడ అని అర్థం. కాని వాడుకలో 'వైపు' అని కూడ అర్థం. ' ఆ ఇంటి చాయలకు కూడ పోవద్దు'. అని అంటాం గదా!)

ఏను మొగమ్ముల వాడా!

ఏనిక వా పెద్ద పట్టినే మేపెదవో !

ఏ నెరుగ, నారు మొగముల

కూనకె తగినంత తిండిఁ గూర్పం గలవో! 11

ఏను,మొగమ్ముల,వాడా! = ఐదు ముఖాలు గలవాడా! (శివుడు పంచాస్యుడు. నీకే ఐదు ముఖాలు, ఐదు నోళ్ళు. ఆ ఐదు నోళ్ళకే చాల ఎక్కువ తిండి కావాలి అని ధ్వని.)

ఏనిక, వా, పెద్ద,పట్టిని+ఏ, మేపెదవు+ఓ! = ఏనుగు నోరు ఉన్న పెద్ద కొడుకుకే తిండి పెడతావా? (వా=నోరు. వినాయకుడిది ఏనుగు నోరు. ఆ నోటికి సరిపడ్డంత తిండి కావాలి.)

ఆరు,మొగముల,కూనకు+ఎ, తగిన+అంత,తిండిన్,కూర్పన్,కలవు+ఓ= ఆరు ముఖాలు/ నోళ్ళు ఉన్న బిడ్డకే చాలినంత తిండిని సమకూర్చగలవో! (కుమారస్వామికి ఆరు ముఖాలు కాబట్టి, ఆ ఆరు నోళ్ళకు చాలేటట్లు తిండి తెచ్చి పెట్టాలి.)

నేను,ఎరుగన్= నాకు తెలియదు.

'బిచ్చగాడవు గదా, అన్ని నోళ్ళకు సరిపోయే అంత తిండిని ఎలా తెస్తావు' అని వ్యంగ్యం.

మనలో మాట శివా! యే

మనుకొనకుము, తగవె మామ మనుమని మాపస్?

మనువాడిన సతి పుట్టిం

చిన చిఱుతనుఁ ద్రుంప నీకుఁ జేయెట్లాడెస్? 12

శివా!మనలో,మాట= శివా! ఇది, అనబోయే ఈ మాట - మన మధ్యలోని గుట్టు మాట.

ఏమి,అనుకొనకుము = చెడుగా ఏమీ భావించ వద్దు.

మామ,మనుమని,మాపస్,తగవె? = మామయొక్క మనుమడిని చంపటం న్యాయమా?

(మాపుట=చంపుట,లేకుండ చేయుట)

మనువు,ఆడిన,సతి,పుట్టించిన,చిరుతనున్,త్రుంపన్ = నీవు పెండ్లాడిన భార్య సృష్టించిన పిల్లవానిని నరకటానికి ,

నీకున్, ఎట్లు ,చేయి,ఆడెన్? = నీకు చేయి ఎలా వచ్చింది?

ఇది,శివుడు మన్మథుడిని కాల్చిన కథకు,వినాయకుడి తల నరకిన కథకు, సంబంధించినది. శివుడి మామ సముద్రుడు. అతడి కూతురు లక్ష్మి. ఆమెకు కొడుకు మన్మథుడు. కాబట్టి మన్మథుడు శివుడికి 'మామ మనుమడు'. ఈ వరుసలన్నీ పురాణకథలను బట్టి మనం చెప్పుకొనేవి గాని, అవి కేవలం చమత్కారానికే.

మనలో మాట, ఏమీ అనుకోకు, మనువాడటం, చేయి ఆడటం/రావటం-ఇవి నుడికారాలు.

అలవి మిగులు వరముల నిడి

తల మీదకు దెచ్చుకొనెడు తలతిక్క శివా!

బలు బాసలఁ బలు రీతుల

తల తిక్కగఁ జేయు నేతఁ దలఁ గొట్టవయా! 13

అలవి,మిగులు,వరములన్,ఇడి = వల్లమాలిన వరాలను ఇచ్చి

(మిగులు=మీరుట,ఇడుట=ఇచ్చుట)

తలమీదకున్,తెచ్చుకొనెడు,తలతిక్క,శివా! = నెత్తిమీదికి ఆపదను తెచ్చుకొనే పిచ్చి శివుడా!

బలు,బాసలన్,పలు,రీతులన్, తలతిక్కగన్,చేయు, నేతన్= పెద్ద వాగ్దానాలను రకరకాలుగా

తలతిక్కతో చేసే నాయకుడిని, (బలు=గొప్ప, పలు=పెక్కు)

తలన్,కొట్టవు+అయా! = తల నరకవయ్యా!

శివుడు భస్మాసురుడికి ఒక వరాన్ని ఇచ్చి 'నెత్తి మీదికి' తెచ్చుకొన్నాడు.

ఇప్పుడు రాజకీయనాయకులు జనానికి అడ్డగోలు బాసలిస్తున్నారని ఒక చురక.

అలవి మిగలటం/మీరటం, తలమీదకు, తలతిక్క, తలగొట్టటం- ఇవి పలుకుబడులు.

మెసవినది విసము, నిలుకడ

మసనములో, విసపుఁ బాము మయి తొడవు,మెయిన్

బసుమపుఁ బూతయు, బంట్లుగఁ

బొసగిన బూచి గమి, నీ విభూతి యిది శివా! 14

శివా!

మెసవినది,విసము = నీవు తిన్నది, విషము. (మెసవుట=తినుట)

నిలుకడ,మసనములో = నీవు ఉండే చోటు, స్మశానములో.

మయి,తొడవు, విసపున్,పాము = ఒంటికి అలంకారం, విషపు పాము.

మెయిన్, బసుమపున్,పూతయును = ఒంటిమీదనా, బూడిద పూత,

బంట్లుగన్,పొసగిన,బూచి,గమి=సేవకులుగా అమరిన వికారుల గుంపు, ప్రమథులు.

(పొసగుట=అమరుట,కుదురుట.)

నీ,విభూతి,ఇది = నీ ఐశ్వర్యము ఇదీ!

గమి అన్నా, గుమి అన్నా, గుంపు అనే అర్థం. కాని, గమికాడు అంటే బృందముఖ్యుడు అని,

గుమికాడు అంటే కాకి అని, అర్థాలు.

పూని తలిదండ్రు లీయగ

నౌనని కైకొన్న చాన కర మే నిడి, యా

పై నుండి దూకి వచ్చిన

దానినిఁ దలఁ దాల్చ టెట్టి తగవు స్మరహరా! 15

స్మరహరా! = శివా!

తలిదండ్రులు, పూని,ఈయగన్ = తల్లి,తండ్రి, ప్రయత్నించి, కన్యాదానం ఇస్తే,

(పూనుట=ప్రయత్నించుట.)

ఔను,అని,కైకొన్న, చానకు = 'సరే' అని చేపట్టిన స్త్రీకి (పార్వతికి)

అర మేను,ఇడి = సగం దేహాన్ని ఇచ్చి (పూర్తిగా కాక, 'అర్ధాంగీ'కరించి),

ఆ,పైనుండి,దూకి,వచ్చిన దానినిన్ = ఆ ఆకాశంనుండి దూకి న దానిని (గంగను)

తలన్,తాల్చుట, ఎట్టి,తగవు? = తలమీద పెట్టుకోవటం, ఎలాంటి ధర్మం?

ఇది గంగావతరణకథకు సంబంధించినది.

శివుడికి పార్వతిని, ఆమె తల్లిదండ్రులు ఒప్పుకొని కన్యాదానం చేసారు. గంగ విషయంలో ఆమె తండ్రి హిమవంతుడి పాత్ర ఏమీ లేదు, ఆమె స్వయంగా ఆకాశంనుండి దూకి వచ్చి శివుడి తలమీద నిలిచింది. కాని శివుడు పార్వతికి అర్ధాంగాన్ని ఇచ్చి, గంగకేమో ప్రధానాంగాన్ని/తలను ఇచ్చాడు.

పైనుండి అంటే బయటినుండి అని వ్యవహారంలో అర్థం. కాబట్టి, గంగ ఇల్లాలు కాక,బయటిది.

పైనుండి దిగి/దూకి రావటం, తలదాల్చటం అనేవి తెలుగు నుడికారాలు.

' తునిమిన తలనే యదుకక

పనిమాలగ నేన్ను తలకుఁ బనుచుట యేలా? '

యని యెంబెమ్మలు కొందరు

నినుఁ బల్కుదు రట్టివారి నీ వరయు శివా!. 16

తునిమిన,తలను+ఏ,అదుకక = 'తాను త్రుంచిన తలకాయనే మరల అదుకు పెట్టకుండ...,'

(తునుముట=తుంచుట. అదుకుట=అదికించుట.)

పనిమాలగ, ఏన్గు,తలకున్,పనుచుట,ఏలా? అని = '...పనికి మాలినట్లు, ఏనుగు తలకోసం

పంపటం ఎందుకు?' అని, (పనుచుట=పంపుట)

కొందరు, ఎంబెమ్మలు,నినున్,పలుకుదురు = కొందరు శుంఠలు నిన్ను అంటారు.

వారిన్,నీవు,అరయవు+అయా! = అలా అనే వాళ్ళను, నీవు చూసుకోవయ్యా!

ఇది,శివుడు వినాయకుడి మొండెమును,ఏనుగు తలను,అదికించిన కథకు సంబంధించినది.

పనిమాల అనేది ఒక పలుకుబడి. పనిగట్టుకొని అని, నిరర్థకంగా అని, దీనికి వాడుకలో అర్థం.

ఎంబెమ్మ/ఎంబెన్న అన్నా, అంబేద అన్నా, 'ఏమీ తెలియని వాడు' అని అర్థం.

'యం బ్రహ్మ వేదాంతవిదో వదంతి...' అనే మంత్రంలో 'యం బ్రహ్మ' అనే పదాన్ని సరిగా

పలుకలేక 'ఎంబెమ్మ' అని అన్న వాడి మీదనుండి ఈ పలుకుబడి వచ్చిందని కొందరి వివరణ.

అస్త్రముకొరకై తపమున్

శాస్త్రోక్తముగా నరుండు జలిపె, సరి, యా

యస్త్రము నిడ నచ్చోటికి

నీ స్త్రీతో వచ్చి పోర నీమము గలదా! 17

అభవా! = శివా!

అస్త్రముకొరకై,నరుండు = పాశుపతం అనే అస్త్రముకొరకు, అర్జునుడు,

శాస్త్ర-ఉక్తముగా,తపంబున్,చలిపె,సరి =శాస్త్రాలలో చెప్పిన విధానంలో తపస్సు చేసాడు. సరే,

బాగానే ఉంది. (చలుపు/సలుపు=చేయుట.)

ఆ,అస్త్రమున్,ఇడన్ = ఆ అస్త్రాన్ని ఇవ్వటానికి, (ఇడుట=ఇచ్చుట.)
ఆ+చోటికి,నీ,స్త్రీతో,వచ్చి,పోరన్,నీమము,కలదా?= ఆ తపస్సు చేసే చోటికి, నీ భార్యతోపాటు వచ్చి, యుద్ధం చేయాలి-అనే కట్టుబాటు ఏమైన ఉన్నదా? (పోరుట=యుద్ధము చేయుట.)
ఇది, శివుడు అర్జునుడికి పాశుపతాన్ని ఇచ్చిన కథకు సంబంధించినది.

ఒక మూడూళ్ళనుఁ గాల్పగ

సకలజగము సాధనముగ సమకూర్చితివే!

ఒక క్షిపణి వైచి దేశము

సకలమ్మునుఁ గాల్చు నరుల శక్తిఁ గను శివా! 18

శివా!ఒక,మూడు,ఊళ్ళనున్,కాల్పగన్=కేవలం మూడంటే మూడు ఊళ్ళను కాల్చటం కోసం, సకల-జగమున్, సాధనముగన్,సమకూర్చితివే! = లోకాన్నంతటినీ పనిముట్లుగా కూర్చుకొన్నావు గదా!
ఒక,క్షిపణిన్,వైచి, దేశమున్,సకలమ్మునున్, కాల్చు,నరుల,శక్తిన్,కను = ఒక్కటంటే ఒక్క క్షిపణిని వేసి, మొత్తం దేశాన్నే కాల్చే మానవుల సామర్థ్యాన్ని చూడు.
ఇది, త్రిపురాసురసంహారకథకు సంబంధించినది.
బహువచనసంఖ్యలకు ముందు ఏకవచనార్థకమైన 'ఒక' చేరటం మన భాషకు సహజం. 'సభకు ఒక అరవై మంది వచ్చి ఉంటారు', 'ఆ పేటలో ఒక వెయ్యి ఇళ్ళు ఉంటాయి', నీకు ఇప్పటికి ఒక పది సార్లైనా చెప్పి ఉంటాను', మొదలైనవి ఉదాహరణలు.

కాటికొంప వాడు, కటికి కోపము వాడు,

పురుగు తొడవు వాడు, బూచిఱేడు,

బసుమ మలదు వాడు, దెసమొల రాయడు,

పునుక తలియ వాడు, బ్రోచు నంట! 19

కాటి,కొంప,వాడు = వల్లకాడే ఇల్లుగా కలవాడు,

కటికి,కోపము,వాడు = క్రూరమైన/మిక్కిలి కోపము గలవాడు,

పురుగు,తొడవు,వాడు = పాములు నగలుగా ఉన్న వాడు,

బూచి,ఱేడు = భూతగణాల అధిపతి,

బసుమమున్,అలదు,వాడు = బూడిదను రాచుకొనే వాడు,

దెస,మొల,రాయడు = దిగంబరంగా ఉండే దొర,

పునుక,తలియ,వాడు = పుర్రెయే పళ్ళెముగా ఉన్న వాడు,

ప్రోచున్,అంట = కాపాడుతాడట! (ప్రోచుట=కాపాడుట. 'బ్రోచే వారెవరురా...' అనే మైసూరు వాసుదేవాచార్య కృతిలో ఈ పదాన్ని 'బ్రోచే...' అని మొదలు పెట్టి పాడుతూ ఉంటారు అందరూ. తరువాత వచ్చే 'ననుఁ బ్రోచే...' అన్న చోట సంధివలన వచ్చిన బ్రోచే అన్న దాన్ని చూచి భ్రాంతి పడి,ఇక్కడ కూడ అలానే వాడారు కాబోలు. ఇలాంటిదే,' బ్రోచే వారెవరే...' అనేది కూడ.) రాయడు/రాయుడు అంటే రాజు అనే సామాన్యార్థము ఉన్నా, కొన్ని పురుషవాచకపదాల చివర రాయుడు అని చేరటం మన వ్యవహారంలో కనబడుతుంది.ఎచ్చుల రాయుడు, కోతల రాయుడు, కులాసా రాయుడు, గప్పాల రాయుడు, నిక్షేపరాయుడు... మొదలైనవి. తలియ అన్నా, తెలె/తెల్లె అన్నా, పళ్ళెరము అని అర్థము. తళిహ అనే తమిళ పదంనుండి ఇది వచ్చి ఉండవచ్చు.

పిలిచి మరి నిలిపి ఎదుటన్,
గలికిన్ గాల్ ద్రవ్వి, యాలు గన, బంట్లు గనన్,
తల బగుల బాదు వానికిఁ
గులుకుచు నీ యమ్మ నిచ్చుకొని పోయితివా! 20

పిలిచి, మరి, ఎదుట,నిలిపి = పిలిచి మరీ తన ఎదురుగా నిలబెట్టి,

కలికిస్,కాల్,ద్రవ్వి = యుద్ధానికి పూనుకొని /రెచ్చగొట్టి,

ఆలు,కనన్,బంట్లు ,కనన్ = నీ భార్య చూస్తూ ఉండగా, నీ సేవకులు చూస్తూ ఉండగా,

తల,పగులన్,బాదు,వానికిన్ = నీ తల పగిలేటట్లు కొట్టే వాడికి,

కులుకుచు, నీ,అమ్మున్,ఇచ్చుకొని,పోయితివా?= సంతోషంతో నీ అస్త్రాన్ని సమర్పించుకొని (వదలుకొని) వెళ్ళావా!

ఇది అర్జునుడికి శివుడు పాశుపతాన్ని ఇచ్చిన కథకు సంబంధించినది.

కాలుద్రవ్వటం,కులుకుచు, ఇచ్చుకొని పోవటం , అనేవి పలుకుబడులు.

బ్రహ్మ యుండ, వాని బాబుండగా; నీకు

నగ్గి మ్రింగు నంత పగ్గె యేల?

త్రోవఁ గంప తొడుగుఁ దుంటికిఁ గట్టుకొ

న్నట్టి తిక్క శంకరయ్య వీవె! 21

బ్రహ్మ,ఉండన్,వాని,బాబు,ఉండగాన్ = బ్రహ్మదేవుడే ఉండగా, ఆ బ్రహ్మ తండ్రి ఐన విష్ణువు కూడ ఉండగా,

అగ్గిన్,మ్రింగు+అంత, పగ్గె,నీకున్,ఏల=హాలాహలాగ్నిని మింగేటంత ఎచ్చులు నీకెందుకు?

త్రోవన్,కంప,తొడుగున్,తుంటికిన్, కట్టుకొన్న+అట్టి = దారిలోని కంప తొడుగును తుంటికి తగిలించుకొన్న

తిక్క,శంకరయ్యవు,ఈవు+ఎ= తిక్కశంకరయ్యవు, నీవే.

ఇది, శివుడు హాలాహలాన్ని మ్రింగిన కథకు సంబంధించినది.

వాడి బాబు, తోవ కంప తుంటికి కట్టుకోవటం, తిక్క శంకరయ్య, అనేవి పలుకుబడులు.

గొప్ప కత్తి నిచ్చి గురుపుత్రునకు, దాన

నిదుర పోటుఁ బొడువ నేర్పఁ దగునె?

నీకుఁ గాని చోట నెప్పరి వలె వచ్చి

తగుదు నమ్మ యనుచుఁ దగునె దూర? 22

గురు-పుత్రునకున్,గొప్ప,కత్తిని,ఇచ్చి = అశ్వత్థామకు ఒక పెద్ద కత్తిని ఇచ్చి,

దానన్,నిదుర,పోటున్,పొడువన్, నేర్పన్,తగునె?= దానితో (ఆ కత్తితో), నిద్రలో ఉన్న వాళ్ళమీద దాడి చేయటాన్ని నేర్పవచ్చునా?

నీకున్,కాని,చోట, నెప్పరి,వలె,వచ్చి = నీకు సంబంధం లేని చోటికి, నేర్పరిలాగ వచ్చి,

తగుదున్,అమ్మ,యనుచున్,దూరన్,తగునె?=తగినవాడనే అని అంటూ దూరటం సరైనదేనా?

ఇది, సౌప్తికవధను చేయబోతున్న అశ్వత్థామకు శివుడు భూతరూపంలో ప్రత్యక్షమై జయకారణమైన కత్తిని ఇచ్చిన కథకు సంబంధించినది.

నిదుర పోటు, కాని చోటు, తగుదునమ్మా అని, దూరటం, అనేవి తెలుగు పలుకుబడులు.

'నా కొడుకుఁ జూచి నవ్విన

పోకిరిఁ గనువారి నఘము పొందు' ననుచుఁ జీ

కాకుగఁ బలికిన యాలికి

వాక ట్టిడలేవు, మగడవా నీవు శివా! 23

నా,కొడుకున్,చూచి,నవ్విన,పోకిరిన్,కను,వారిన్,అఘము,పొందున్' ,అనుచున్= 'నా బిడ్డను చూచి నవ్విన ఆకతాయిగాడిని చూచిన వాళ్ళకు పాపం వస్తుంది' అని,

(పొందుట/ఒందుట=కలుగుట/చేరుట)

చీకాకుగన్,పలికిన,ఆలికి = అసమంజసంగా పలికిన భార్యకు,

వా,కట్టు,ఇడన్,లేవు = నోటికి కట్టు పెట్టలేకపోయావు.

(వా కట్టు=నోటికి కట్టు='మాటలాడ కుండ చేయటం'.)

శివా! నీవు,మగడవు+ఆ != శివా! నీవు ఒక మగవాడవేనా?

ఇది, వినాయకుడిని చూచి నవ్విన చంద్రుడికి పార్వతి శాపమిచ్చిన కథకు సంబంధించినది.

ఒక యాలి నేలుకొన నే

ర్వక సగమై యున్న నీదు పౌరుషమునకున్,

వెకలితనమ్ముగఁ దల నిం

కొకతెను నెక్కించుకొనుట యొప్పునె చెపుమా! 24

ఒక,ఆలిన్, ఏలుకొనన్,నేర్వక = ఒక భార్యను ఏలుకోవటం చేతకాక,

(నేర్చుట=చేతనగుట)

సగము,ఐ,ఉన్న,నీదు,పౌరుషమునకున్ = సగానికి సగం తగ్గిపోయి ఉన్న నీ మగతనానికి,

వెకలితనమ్ముగన్ = లేకితనంగా/తెలివితక్కువతనంగా,

ఇంకన్,ఒకతెనున్,తలన్,ఎక్కించుకొనుట, ఒప్పునె? = మరొక దానిని కూడ తలమీద

పెట్టుకోవటం, బాగా ఉంటుందా? ఉండదు. (ఒప్పుట=బాగుగా ఉండుట)

ఇది, శివుడు గంగను తలమీద ధరించిన కథకు సంబంధించినది.

సగం కావటం=బలహీనపడటం . 'వాడు ఈ మధ్య చిక్కి సగమైనాడు'.

పార్వతికి సగం శరీరం ఇవ్వటంతో శివుడు నిజంగానే 'సగం' ఐనాడు.

ఆలిని ఏలుకోవటం, సగం కావటం, తలమీదకు ఎక్కించుకోవటం, అనేవి పలుకుబడులు.

ముసలి యెద్దు నెక్కి దెసల నూరేగెడు

బూది బుంగ జనులఁ బ్రోచుటెట్లు?

నిన్నుఁ గాదుగాని, నిన్నుఁ గొలుచు వారి

యెడ్డె తనముఁ గాదె యెన్నవలయు! 25

ముసలి,ఎద్దున్,ఎక్కి, దెసలన్,ఊరు+ఏగెడు, బూది,బుంగ = ముసలి ఎద్దుమీద ఎక్కి

కూర్చుండి, అన్ని దిక్కులలోను తిరుగుతూ ఉండే,బూడిద బుంగ ఐన వాడు, ఒకడు,

జనులన్,ప్రోచుట,ఎట్లు?= ప్రజలను కాపాడటం ఎలా?

నిన్నున్,కాదు,కాని = (అనవలసినది) నిన్ను కాదులే కాని,

నిన్నున్,కొలుచు,వారి,ఎడ్డెతనమున్, కాదు+ఎ, ఎన్నవలయున్?= నిన్ను సేవించే వాళ్ళ తెలివి తక్కువతనాన్ని కదా అనవలసినది? (ఎన్నుట=అనుట/చెప్పుట)

ఒళ్ళంతా దుమ్ము కొట్టుకొని ఉన్న వాడి ని 'బూడిద బుంగ/బుస్సన్న' అంటారు.

'బూడిద బుంగపై యొడలి పోడిమి వోయి... కొండవీటిలో గాడిద!...'-శ్రీనాథుడు.

బూడిద బుంగ/బుస్సయ్య , ఊరేగటం అనేవి పలుకుబడులు.

అమ్మ యబ్బ లేర, టన్నదమ్ములు లేర,

టక్క చెల్లె లనుట టక్కె యంట,

కొంప లేద; టెట్టి కోడిగ 'మా జోగి

జగము లెల్లఁ బ్రోవ శక్తు' డనుట? 26

అమ్మ,అబ్బ,లేరు,అట,అన్నదమ్ములు, లేరు,అట= తల్లి కాని, తండ్రి కాని, లేరట! అన్నలు, తమ్ముళ్ళు, లేరట!

అక్క,చెల్లెలు,అనుట,టక్కు+ఎ,అంట,కొంప,లేదు,అట= అక్క, చెల్లెలు అనే మాటే కల్ల అట! ఇల్లు లేదట!

ఆ జోగి, జగములు,ఎల్లఁ,ప్రోవన్,శక్తుడు,అనుట, ఎట్టి,కోడిగము!= అటువంటి ఆ బిచ్చగాడు, 'లోకాలను అన్నిటినీ కాపాడగల సమర్ధుడు' అని అనటం,ఎటువంటి కొంటె/మోసపు మాట?

కలిమి గలుగు వాని కల్లుడు గావలెఁ

గలిమి లేని వాడు తెలివి గలిగి,

ఎడ్డె బండ బిడ్డ నేరి కోరి వరించు

తిరిపెకాడ! నీకుఁ దెలివి గలదె? 27

కలిమి,లేని వాడు, తెలివి,కలిగి = సంపద లేని వాడు, తెలివి ఐనా ఉండి,

కలిమి,కలుగు,వానికి,అల్లుడు,కావలెన్ = సంపద ఉన్నవాడికి అల్లుడు కావాలి.

(మొదటి పాదంలో అఖండయతి. ఇది చెల్లునని చెల్లదని, జుట్లు జుట్లు పట్టుకొన్నారు పూర్వం.)

ఎడ్డె,బండ,బిడ్డన్,ఏరి కోరి,వరించు,తిరిపెకాడ! = మొరటు బండ వాడి కూతురిని ఎంచుకొని కావాలని పెళ్ళాడిన బిచ్చగాడా!

నీకున్,తెలివి,కలదె? = నీకు తెలివి ఉన్నదా?

తాను సంపన్నుడు కానప్పుడు సంపన్నుడికి అల్లుడు కావటం ఒక తెలివి. ఒక పక్క తానే బిచ్చగాడై ఉండి, ఆ పాటి తెలివి కూడ లేక, ఒక మోటు వాడి పిల్లను అడిగి మరీ చేసుకొన్న శివుడికి ఏమి తెలివి ఉన్నట్లు, అని వ్యంగ్యం.

బండ బిడ్డ=రాతి కూతురు. పార్వతి నిజంగా రాతి కూతురే. ఏరికోరి అనేది ఒక పలుకుబడి.

ఇల్లటంబు బోయి తేనియుఁ వెర్రివై

కూతు గుంపు గలుగు కొంప కేల?

అత్త పిండు గలిగిన ట్టింటి కిల్లరి

కంబు సనిన హరియె గడుసు వాడు. 28

ఇల్లటంబు,పోయితి,ఏనియు = నీవు ఇల్లరికం పోయినప్పటికీ,

వెర్రివి+ఐ, కూతు,గుంపు,కలుగు,కొంపకు,ఏల,(పోయితి?) = కూతుళ్ళ మంద ఉన్న ఇంటికి ఎందుకు (పోయావు)?

అత్త,పిండు,కలిగిన+అట్టి, ఇంటికి, ఇల్లరికంబు,చనిన,హరియె, గడుసు,వాడు = అత్తల గుంపు ఉన్న ఇంటికి ఇల్లరికం పోయిన విష్ణువే తెలివైన వాడు.

ఇల్లరికం,ఇల్లటం,ఇల్లంట్రం- ఇవన్నీ ఒకటే. 'ఇల్లరికం పోవటం/ఉండటం/రావటం' అనేది ఒక పలుకుబడి. ఒకడు తన భార్యతో కలసి తన మామ ఇంటనే ఉండటం ఇల్లరికం.

శివుడి మామ హిమవంతుడు. అక్కడే శివుని నివాసం. కాబట్టి ఇల్లరికం ఉన్నట్లు . విష్ణువుకు మామ సముద్రం. ఆ సముద్రంలోనే విష్ణువు నివాసం కూడ. కాబట్టి, విష్ణువు కూడ ఇల్లరికపు అల్లుడే. కాని, హిమవంతుడికి ఎందరో కూతుళ్ళు ,అంటే, ఆ హిమాద్రినుండి పుట్టిన పెక్కు నదులే అతడి కూతుళ్ళు. అలా ఆడు పిల్లల గుంపు ఉన్న ఇంటికి ఇల్లరికం పోతే ఏమి లాభం? వాళ్ళవలన, అంతా వ్యయమే కాని తానున్న ఇంటికి ఆదాయం సున్న గదా! పైగా, అందరు ఆడు పిల్లల మధ్య, అందరు అల్లుళ్ళ మధ్య, ఒక ఇల్లరికపు టల్లుడికి అందే గౌరవానికి లోటు పడవచ్చు. అదే మరి విష్ణువో! ఆడు పిల్లల గోల లేక పోగా, ఎందరో అత్తలు ఉన్న ఇల్లు చూసి ఇల్లరికం వెళ్ళాడు. నదులన్నీ సముద్రంలోనే కలుస్తాయి గదా! అందుకని, నదులను సముద్రుడికి భార్యలు అని చెపుతారు. ఆ నదులు అన్ని విష్ణువుకు అత్తలే. అందరు అత్తలవలన విష్ణువుకు చేకూరే అల్లుడి ఆదరింపు బహుముఖం. పైగా, ఈ సముద్రుడికి నదులు తమ పుట్టిళ్ళనుండి వస్తూ తెచ్చి ఇచ్చేది ఉంటుందే కాని, అతడు ఎవరికీ ఏమీ ఈయనక్కర లేదు. ఇలా చూస్తే, శివుడి ఇల్లరికపు మామ ఐన హిమవంతుడి నుండి, విష్ణువు ఇల్లరికపు మామ ఐన సముద్రుడికి చేరేది ఉంటుంది గాని, తద్విపరీతదిశలో సముద్రంనుండి హిమవంతుడికి ఏమీ రాదు. శివుడికి పోబడి, విష్ణువుకు రాబడి. కనుక, విష్ణువు తెలివిగా కలసి వచ్చే ఇల్లరికాన్ని ఎన్నుకొన్నాడు అని, శివుడు పనికిమాలిన ఇల్లరికాన్ని ఎన్నుకొని పొరబడ్డాడు అని, భావం. ఇది కూడ ఛలోక్తే అనుకొండి!

ఏమనుకొని దాగితివో

యా మెయి నీవసుర పొట్టయం దొంటరిపై?

కాముని పిత, నినుఁ దేరగఁ

సేమమ్ముగఁ, ద్రావె మూడు చెరువుల నీళ్ళన్. 29

ఏమి,అనుకొని = ఏమి ఆలోచించి,

ఆ,మెయిన్, ఒంటరివి+ఐ, అసుర,పొట్టయందు, దాగితివి+ఓ? = ఆ విధంగా, ఒక్కడవే రాక్షసుడి పొట్టలో దాగుకొన్నావు?

నిను,సేమమ్ముగన్,తేరన్,కాముని,పిత = నిన్ను క్షేమంగా తేవటానికి, మన్మథుడి అయ్య విష్ణువు, (తేరన్=తేవటానికి. తెచ్చు అనే ధాతువు కొన్ని చోట్ల తే/తేరు అని మారుతుంది.)

మూడు,చెరువుల,నీళ్ళన్,త్రావెన్ = మూడు చెరువుల నీళ్ళు త్రాగాడు.(=చాల కష్టపడ్డాడు.)

ఇది గజాసురుడి కథ.

'మూడు చెరువుల నీళ్ళు త్రాగటం' అనేది ఒక పలుకుబడి. 'ఎంతో తిప్పలు పడి' అని భావం.

తిరుగుదువు మంచు మలపై;
శిరమున శశి,గంగ; యింత శీతత, నభిషే
కరతిని విడువవటే! నలు
గురు నవ్వరె? సిరి గలిగియుఁ గూర్చుట తగవే? 30

మంచు,మల,పై,తిరుగుదువు = నీవు మంచు కొండ మీద తిరుగుతూ ఉంటావు. అక్కడ చల్లదనం ఎక్కువ.

శిరమున,శశి,గంగ = నీ తలమీద గంగ,చంద్రుడు, ఉన్నారు. చల్లదనం ఇంకా ఎక్కువ ఐంది.

ఇంత,శీతతన్,అభిషేక-రతిని,విడువవు+అటే! = ఇంత చల్లదనంలో కూడ, అభిషేకమంటే ఇష్టాన్ని వదలుకోవే!

నలుగురు,నవ్వరె?= అందరూ నవ్వరా?

సిరి,కలిగియుఁ,కూర్చుట,తగవే?= సంపద ఉన్నప్పటికి కూడ,ఇంకా కూడబెట్టటం ధర్మమా? డబ్బు ఉన్న వాడు ఇంకా డబ్బు కూడబెట్టలని చూచినట్లు, ఇప్పటికే ఉన్న రకరకాల చల్లదనం చాలకనా ఇంకా అభిషేకపు చల్లదనానికి ఆశపడటం, అని.

'అభిషేకప్రియః శివః' అని ఆర్యోక్తి. 'నలుగురు నవ్వటం' అనేది ఒక పలుకుబడి.

ఇడునది యిడి, నీ దారినఁ

బడి పోక; పరీక్షణమని పాడని, భక్తున్

సుడిపరిచి, యేల రోకట

నడుపులు దిన? వెర్రి వెంగళప్పవుర శివా! 31

ఇడున్+అది, ఇడి, నీ,దారినన్,పడి,పోక = భక్తుడికి నీవు ఇచ్చేది ఏదో దానిని ఇచ్చి

నీ దారిన నీవు పోకుండ,

పరీక్షణము,అని,పాడు,అని = పరీక్ష చేయటం అని, పాడు అని,

భక్తున్,సుడి పరిచి, రోకటన్,అడుపులు, దినన్,ఏల? = భక్తుడిని కష్టపెట్టి, రోకటితో దెబ్బలు

తినటం ఎందుకు? (పరచుట/పఱుచుట= పడజేయుట/పెట్టుట, అడుపు=దెబ్బ.)

శివా! వెర్రి వెంగళప్పవు ర! = శివా! నీవు వట్టి వెర్రి వెంగళప్పవే!

ఇది, శివుడిని రోకలితో కొట్టిన ఒక భక్తురాలి కథకు సంబంధించినది.

ఇచ్చి మరీ తన్నించుకొనే వాడు వెర్రి వెంగళప్ప కదా!

దారినబడి పోవటం, పరీక్ష అని పాడు అని, సుడి పడటం, అడుపులు తినటం, వెర్రి వెంగళప్ప-

ఇవి పలుకుబడులు.

అగచాట్ల మారి దేవర

వగుదువు లే! యింటి కాపువై తొక చోటస్,

తెగియించి, చెప్పు కాలస్

మొగ మగలగఁ ద్రొక్కె నిన్ను మును పొక డొకచోస్. 32

అగచాట్ల మారి, దేవరవు,అగుదువు,లే = నీవు, తిప్పలు పడే దేవతవే ఔతావు లే!

ఒక,చోటన్,ఇంటి,కాపువు,ఐతి(వి) =ఒక చోటనేమో, ఇంటికి కావలి వాడ వైనావు.

మునుపు,ఒకడు,ఒక,చోన్,నిన్ను = మునుపు, ఇంకొకడు ఇంకొక చోట, నిన్ను

తెగియించి,చెప్పు కాలన్,మొగము,అగలగన్,త్రొక్కె=తెగించి, చెప్పుకాలితో మొగం పగిలి పోయేటట్లు, తొక్కిపెట్టాడు. (అగలుట=పగులుట.)

ఇది బాణాసురుడి కథకు, తిన్నడి కథకు,సంబంధించినది.

అగచాట్లను తప్పించ వలసిన దేవర, తానే అగచాట్లు పడటం ఒక వింత.

అగచాట్లమారి, చెప్పుకాలితో- ఇవి పలుకుబడులు.

మనసిజుఁ గంటన్ గాల్చిన

మొనకాడవె యైనఁ , గపటమోహినిఁ గంటన్

గనినంతన కనుగానక

వెనుకొందువె? నీదు మనసు బిగువేమందున్ 33

మనసిజున్,కంటన్,కాల్చిన మొనకాడవు+ఎ,ఐనన్ = మన్మథుడిని కంటితోనే కాల్చిన మొనగాడవే కనుక నీవైతే,

(కాడు , కత్తె, అనే ప్రత్యయాలు చేరగా వచ్చిన మొనకాడు, వేటకాడు,పాటకాడు, మొనకత్తె, ఆటకత్తె, పాట కత్తె... మొదలైన పదాలను మనము, మొనగాడు, వేటగాడు,ఆటగత్తె...అని గకారంతో కూడ పలుకుతాము.)

కపట-మోహినిన్,కంటన్, కనిన+అంతన్+అ= మాయామోహినీరూపాన్ని కంటితో చూడగానే, కను గానక, వెనుకొందువె? = కళ్ళు కనబడక(=ఏమీ చూచుకోకుండ), వెంట బడుతావా?

నీదు,మనసు బిగువున్,ఏమి,అందున్?=నీ మనసుయొక్క దృఢత్వాన్నిగురించి ఏమి చెప్పేది?

(కానుట=చూచుట. ఈ మాట ఒకప్పుడు బాగా వాడుకలో ఉండేది. కానక=చూడక, కాని=చూచి, అని వాడే వాళ్ళు. ' ... కని కానక చేసిన ...'-దాశరథిశతకం. వెనుకొనుట=వెంట పడుట)

ఆలికిఁ దొలుతన్ జెప్పక

చాలరు కూరాకుఁ గొనగ జగతిన్ మగవా;

రాలికిఁ జెప్పక హాలా

హలమునుఁ గొంటి వర మగడ వయ్యు , నుమేశా! 34

ఉమేశా! =శివా!

జగతిన్,మగవారు = లోకంలో మగ వాళ్ళు,

తొలుతన్,ఆలికిన్,చెప్పక,కూర+ఆకున్,కొనగన్,చాలరు = ముందుగా భార్యకు చెప్పకుండ,

ఆకు కూరను కూడ కొనలేరు.(కొనుట=వస్తువులను క్రయము చేయుట)

అర,మగడవు,అయ్యున్ = సగం మగవాడవే ఐ ఉండి కూడ,

హాలాహలమున్,కొంటివి = హాలాహలాన్నే కొన్నావు! (కొనుట=తీసుకొనుట)

ఇది శివుడు హాలాహలాన్ని మ్రింగిన కథకు సంబంధించినది.

నీ నెలవు నెత్తి పైవగఁ

బూనిన రాకాసి గొప్ప పూజకు డనియా,

చే నలిపి విడిచి వాని క

నూనవరము లుబ్బులింగ! యొసగుట, చెపుమా! 35

ఉబ్బు లింగ! = ఉబ్బు లింగడా!

నీ,నెలవున్,ఎత్తి పైవగన్,బూనిన,రాకాసి = నీ నివాసాన్ని ఎత్తి పార వేయాలని చూసిన

రాక్షసుడు, అంటే రావణుడు, (పైచుట=వ్రేయుట)

గొప్ప,పూజకుడు,అని+ఆ! = నీకు గొప్ప అర్చనలు చేసే వాడు అని అనుకొనేనా ఏమి...?

చే,నలిపి,విడిచి = చేతులు నలగ గొట్టి వదలి (చిన్న దండనను మాత్రమే విధించి),

వానికి,న+ఊన+వరములు , ఒసగుట? చెపుము+ఆ = వాడికి గొప్ప వరాలను ఇవ్వటం?

చెప్పు. (ఒసగుట=ఇచ్చుట)

ఇది,కైలాసశిఖరాన్ని ఎత్తబూనిన రావణుడికి శివుడు వరాలిచ్చిన కథకు సంబంధించినది.

పొగడితే పొంగిపోయే వాడిని ఉబ్బులింగడు అని గేలిగా అంటారు. ఇది ఒక పలుకుబడి.)

రావణుడు నిజంగా గొప్ప 'పూజకుడే'.

ఒక ముద్ద కూటి కాకొం

పకు నీ కొంపకునుఁ దిరుగు వానికి నేదో

బికిరము దగుఁ, దగునే గే

స్తు కొమరు మై యెరచితోడఁ జొప్పడు కుడుపుల్ ? 36

ఒక,ముద్ద,కూటికి = ఒక ముద్ద అన్నం కోసమని,

ఆ,కొంపకున్,ఈ,కొంపకునున్,తిరుగువానికిన్=ఆ ఇంటికీ ఈ ఇంటికీ పోయి అడుగుకొనే వాడికి,

ఏదో,బికిరము,తగున్ =ఏదో కొంచెం బిచ్చం చాలు. (తగుట=సరిపోవుట,చాలుట.)

గేస్తు,కొమరు,మై,ఎరచితోడన్,చొప్పడు,కుడుపుల్,తగును+ఏ?= గృహస్థుడి కొడుకు ఒంటి మాంసంతో కలిగే తిండ్లు కావాలనటం తగుతుందా? (చొప్పడుట=కలుగుట)

ఇది సిరియాళుడి కథకు సంబంధించినది.

ఒక ముద్ద కూడు, ఆ కొంపకు ఈ కొంపకు - ఇవి పలుకుబడులు. ఏదో/ఏవో/ఎవరో అని అనటం మన తెలుగు వారి మాటవరుస.

అడ్డమైన రక్కసులకు నడ్డగోలు

వరము లిచ్చి పెంచుచు నొక ప్రక్క నీవు,

వారితోఁ బోరు జేజేల బలము నడుప

నుంపఁ దగునె నీ కొడుకు నింకొక్క ప్రక్క? 37

ఒక,ప్రక్క,నీవు = ఒక వైపు, నీవు స్వయంగా,

అడ్డము,ఐన,రక్కసులకున్,అడ్డగోలు,వరములు,ఇచ్చి,పెంచుచున్ = కనబడ్డ ప్రతి రాక్షసుడికి ఎడ పెడ వరాలను ఇచ్చి, వాళ్ళను పెద్ద చేస్తూ ఉండి,

ఇంక,ఒక్క,ప్రక్క,నీ,కొడుకున్ =మరొక వైపున, సాక్షాత్తు నీ కొడుకునే
వారితోన్,పోరు,జేజేల,బలము,నడుపన్,ఉంపన్,తగునె? = ఆ రాక్షసులతో పోరాడే దేవతల సైన్యాన్ని నడపటానికి నియమించ వచ్చా? (ఉంచు=పెట్టుట.ఏర్పరుచుట)
ఇది కుమారస్వామికి దేవసేనాధిపత్యం వచ్చిన కథకు సంబంధించినది.
అడ్డమైన, అడ్డగోలు, ఒక ప్రక్క, ఇంకొక ప్రక్క – ఇవి పలుకుబడులు.

పెండ్లిఁ జేయించుచున్నట్టి పెద్ద పాఱు
మోరఁ ద్రుంచివైచిన పెను మోట పెండ్లి
కొడుకనగ నీవు దప్ప, నెయ్యెడల వేరొ
కండు గనరాడు వినరాడు చండి మగడ! 38

చండి,మగడ! = పార్వతికి భర్తవైన శివా!
పెండ్లిన్,చేయించుచున్న+అట్టి, పెద్ద,పాఱు,మోరన్,త్రుంచి వైచిన = తన పెండ్లిని జరిపిస్తూ ఉన్న ముదుసలి బ్రాహ్మణుడి తలను నరకి వేసిన (మోర=మొగము)
పెను, మోట, పెండ్లికొడుకు,అనగన్ = పెద్ద మొరటు పెళ్ళి కొడుకు ఐనవాడు-అంటే,
నీవు,తప్పన్, ఏ+ఎడల,వేరు+ఒకండు, కనరాడు,వినరాడు = నీవు తప్ప, ఎక్కడ కూడ, ఇంకొకడు చూడాలన్నా లేడు, వినాలన్నా లేడు.
ఇది, శివుడు బ్రహ్మ తలను తుంచిన కథకు సంబంధించినది.
మోటు పెళ్ళికొడుకు, కనటం వినటం , కన రావటం విన రావటం - ఇవి పలుకుబడులు.

నిను నిచ్చలు మోసెడు నె
ద్దునకొక పన గడ్డి దప్ప, దొరకెనె లిబ్బుల్?
జను నీ దారిన, నాదా
రిన నేఁ జను; దేలఁ గొలువ రిత్త కొలువులన్? 39

నిను.నిచ్చలు,మోసెడు, ఎద్దునకు = నిన్ను నిత్యమూ మోసే ఎద్దుకు,

ఒక,పన,గడ్డి,తప్ప, లిబ్బుల్,దొరకెనె? = ఒక పన గడ్డి తప్ప, నిధులు ఏమైన దొరికాయా?

(లిబ్బి=నిధి)

నీ దారిన,చను = నీవు నీ దారిన పో.

ఏన్,నా,దారినన్,చనుదు = నేను నా దారిన పోతాను.

రిత్త,కొలువులన్,కొలువన్,ఏలన్? =ప్రతిఫలం లేని వట్టి సేవలను చేయటం ఎందుకు?

పన అంటే, రెండు చేతులతో ఒకసారి పట్టుకొన్నంత. 'రెండు పనల మేత వేయటం', 'ఎదురు పనలు వేసి మోపు కట్టటం'... మొదలైనవి ఒకప్పుడు కర్షకుల పరిభాషలో వచ్చే వాడుకలు. నీ దారిన నీవు పోవటం, నా దారిన నేను పోవటం, నిధులు దొరకటం - ఇవి పలుకుబడులు.

కలుముల చేడియ పెనిమిటి

కొలువరియై, రాజరాజు కూర్చిన చెలియై,

వలి గుట్ట, యొలికి మిట్టయు

నిలుగా బ్రదుకంగ వలసెనే నీకు శివా! 40

శివా!కలిముల,చేడియ,పెనిమిటి, కొలువరి,ఐ = శివా! సంపదలను ఇచ్చే లక్ష్మికి భర్త ఐన విష్ణువు సేవకుడై ఉండి-

రాజరాజు,కూర్చిన,చెలి,ఐ,నీకు= రాజరాజు అని పేరున్న కుబేరుడు ప్రియమిత్రమై ఉండి- నీకు, వలి,గుట్ట, ఒలికి,మిట్టయున్,ఇలుగా, బ్రదుకంగ,వలసెను+ఏ = చలికొండ,వల్లకాడు, నివాసంగా బ్రదుకు వెళ్ళదీయవలసి వచ్చిందా? (వలికొండ=హిమాలయము, ఒలికి మిట్ట=శ్మశానము), (చివరి పాదంలో ప్లుతయతి. మన లాక్షణికుల పుణ్యమా అని ఇలాంటివి చెల్లుతాయి.).

పిడికెడు బూదియు, నిద్దరు

పడతులు, ముసలెద్దు, తోలు వలువ, యివే నీ

కడఁ గల సిరి; నీ రూపును

విడువక మెడఁ దాల్చు వారు వెఱ్ఱులు గారే! 41

పిడికెడు,బూదియున్, ఇద్దరు,పడతులు, ముసలి+ఎద్దు,తోలు,వలువ = గుప్పెడు బూడిద, ఇద్దరు పెళ్ళాలు, ఒక ముసలి ఎద్దు, ఒక తోలు గుడ్డ,

ఇవి+ఏ,నీ,కడన్,కల, సిరి = ఇవే కదా నీ దగ్గర ఉన్న సంపద?

నీ,రూపును,విడువక,మెడన్,తాల్చు,వారు,వెఱ్ఱులు,కారే? = నీ రూపాన్ని (శివలింగాన్ని) వదలకుండ ఎప్పుడూ మెడలో కట్టుకొనే వాళ్ళు పెర్రి వాళ్ళు కారా!

ముదుసలి అనేదానికి ముసలి అనేది వాడుక రూపం.

'ఏమిటయ్యా అయ్యగారి ఆస్తి, అంటే- ఏముంది? ఒక బండి, రెండు గుర్రాలు,ఇద్దరు ముండలు, ఇంత బుడ్డ- అన్నాడట' అని ఒక సామెత ఉన్నది.

నరుడొకడు నిన్నుఁ గొలువగఁ

బరుగెత్తితి వాని కేమొ వరములఁ గురియన్,

సరియే; పాపము ! నడుమన్

గిరి యేమొనరించెఁ, దానిఁ గీటడగింపన్? 42

నరుడు,ఒకడు,నిన్నున్,కొలువగన్=మనిషి ఒకడు నిన్ను పూజించితే,

(నరుడు=మనిషి,అర్జునుడు)

వానికి,ఏమొ,వరములన్,కురియన్,పరుగు,ఎత్తితి(వి),సరి+ఏ = వాడికి ఏవో వరాలు కుమ్మరించటానికి ఉరుకులు పెట్టావు, సరే,బాగానే ఉంది.

పాపము! నడుమన్, కిరి,ఏమి,ఒనరించె,దానిన్,కీటు,అణగింపన్?= అయ్యో! మీ ఇద్దరి మధ్యలో పంది ఏమి పాపం చేసింది, దానిని చంపటానికి? (కీటడగించుట=చంపుట)

తపస్సు చేసిన వాడు నరుడు, వరాలిచ్చే వాడు దేవుడు. మధ్యలో పశుజాతిది ఐన పంది

అకారణంగా చచ్చింది. దొంగ చావే అనుకోండి!.

ఇది కిరాతార్జునీయకథకు సంబంధించినది.

ఏమో/ఏదో/ఎవరో/ఎంతో/ఎప్పుడో అని అనటము, జాలి చూపటానికి, 'పాపం!' అని అనటమూ, మన తెలుగు మాటవరుసలు.

నీ కూర్చు చట్టు పలుమరు

వోకార్చెను రాచ కొలము మునుమిడి యకటా!

నీకోర్చఁ దగునె యది? యే

యాఁకఁ గొనని వాని కగునె యస్త్రము లిడగన్? 43

నీ,కూర్చు,చట్టు = నీ ప్రియశిష్యుడు, పరశురాముడు, (చట్టు=శిష్యుడు)

మునుము,ఇడి,పలు,మార్లు,రాచకొలము,వోకార్చెను = వరుస పెట్టి, ఎన్నో సార్లు క్షత్రియకులాన్ని చంపాడు . (వోకార్చుట=చంపుట)

అకటా!అది,ఓర్చన్, నీకు,తగునె?=అయ్యో! దానిని,ఆ చంపటాన్ని, సహించటం నీకు తగునా?

ఏ,ఆకన్,కొనని,వానికి,అస్త్రములు,ఇడన్, అగునే? = ఏ అడ్డూ ఆపూ లెక్కించని వాడికి, అస్త్రవిద్యను ఈయవచ్చునా? (ఆక=అడ్డము)

ఇది,శివుడి దగ్గర పరశురాముడు అస్త్రవిద్యను నేర్చుకోవటం, ఆ తరువాత అతడు క్షత్రియవధ చేయటం, అనే వాటికి సంబంధించినది.

మునుము పెట్టి అనేది వ్యవసాయసంబంధమైన ఒక పలుకుబడి. పంటల కోతల విషయమై, 'ఒక పక్కన మొదలు పెట్టి, చివరదాక' అనే అర్థంలో వాడుతారు.

నీ వింటిఁ ద్రుంచి వోయెడు

నా వీరునిఁ జెనకి వీగి, యణగం జేసెస్

దా విష్ణుని చాపంబును;

నీవంటి ఘనుండె సుమ్ము నీ శిష్యుండున్ ! 44

నీ,వింటిన్,త్రుంచి,పోయెడు,ఆ,వీరునిన్,చెనకి,వీగి= నీ వింటిని విరుగగొట్టి పోతూ ఉన్న ఆ వీరుడిని-అంటే- రాముడిని, ఎదుర్కొని, ఓడి పోయి,

తాను = తాను (నీ శిష్యుడు, పరశురాముడు)

విష్ణుని,చాపంబును, అణగన్,చేసెన్ = విష్ణువు వింటిని కూడ లొంగి పోయేటట్లు చేసాడు.

నీ,శిష్యుండున్,నీవంటి,ఘనుండె,చుమ్ము =నీ శిష్యుడు కూడ,నిన్ను పోలిన గొప్పవాడే, చూడు!

ఇది, రాముడి చేతిలో పరశురాముడు ఓడిన కథకు సంబంధించినది.

(చూడుము అనే దానికి చుము అనేది అవశిష్టరూపం, ఇది, చుమ్ము అని కూడ. దీని మీద ఆ,ఈ,అయ్య ,ర, మొదలైన అనుబంధాలు చేరి, చుమ్మా,చుమ్మీ,చుమ్మయ్య, చుమ్మర, మొదలైన పదాలు వస్తాయి. సంధివశాత్ ఇది ఒక్కొక్క చోట, సుమ్ము/ సుమి ఔతుంది. మనకు మాత్రం వాడుకలోను వ్రాతలోను, సుమా/సుమీ అని అలవాటు.)

ఉప్పరమునుండి దూకెడు

నప్పరమపవిత్రనదిని నౌదల నిలుపన్

దెప్పరమైననుఁ దాల్చితి,

వప్పనిచే గౌరికి సవతాలు దగిలె గా! 45

ఉప్పరమునుండి,దూకెడు,ఆ+పరమ-పవిత్ర-నదినిన్ = ఆకసంనుండి క్రిందికి దూకే ఎంతో పవిత్రమైన ఆ గంగానదిని,

ఔదలన్,నిలుపన్, దెప్పరము,ఐననున్,తాల్చితి(వి) = తలతో/తలమీద ఆపి భరించటం గొప్ప కష్టమే ఐనప్పటికి, ధరించావు.

ఆ+పనిచే,గౌరికి,సవతి+ఆలు,తగిలెన్,కా = ఆ పనిచేయటంవలన, పార్వతికి ఒక సవతి వచ్చి

తగులుకొన్నది గా!

ఇది, గంగావతరణకథకు సబంధించినది.

పది యేండ్లు సాము నేరిచి

ముది వగ్గును౯ జావఁ గొట్టు మొనకాని వలెన్?

ముది తబిసి గేస్తు మూకను

బెదరింపగ లింగధాటి వెలయించితివే? 46

పది,ఏండ్లు, సాము,నేరిచి = పది సంవత్సరాల పాటు సాము నేర్చుకొని,

ముది,వగ్గనున్,చావన్ కొట్టు, మొనకాని,వలెన్ = ముసలి బక్కవాడిని చచ్చేటట్లు కొట్టిన వీరుడి లాగా,

ముది,తబిసి,గేస్తు,మూకను,బెదరింపగ = ముసలి మునులైన గృహస్థుల గుంపును బెదర గొట్టటానికి,

లింగధాటి,వెలయించితివి+ఏ? = లింగధాటిని చూపించావా?

ఇది దారుకావనంలో శివుడు మునులకు చూపిన లీల. దీని వివరణను పెద్దలను అడిగి తెలుసుకొనండి. లేదా, హరవిలాసకావ్యపు పాతకాలపు ముద్రణలను చూడండి.

'ఆరు నెలలు సాము నేరిచి మూలనున్న ముసలి దానిని కొట్టినట్లు' అని ఒక సామెత.

ఎందరో పురుషులు లేరే?

యెందరి యిల్లాండ్రొ చావరే ? నీ యాలే

మ్రందిన యటు లామె శవం

బుం దాలిచి తిరుగనగునె ముల్లోకములన్? 47

పురుషులు,ఎందరో,లేరే? మగ వాళ్ళు ఎంతో మంది లేరా ఏమి?

ఎందరి,ఇల్లాండ్రు+ఒ,చావరే? = ఆ మగవాళ్ళలో ఎంతో మంది భార్యలు చనిపోలేదా ఏమి?
నీ,ఆలు+ఏ, మ్రందిన,అటులు = నీ భార్య ఒక్కతి మాత్రమే మరణించింది అన్నట్లు,
ఆమె,శవంబున్,తాలిచి = ఆమె శవాన్ని మోసుకొని,
ముల్లోకములన్,తిరుగన్,అగునె? = మూడు లోకాల వెంబడి తిరుగవచ్చునా?
ఇది, దక్షయజ్ఞసమయంలో పార్వతి తన దేహాన్ని వదలిన కథకు సంబంధించినది.

వండి వార్పగ నందువా, లేరు తల్లియుఁ దండ్రియుఁ బిల్ల జెల్ల;
యతిథిపూజలకొరకందువా, నీ యింటఁ బ్రాణాలతో నెవ్వ డడుగుఁ బెట్టు?
నగ్నిహోత్రస్థితి కందువా, యా యగ్ని కుదురు గట్టెను గదా నుదుట నీకు,
అనుభవింపగ వలె నాస్తుల నందువా, బూదియు జోలెయే కాదె సొత్తు?
జ్ఞాతిసంమానలబ్ధికై బ్రాతి యనిన,
నెవరు దాయాదు లెచ్చట యెంత మంది?
ఇంతికిస్ గొంతు కోత గాకేమి వెలగఁ
బెట్టు వాడపై గౌరిఁ జేపట్టితీవు? 48

మొదట నీకు భార్య ఎందుకయ్యా చెప్పు- అని అడుగుతున్నాడు
వండి,వార్పగన్,అందువు+ఆ = వంట వార్పు చేయటం కోసం- అని అంటావా,
తల్లియున్,తండ్రియున్,పిల్ల,జెల్ల, లేరు=అమ్మ కాని, అయ్య కాని, పిల్ల జెల్ల కాని,నీకు లేరు.
అతిథి-పూజలకొరకు,అందువా=ఇంటికి వచ్చిన అతిథులను సత్కరించటానికి-అని అంటావా,
నీ,ఇంటన్,ప్రాణాలతోన్,ఎవ్వడు,అడుగున్,పెట్టున్? = నీ ఇంటిలో, ప్రాణాలతో ఉన్న వాడు ఎవడు కాలు మోపుతాడు?
(నీ ఇల్లు వల్లకాడు. అక్కడకు వచ్చేది ప్రాణాలు పోయిన వాడే కదా! ఇక వాడికి చేసే అతిథిపూజలు ఏముంటాయి? కాల్చి పడ వేయటమే!)

అగ్నిహోత్ర-స్థితికి,అందువా = అగ్నిహోత్రాలను చూచుకోవటానికి- అని అంటావా,

ఆ,అగ్ని,నీకు,నుదుట,కుదురు గట్టెను,కదా = సాక్షాత్ ఆ అగ్నిదేవుడే, నీకు నుదుటన పాదు పెట్టుకొని కుదిరాడు గదా!

ఆస్తులన్,అనుభవింపగ,వలె,అందువా=ఉన్న ఆస్తులను అనుభవించటానికి కావాలి గదా - అని అంటావా,

సొత్తు, బూదెయు,జోలె+ఏ,కాదె?= నీ ఆస్తి -ఇంత బూడిద, ఒక జోలె,మాత్రమే కదా!

జ్ఞాతి-సంమాన-లబ్ధికి+ఐ, భ్రాతి, అనినన్ = దాయాదులలో గౌరవాన్ని పొందటానికి ఆశ- అని అంటావా,

దాయాదులు,ఎవరు,ఎచ్చట, ఎంత, మంది? = నీ దాయాదులు ఎవరు? ఎక్కడ ఉన్నారు? ఎంత మంది ఉన్నారు? (లేరు గదా!)

ఇంతికిన్, గొంతు, కోత, గాక = ఒక ఆడుదాని గొంతు కోయటం కాకపోతే,

(గొంతు కోయటం= అన్యాయం చేయటం)

ఏమి, వెలగఁబెట్టు, వాడవు+ఐ = ఏమి వెలగబెట్టి ఉద్ధరించే వాడవై

(వెలగబెట్టటం అనేది వ్యంగ్యంగా వాడే మాట.)

ఈవు,గౌరిన్,చేపట్టితి(వి)? = నీవు పార్వతిని పెళ్ళాడావు?

వండి వార్చటం, పిల్ల జెల్ల, ప్రాణాలతో, అడుగు పెట్టటం, కుదురు గట్టటం,గొంతు కోత, వెలగ బెట్టటం చేపట్టటం - ఇవి పలుకుబడులు.

పెద్దలు కాళ్ళ వ్రేళ్ళఁ బడి వేడిన నంతటి వారి మోముపై
వద్దన జంకియున్, మనసు పడ్డది బిడ్డయు నంచు, నెంచియున్,
కొద్దియో గొప్పయో కరగి కూతు నొసంగె హిమాద్రి నీకు; నీ
పెద్దలఁ జూచి నీకుఁ గల పెంపును సొంపునుఁ జూచి యిచ్చెనే? 49

పెద్దలు,కాళ్ళన్,వ్రేళ్ళన్,పడి వేడినన్ = పెద్ద వాళ్ళు (సప్తర్షులు) కాళ్ళా వేళ్ళా పడి బతిమాలితే ,

అంతటి,వారి,మోము, పై,వద్దు,అనన్,జంకియున్ = అంత పెద్ద వాళ్ళ మొగం మీద ' కాదు' అని అనటానికి వెనుకాడి (ఇది ఒక కారణం),

బిడ్డయున్, మనసు,పడ్డది,అంచున్,ఎంచియున్=తన కూతురు కూడ ఇష్టపడ్డది అని భావించి (ఇది ఇంకొక కారణం),

హిమాద్రి=హిమాలయం / హిమవంతుడు,

కొద్ది+ఓ,గొప్ప+ఓ,కరగి= కాస్తో కూస్తో కరగిపోయి (కొంచెం మెత్తబడి,అనుకూలుడై),

నీకు, కూతున్,ఒసంగె = నీకు తన కూతురిని ఇచ్చి పెళ్ళి చేసాడు.

అంతే కాని,

నీ,పెద్దలన్,చూచి = నీ ఇంటి పెద్దలను చూచి (=వాళ్ళమీది గౌరవంతో),

నీకున్,కల, పెంపును,సొంపునున్,చూచి ,ఇచ్చెనే?= నీకు ఉన్న సంపదను అందాన్ని చూచి (వాటిని నచ్చి మెచ్చి) ఇచ్చాడా ఏమిటి?

హిమ-అద్రి=మంచుకొండ. కాబట్టి కొద్దిగా కరగిపోవటం సాధ్యమైంది.

కాళ్ళ వేళ్ళ పడటం, మనసు పడటం, మొగం మీద, కొద్దో గొప్పో,కరగటం/కరగిపోవటం, పెంపు సొంపు - ఇవి పలుకుబడులు.

బిత్తలి జోగివె యైనను

బత్తిమెయిన్ నిన్నుఁ గొలువఁ బాటింపనిచో,

సత్తినిఁ గొలిచెద నిక, నీ

నెత్తిననే ఫ్రొద్దు పొడిచెనే లోకములో ! 50

బిత్తలి,జోగివి+ఎ,ఐనను = నీవు దిగంబరపు బైరాగివే ఐనప్పటికి,

బత్తి,మెయిన్,నిన్నున్,కొలువన్,పాటింపనిచో= భక్తికొద్ది నిన్ను సేవించినా నీవు పట్టించుకోక పోతే గనుక,

ఇక,సత్తినిన్,కొలిచెదన్ = ఇకనుండి శక్తిని/పార్వతిని సేవిస్తాను.

లోకములో, నీ,నెత్తినన్+ఏ,ప్రొద్దు,పొడిచెన్+ఏ? = లోకంలో నీ ఒక్కడి నెత్తిమీదనే పొద్దు పొడిచిందా ఏమిటి? (నీవు ఒక్కడవే తప్ప ఇంక ఎవరూ లేరా?)

ఒకరి నెత్తిననే పొద్దు పొడవటం - ఇది ఒక పలుకుబడి.

చేరుకొలది దూరంబై

మారు మొగం బిడుచు, నన్ను మన్నింపవుగా!

వేరొక దేవర పంచనఁ

జేరెద, నాకింతకంటెఁ జెడునది గలదా? 51

చేరు,కొలది, దూరంబు,ఐ, మారు,మొగంబు,ఇడుచు = నేను నీకు దగ్గర అయ్యే కొద్ది, మొగం ప్రక్కకు తిప్పుకొంటూ,

నన్ను, మన్నింపవు గా = నీవు నన్ను ఆదరించటం లేదు గదూ!

వేరు,ఒక,దేవర,పంచనన్,చేరెద=ఇంకొక దేవుడిని ఆశ్రయిస్తా.(పంచన చేరుట=ఆశ్రయించుట)

నాకు, ఇంతకంటెన్,చెడునది,కలదా?= నాకు, ఇంతకంటె చెడిపోయేది ఏమున్నది గనుక?

చేరేకొద్ది, దూరం కావటం, మారు మొగం పెట్టటం, పంచన చేరటం, ఇంతకంటె చెడటం - ఇవి పలుకుబడులు.

ఒక పల్లకియే బోయీ?

కొక తలయే క్షౌరికునకు? నొక దైవమె బ

త్తికి? నొక గతియే నాబోం

ట్లకునుస్? దెగుదాక బిగియ లాగకుము శివా! 52

బోయీకి,ఒక,పల్లకి+ఏ? = పల్లకిని మోసే బోయీకి ఏదో ఒక పల్లకి తప్ప,
మోయాలంటే ఇక వేరు పల్లకులు ఉండవా?
క్షౌరికునకు,ఒక,తల+ఏ? = క్షౌరం చేసే వానికి, ఒక తల తప్ప వేరు తలలు దొరకవా?
బత్తికిన్,ఒక,దైవము+ఎ? = భక్తితో కొలవటానికి , ఒక దైవం మాత్రమే పనికివస్తుంది అని
నియమమా?
నా,బోట్లకునున్, ఒక,గతి+యే = నాబోటి వాళ్ళకైతే, ఒకరు మాత్రమే దిక్కా?
(ఒక్కటి మాత్రమే మార్గమా? అని కూడ.)
శివా! తెగిన,దాక,బిగియ,లాగకుము = శివా! తెగే దాక బిగలాగ వద్దు.
'బోయీకి ఒక పల్లకా?మంగలికి ఒక తలా?' అని సామెత.'తెగే దాక లాగటం'-ఒక పలుకుబడి.

'జననియ కలిగినఁ గలిగిం

చునె నీకున్ నెత్తిజడలు జోలెయు నయ్యో'

అని యొక కవి మును వాపో

యెను, కనఁగనగా నదినిజమే యనిపించున్ 53

అయ్యో! జనని+అ,కలిగినన్ = 'పాపం! తల్లే కనుక ఉండి ఉంటే,...'
నీకున్, నెత్తి,జడలు,జోలెయున్,కలిగించునె? అని= 'నీకు తల జడలు గట్టనిస్తుందా? జోలె
పట్టనిస్తుందా?' అని,
మును,ఒక,కవి,వాపోయెను= మునుపు ఒక కవి మొత్తుకొన్నాడు
('తల్లి గల్గిన నేల తల జడల్ గట్టు?' అని అన్నాడు పాల్కురికి సోమనాథుడు)
కనన్ కనగాన్,అది,నిజమే,అనిపించున్=చూడగా చూడగా, ఆ మాట, నిజమే అని తోస్తున్నది.
వాపోవటం - ఇది ఒక పలుకుబడి.

తిండికే గతిలేని తిరిపెకా డందునా, శ్రీనాథుడే నీకు సేవఁ జేయు;
సతికి సామేనిచ్చు నతికామి యందునా, కామునే నిలువునఁ గాల్చినావు;
దిక్కు మ్రొక్కును లేని దేబెగా నెంతునా, యొక మూల నీశత్వ మొకటి యేడ్చెఁ;
బిలువఁ బల్కఁగ లేని వెలితెక్కటందునా, కో యన్నఁ గొలువఁగఁ గోట్లమంది;
ఎట్లు భావింపఁ దగు నిన్ను నెఱుగఁ రాదు,
నీ చరిత చిత్రము నగమ్యగోచరంబు,
తలయుఁ దోకయు లేని గాథలనుఁ బోలెఁ,
జేత వాతనుఁ గాని నా వ్రాత వోలె. 54

తిండికే,గతి,లేని,తిరిపెకాడు,అందునా = అన్నానికి కూడ ఆధారం లేని బిచ్చగాడు-అని అనేదా అంటే,
శ్రీనాథుడే,నీకు,సేవన్,చేయు= లక్ష్మి మగడైన విష్ణువే నీకు సేవ చేస్తాడు.
సతికి,సా,మేను,ఇచ్చు,అతికామి,అందునా = భార్యకు సగం దేహాన్ని అప్పగించిన కామలోలుడు- అని అనేదా అంటే,
కాముని+ఏ,నిలువునన్,కాల్చినావు= ఆ కాముడినే -మన్మథుడినే- నిట్టనిలువున కాల్చావు.
దిక్కు,మొక్కును, లేని,దేబెగాన్,ఎంతును+ఆ = ఏ గతి లేని అధముడు - అని అనేదా అంటే,
ఒక,మూలన్,ఈశత్వము,ఒకటి ఏడ్చెన్ = ఒక ప్రక్కన, ఈశుడు అనే గుణం ఒకటి ఉన్నదే! (శివుడికి నిజంగానే ఒక మూలన ఈశత్వం ఉన్నది. తూర్పు,ఉత్తరాల మధ్యన ఉన్న మూలకు అధిపతి ఐన ఈశానుడికి శివుడికి, మన పురాణాసంప్రదాయం ప్రకారం అభేదం.)
పిలువన్,పల్కగ,లేని,వెలితి,ఎక్కటి,అందునా = పిలిస్తే పలకటానికి ఎవరూ లేని చౌకబారు ఏకాకి - అని అనేదా అంటే,
కో,అన్నన్, కొలువగన్,కోట్ల,మంది = కో అంటే ,వచ్చి సేవించటానికి కోట్లకొద్దీ జనం ఉన్నారు.

నిన్నున్,ఎట్లు, భావింపన్,తగు?ఎఱుగ,రాదు=నిన్ను ఏ రకంగా భావించాలి? తెలియటం లేదు.
తలయున్,తోకయు, లేని, గాథలనున్,వోలెన్ = తలా తోకా లేని (అర్థం లేని) కథలలాగ,
చేత, వాతనున్,కాని, నా, వ్రాత, వోలె= ఏ మాత్రం చేతగాని నా రచన లాగ,
నీ, చరిత, చిత్రమున్,అ-గమ్య-గోచరంబు=నీ కథ అంతా, వింతగాను, అర్థం కాకుండను, ఉంది.
గతి లేని,నిలువున,దిక్కు మొక్కు, ఒక మూల, ఒకటి ఏడ్చె, పిలిస్తే పలికే వాళ్ళు, కో అంటే కోటి మంది, అగమ్యగోచరం,తల తోక, చేత వాత కాకపోవటం - ఇవి పలుకుబడులు.

కలవానితో నీకుఁ గలహ మేటికిఁ జెప్పు, చే విల్లు జెడ నోటఁ జెందవలసె;
మామపైనే పంతమా నీకు, కొరమాలి వోయి నీ యిల్లాలు బుగ్గి యయ్యె;
చిచ్చు చూపునఁ బొరిపుచ్చితే మారుని, తుది గౌరి నీ కాలుద్రొక్కి మెరసె;
శిరము ద్రుంతువె సురజ్యేష్ఠుని, యుగయుగమ్ములపాటు చేతికిఁ బునుక వచ్చె;
నలవి గానట్టి పనులనుఁ దలనుఁ దాల్చి
పరులు ముదమందఁ బలుపాట్లు బడగ నేల?
కొండ వెర్రి పప్పవు నీవొకండ విట్లు
జేయుదువుగాని మరొకండు జేయఁబోడు. 55

కలవానితో,నీకున్,కలహము,ఏటికి,చెప్పు=సంపన్నుడితో నీకు పోట్లాట ఎందుకు,చెప్పు?
ఏ,విల్లు,చెడన్,ఓటన్,చెందవలసె=చేతిలో విల్లు చెడిపోవటంతో ఓటమి చెందవలసి వచ్చింది.
నీకు, మామ,పైన్,ఏ,పంతము+ఆ?= నీకు, నీ మామగారి మీదనే పట్టుదలా?
కొర,మాలి, పోయి, నీ, ఇల్లాలు, బుగ్గి, అయ్యె= ఊరక పోయి నీ భార్య బూడిద ఐ పోయింది.
చిచ్చు,చూపునన్,మారుని, పొరిపుచ్చితి+ఏ=నిప్పు కంటి చూపుతో మన్మథుడిని కాల్చావా?
తుది, గౌరి, నీ, కాలు,త్రొక్కి, మెరసె= చివరకు, పార్వతి నిన్ను పెళ్ళాడి ప్రసిద్ధురాలైంది.
(కాలుద్రొక్కుట= 1.పెళ్ళాడటం , 2.కాలిని తొక్కటం-గెలిచినట్లు.)

సుర-జ్యేష్ఠుని,శిరము,త్రుంతువు+ఎ= దేవతలో కెల్ల పెద్దవాడిని, బ్రహ్మను,తల నరకుతావా?
యుగయుగమ్ముల,పాటు, చేతికిన్, పునుక, వచ్చెన్ = కొన్ని యుగాల పాటు నీ చేతికి పుర్రె అంటుకొని ఉన్నది.

అలవి, కాని+అట్టి, పనులనున్,తలనున్,తాల్చి= నీకు వల్లగాని పనులను నెత్తిన వేసుకొని,
పరులు, ముదము,అందన్, పలు,పాట్లు, పడగన్,ఏల? = ఇతరులు సంతోషించేటట్లు,పెక్కు కష్టాలు పడటం ఎందుకు? (పరులు=1.ఇతరులు,2.పగ వాళ్ళు)

కొండ, వెర్రి, పప్పవు, నీవు,ఒకండవు, ఇట్లు,చేయుదువు,కాని = కొండ వెర్రి పప్పవు కాబట్టి, నీవు ఒకడవు మాత్రం ఇలా చేస్తావు గాని,

మరి,ఒకండు, చేయన్,పోడు = ఇంకొకడు మాత్రం చేయాలని చూడడు.

ఇది- హరిహరయుద్ధం, దక్షయజ్ఞం, మన్మథదహనం,గౌరీకల్యాణం మొదలైన కథలకు సంబంధించినది.

కలవాడు, కాలుతొక్కటం, యుగయుగాలపాటు, చేతికి చిప్ప రావటం, అలవి కావటం, పాట్లు పడటం - ఇవి పలుకుబడులు.

కొండవెర్రి పప్ప అనేది వ్యవహారంలో హాస్యంగా వాడే తిట్టు. శివుడు కొండమీద ఉండే వాడు, బోళాశంకరుడు, కాబట్టి, నిజంగానే ఒక ' కొండ వెర్రి' పప్ప. పప్ప అంటే ఒక భక్ష్యం పేరు.

ఒక ముదుక తబిసి యాకటి

తకబిక నుండూరి నొక్క తబ్బిబ్బాడన్,

ఒక దెస విని విననట్లుం

డక, వానిని నూరు వెడల నడపితి వకటా! 56

ఒక,ముదుక,తబిసి,ఆకటి,తకబికన్ = ఒక ముసలి ముని, ఆకటి బాధతో,
ఉండు+ఊరిన్, ఒక, తబ్బిబ్బు,ఆడన్ = తాను/నీవు నివసించే స్వగ్రామాన్ని ఒక పొందని

మాట ఏదో అంటే,

విని,వినని,అట్లు,ఒక,దెసన్,ఉండక = విని కూడ వినిపించుకోనట్లు ఒక పక్కన ఉండక,

అకటా! వానినిన్, ఊరు,వెడలన్, నడపితివి = అయ్యో పాపం! ఆ ముసలి మునిని, ఊరు వదలి పొయ్యేటట్లు పంపి వేసావు.

ఇది, వ్యాసుడి కాశీబహిష్కారం కథకు సంబంధించినది.

తకబిక, ఉండూరు, తబ్బిబ్బాడటం, విని విననట్లు, ఊరు వెళ్ళగొట్టటం - ఇవి పలుకుబడులు.

భీమునిన్ రుద్రు నుగ్రు ధన్విని౯ గపాలి

నిన్ను, సాంబుండు,సోముండు నన్న యట్టి

కతమునన్ జేరగా౯ దగు౯; గాక యున్న

నిట్టి నీ మోము౯ జూడంగ నెవడు సైచు? 57

భీమునిన్,రుద్రునిన్,ఉగ్రునిన్,ధన్విన్,కపాలిన్,నిన్ను = భీముడివైన నిన్ను,రుద్రుడవైన నిన్ను, ఉగ్రుడవైన నిన్ను, రుద్రుడవైన నిన్ను, ధన్వివైన నిన్ను, కపాలివైన నిన్ను,

స+అంబుండున్, స+ఉముండున్ ,అన్న,కతమునన్,చేరగాన్,తగున్= సాంబుడు కూడ ఐ ఉన్నాడు, సోముడు కూడ ఐ ఉన్నాడు- అనే కారణంగా చేరవచ్చును .

కాక,ఉన్న = అలా కాకపోతే కనుక,

ఇట్టి,నీ,మోమున్,చూడంగన్,ఎవడు,సైచు?=ఇలాంటి నీ మొగం చూడటానికి ఎవడు సహిస్తాడు?

భీముడు=భయంకరుడు-ఇది భయానికి కారణం. రుద్రుడు=రోదించిన వాడు-ఇది అనిష్టతకు కారణం. ఉగ్రుడు= కోపించినవాడు-ఇది భయానికి కారణం. ధన్వి= ధనుస్సును పట్టిన వాడు-ఇది భయానికి కారణం. కపాలి=పుర్రెను పట్టిన వాడు- ఇది జుగుప్సకు కారణం. ఇవన్నీ వ్యతిరేకతను కలిగించే లక్షణాలు. కాబట్టి చేరలేము.

సాంబుడు=అంబతో-అంటే- పార్వతితో కలసి ఉన్నవాడు. సోముడు=ఉమతో కలసి ఉన్న వాడు. ఈ రెండూ నిర్భయత్వానికి కారణాలు. కనుక చేరవచ్చు.

ఇక్కడ కాకయున్న అన్నచోట, అరసున్న పట్టింపు వదలి వేసి, కాక=కాఁక అనుకొంటే, రెండు అర్థాలు వస్తాయి.

1) కాక యున్న =కాక-ఉన్న =కాకపోయి ఉంటే(అలా సామత్వం,సోమత్వం లేకపోయి ఉంటే).

2)కాఁక యున్న =కాఁక-ఉన్న =వేడి గల. నిటలాగ్నివలన, శివుడి ముఖం కాఁక గలది గదా! అలాంటి కాఁక ఉన్న మొగాన్ని చూడగల వాడు ఎవడు?

మొగం చూడటం - ఇది ఒక పలుకుబడి. 'వాడి మొగం చూచే వాళ్ళు లేరు'.)

ఎచ్చులకుఁ బోయి నొసటన్

జిచ్చొక్కటి డాచ నేల? చేడ్పడి యూష్మం

బెచ్చగుటఁ, శాంతి కౌదలఁ

బిచ్చి శివా మోయ నేల, విధువున్ గంగన్? 58

పిచ్చి,శివా! = వెర్రి శివా!

ఎచ్చులకున్,పోయి = పగ్గెను చూపటానికి అని,

నొసటన్,చిచ్చు,ఒక్కటి, డాచన్,ఏల?= నుదుట ఒక అగ్నిని దాచుకోవటం ఎందుకు?

ఊష్మంబు,ఎచ్చినన్,చేడ్పడి = వేడి ఎక్కువ కావటంతో కష్టపడి/భంగపాటు పడి,

శాంతికి = ఆ వేడి తగ్గిపోవటానికి,

ఔదలన్,విధువున్,గంగన్,మోయన్,ఏల?= తలమీద గంగను, శివుడిని మోయటం ఎందుకు?

ఎచ్చులకు పోవటం-ఇది ఒక పలుకుబడి. 'ఎచ్చులకు పోయి అప్పుడా పని చేయటమెందుకు? ఇప్పుడు ఏడవటం ఎందుకు?'. 'ఎచ్చులకు పోయి ఏటను కోస్తే ఒళ్ళంతా బొచ్చైంది'.-సామెత.

మోమందమునుఁ జూడ నేమైన లొచ్చె? పై పెచ్చుగాఁ గలదొండు చిచ్చు కన్ను,

కలిమి గొప్పల నెన్నగా నేమి కొరతయా? కొండంత బయలైన కొంప గలదు,

వాహనమ్ముల శోభ వర్ణింపఁ దక్కువా? తాతలనాటి తత్తడి వృషంబు,

బంటు బైదల తీరు వచియింప లోటేమి? వింతరీతుల వారు పెక్కు గలరు,

నిప్పులో దూకె తొలి యాలు, నెత్తి కెక్కె

నొక్క నిమ్నగ, మలి యాలు చక్కసగము

మేనిఁ గాఁజేసె, నిట్లెందుఁ గానరాని

కేరడంబయ్యె లింగ! నీ గేస్తుతనము. 59

మోము,అందమునున్,చూడన్,ఏమి,ఐన,లొచ్చు+ఎ?= ముఖంయొక్క అందాన్ని చూస్తే, ఏమైన తక్కువ ఐందా ఏమిటి?

పై, పెచ్చుగాన్,ఒండు, చిచ్చు, కన్ను,కలదు = తక్కువ కాకపోగా, ఇంకా ఎక్కువగా, ఒక నిప్పు కన్ను కూడ ఉన్నది.

కలిమి, గొప్పలన్, ఎన్నగాన్,ఏమి, కొరత+ఆ? = సంపదల గొప్పతనాన్ని చెప్పాలంటే, ఏమైన తక్కువ ఔతుందా ఏమిటి?

కొండ+అంత, బయలు+ఐన, కొంప, కలదు= కొండంత, విశాలమైన, ఇల్లు ఉన్నది.

వాహనమ్ముల, శోభ, వర్ణింపన్.తక్కువ+ఆ?= వాహనాల సొగసును వర్ణించాలంటే మాత్రం తక్కువ ఏమి ఉన్నది?

తాతల,నాటి, తత్తడి, వృషంబు = తాతల కాలం నాటినుండి వాహనమైన ఎద్దు ఉన్నది.

బంటు,పైదల, తీరు, వచియింప,లోటు,ఏమి?= పనివాళ్ళ తీరును చెప్పటానికి ఏమి లోటుంది?

వింత,రీతుల, వారు, పెక్కు, గలరు = చిత్రవిచిత్రమైన పోకడల వాళ్ళు ఎంతో మంది ఉన్నారు (వికారరూపులైన ప్రమథులు).

తొలి, ఆలు, నిప్పులో, దూకె = మొదటి భార్య అగ్నిలో దూకింది (సతీదేవి).

ఒక్క, నిమ్నగ,నెత్తికి, ఎక్కె = ఒక నది, తలమీదకు ఎక్కి కూర్చున్నది.(నిమ్నగ= పల్లానికి/ క్రిందికి పారేది=నది. కనుక నీచత్వం గలది అని సూచన.)

మలి,ఆలు, చక్క,సగము, మేనిన్, కాజేసెన్ = రెండవ భార్య, సరిగా సగం దేహాన్ని తాను తీసుకొన్నది..

లింగ! =శివా!

ఇట్లు, నీ, గేస్తుతనము = ఈ విధంగా, నీ గృహస్థత్వం,

ఎందున్,కానరాని, కేరడంబు,అయ్యె = ఎక్కడా కనబడనంత ఎగతాళి ఐ పోయింది.

శివుడి ఇల్లు కైలాసం. అది నిజంగానే 'కొండం'త, నిజంగానే 'బయలు'.

ముఖం అందం, పై పెచ్చు, కొండంత, తాతల నాటి, బంటు పైద, నిప్పులో దూకటం, నెత్తికెక్కటం, కాజేయటం - ఇవి పలుకుబడులు.

అన్నపానంబుల యాసఁ జూపుదునన్న, విసముఁ దింటివి, తల నెసగు గంగ;

కొంప గోడియుఁ జూపి యింపుఁ గూర్చెదనన్నఁ, గొండిల్లు కాడిల్లు రెండుఁ గలవు,

పైడిపెండుల నిచ్చి పట్టి యుంచెదనన్న, రెండు వింటను నింటఁ గొండలంత;

నగ నట్ర వేయించి బిగియఁ బట్టుదు నన్నఁ, బాపదండలె నీకు మోపె డుండె,

నిన్నుఁ బట్టంగఁ దగిన తీరెన్నఁ జాలఁ;

గలదు ప్రక్షుణ్ణకర్మమార్గంబు, కాని

దాని జాడలు మాకసాధ్యములు గానఁ,

దలపులో నిల్వు మంతమాత్రమ్ము చాలు. 60

అన్నపానంబుల,ఆసన్, చూపుదున్,అన్న = తిండి, నీళ్ళు అనే వాటి ఆశ పెట్టేదా-అంటే,

విసమున్,తింటివి, తలన్,గంగ, ఎసగు = విషాన్ని తిన్నావు, తలమీదనే గంగ

వెలిగిపోతున్నది.

కొంప గోడియున్, చూపి, ఇంపున్, కూర్చెదన్, అన్నన్ = ఏ ఇల్లో ఏదో ఇస్తానని చూపించి ఇష్టాన్ని కలిగించేదా- అంటే,

కొండ,ఇల్లు, కాడు,ఇల్లు, రెండు, కలవు= కొండ ఇల్లు (కైలాసం)ఒకటి, వల్లకాటి ఇల్లు ఇంకొకటి, రెండు ఇళ్ళు ఉన్నాయి.

పైడివెండులన్, ఇచ్చి, పట్టి, ఉంచెదన్, అన్న = బంగారాన్ని వెండిని ఇచ్చి పట్టుకొని ఉంచేదా-అంటే,

రెండు, వింటనున్, నింటన్, కొండల+అంత = ఆ బంగారమూ వెండీ, రెండు కూడ, ఒకటి ధనుస్సులోను, ఇంకొకటి ఇంటిలోను, ఒక్కొక్కటి కొండంతగా, ఉన్నాయి.

నగ నట్ర, వేయించి, బిగియన్, పట్టుదున్,అన్నన్ = ఏ నగలో పెట్టి, పోనీక గట్టిగా పట్టుకొని ఆపి ఉంచేదా- అంటే,

పాప-దండలు+ఎ, నీకు, మోపెడు, ఉండె = పాము గొలుసులే నీకు ఒక మోపెడు ఉన్నాయి.

నిన్నున్, పట్టంగన్,తగిన, తీరు, ఎన్నన్,చాలన్ = నిన్ను పట్టుకోవటానికి సరైన దారిని చెప్పలేకపోతున్నాను.

ప్రక్షుణ్ణ-కర్మ-మార్గంబు,కలదు, కాని = ఎందరో ఎప్పటినుండో ఆచరించిన కర్మమార్గం అనేది ఒకటి ఉన్నది గాని,

దాని, జాడలు, మాకు, అ-సాధ్యములు, కానన్ = ఆ కర్మమార్గపు పద్ధతులు మాకు వల్లగానివి కాబట్టి,

తలపులో, నిల్వుము, అంత,మాత్రమ్ము+అ, చాలు=మనసులో ఉండు. ఆ మాత్రం ఐతే చాలు.

అన్నపానములు, కొంప గోడి, పైడి వెండులు, నగ నట్ర, మోపెడు ఉండటం, అంత మాత్రం- ఇవి పలుకుబడులు.

స్త్రీల వంచించి, మగల ధార్మికతఁ జెరచి

త్రిపురవీరుల హరియె కుందింపఁ, జంపి;

యమరి యుండిన దానిలో యత్త ప్రేలు

బెట్టినట్లు, పురారి నాఁ బేరు బడితె! 61

స్త్రీల,వంచించి = (త్రిపురాలలోని) స్త్రీలను మాయ చేసి, తప్పు దారిలో పెట్టి,

మగల,ధార్మికతన్,చెరచి = మగ వాళ్ళ ధర్మనిష్ఠను చెడగొట్టి,

త్రిపుర-వీరుల = త్రిపురాలలోని దైత్యవీరులను,

హరి+ఎ,కుందింపన్,చంపి = విష్ణువే బలహీనపరిచి ఉంచగా, అప్పుడు చంపి,

అమరి,ఉండిన,దానిలో, అత్త,ప్రేలు,పెట్టిన+అట్లు = అమర్చిన దానిలో అత్త వచ్చి వేలు పెట్టి నట్లు (పని అంతా ఐన తరువాత చివరలో నామమాత్రంగా పాలుగొన్నట్లు),

పుర-అరి,నాన్,పేరు, పడితి+ఎ? = పురారి/పురహరుడు అని పేరు తెచ్చుకొన్నావా?

ఇది, త్రిపురదాహం కథకు సంబంధించినది.

అమర్చిన దానిలో అత్త వచ్చి వేలు పెట్టటం, పేరు పడటం - ఇవి పలుకుబడులు.

తల యింత బెరుగ మాకుస్

జిల బుట్టును, పేలు బట్టు, చిమచిమలాడుస్;

దల నడవిఁ బోలు జడలస్

జలింప కుంటి వెటు కల్పశతము కపర్దీ! 62

తల,ఇంత,పెరుగ,మాకున్ = తల జుట్టు కొద్దిగా పెరిగితే, మాకు,

జిల-పుట్టును,పేలు,పట్టు, చిమచిమలాడున్ = తలంతా దురద పుడుతుంది, తల నిండా పేలు వస్తాయి, తల మొత్తం చిమచిమలాడుతూ ఉంటుంది.

కపర్దీ = కపర్దం ఉన్నవాడా!

(శివుడి జటాజూటానికి కపర్దం అని పేరు. కపర్ది అనే సంబోధనం ఇక్కడ సాభిప్రాయం.)

తలన్,అడవిన్,పోలు,జడలన్ = తలమీద, అడవి లాగా అంటుకొనిపోయిన జడలతో, కల్ప-శతము,చలింపక,ఎటు,ఉంటివి? = నూరు కల్పాల కాలం పాటు, నిశ్చలముగా ఎలా ఉన్నావు?

తల పెరగటం, జిల పుట్టటం, పేలు పట్టటం, చిమచిమలాడటం, తల అడవిలాగ ఉండటం - ఇవి పలుకుబడులు.

ఒక రాజరాజు దయతో

నొక కొండ నొసంగ, నిలువ, కుర్విఁ గల గిరుల్

దెకతేరగఁ గొందువె మా

నక, 'యిటు జరుగు మన నిల్లు నా'దను రీతిన్ 63

ఒక,రాజరాజు, దయతోన్, ఒక,కొండన్,ఒసంగ = ఒక రాజరాజు (కుబేరుడు) దయదలచి, నీకు ఒక కొండను ఇస్తే,

నిలువక = అక్కడ ఉండక, దానితో ఆగక,

ఇటు,జరుగుము,అనన్,ఇల్లు,నాది,అను,రీతిన్='ఇటు జరుగు' అని అంటే,'ఇల్లు నాదే' అన్నట్లు

ఉర్విన్,కల,గిరుల్,తెకతేరగ, మానక,కొందువె?= భూమిమీద ఉన్న కొండలను అన్నిటినీ తేరగా,ఆపకుండ, తీసుకొంటావా?

కుబేరుడు శివుడికి ఒక కైలాసాన్ని మాత్రమే నివాసంగా ఇచ్చాడు, కాని శివుడు పెక్కు కొండల మీద వెలిసాడు.

" 'ఇటు జరుగు' మంటే 'ఇల్లంతా నాదే' అన్నాడట"- అని ఒక సామెత. దీనినే కొందరు, 'ఇసుంటా రమ్మంటే ఇల్లంతా నాదేనన్నట్లు' అని కూడ అంటారు.

చేతఁ దాల్తు తాటి చెట్టంత శూలమ్ముఁ

గంతుఁ గాల్చితంట కంటిమంట,

మదినిఁ బెరుగుచున్న మమత నహంతనుఁ

ద్రుంపఁ గాల్ప నేల దొరవు గావు? 64

తాటి,చెట్టు,అంత,శూలమ్ముఁన్, చేతఁ తాల్తు= తాటి చెట్టంత పెద్ద శూలాన్ని చేత బట్టుకొంటావు.

కంటి,మంట,కంతున్,కాల్చితి,అంట = కంటిలోని అగ్నితోనే మన్మథుడిని కాల్చి వేసావట!

మదినిన్,పెరుగుచున్న = నా మనసులో పెరుగుతూ ఉన్న

మమతన్,త్రుంపన్,అహంతనున్,కాల్పన్ = మమకారాన్ని తుంచి వేయటానికి గాని,

అహంకారాన్ని కాల్చి వేయటానికి గాని,

దొరవు,కావు,ఏల? = సమర్థుడవు కావు, ఎందుకని?

శూలం అన్నది తుంచటానికి, అగ్ని ఉన్నది కాల్చటనికే కదా!

నీకడ యెద్దు గల్గు, నది నిక్కమె, దుక్కులు దున్న నేర్చునే!

నీకుఁ ద్రిశూల ముండుటయు నిక్కమె, గుంటక పాటి గాదుగా!

వాకయు నీ తలం గలదు, పంట పొలాల కొకింత పారునే?

ఈ కొరగాని వస్తువుల నేలెడు నిన్ హాలికుండు మించడే? 65

నీ కడ,ఎద్దు,కల్గున్, అది,నిక్కము+ఎ = నీ దగ్గర ఎద్దు ఉన్నది, ఆ మాట నిజమే.

దుక్కులు,దున్న,నేర్చునే? = ఆ ఎద్దు, దుక్కి దున్నగలదా?

(దుక్కి=దున్నటం. దుక్కి,కొండ్ర,చాలు..- ఇవి, అరక దున్నటానికి సంబంధించిన పదాలు.)

నీకున్,త్రిశూలము,ఉండుటయు, నిక్కము+ఎ=నీకు ఒక త్రిశూలం ఉన్న విషయమూ నిజమే.

గుంటక,పాటి,కాదుగా! = ఆ శూలం , గుంటకకు కూడ సమానం కాదు గదా!

(పొలం దున్ని,విత్తిన తరువాత దానిని చదును చేసే సాధనం పేరు గుంటక. నాగలి,గొర్రు,

గుంటక అనేవి ఒకప్పటి రకరకాలైన కృషిసాధనాలు.)

నీ,తలన్,వాకయున్,కలదు = నీ తలమీద నది కూడ ఉన్నది.

పంట,పొలాలకు,ఒక,ఇంత,పారునే?=పంట చేలలోనికి ఏ కొద్దిగా ఐనా పారుతుందా ఆ నది?

ఈ,కొరగాని,వస్తువులన్, ఏలెడు,నిన్ = ఈ పనికిమాలిన వస్తువులను స్వాధీనంలో ఉంచు కొన్న నిన్ను,

హాలికుండు ,మించడే?= ఒక కర్షకుడు మించిపోడా?

దుక్కులు దున్నటం, ఒకింత, పాటి కావటం/చేయటం, కొరగాని - ఇవి పలుకుబడులు.

కలవారు గోర హాలా

హలముం గొని జగముఁ బ్రోచి, తధికుడ వీవో!

హలముం గొని భువి దున్నుచు,

నిల జనులకుఁ దిండిఁ బెట్టు కృషికుడధికుడో! 66

కలవారు, కోర = సంపన్నులైన వాళ్ళు (విష్ణువు,దేవతలు) అడిగినందుకు,

హాలాహలమున్,కొని,జగములన్,ప్రోచితి (వి) = హాలాహలాన్ని తీసుకొని, నీవు లోకాలను కాపాడావు .

అధికుడవు,ఈవు+ఓ= గొప్ప వాడవు, నీవౌతావో, (లేక)

హలమున్,కొని,భువి,దున్నుచున్ = నాగలిని పట్టి నేలను దున్నుతూ

ఇల,జనులకున్,తిండిన్,పెట్టు,హాలికుడు ,అధికుడో! = లోకంలో జనానికి తిండి పెట్టే కర్షకుడు అధికుడౌతాడో!

అప్పుడు ఒకడు హాలాహలాన్ని తీసుకోబట్టి జనం బ్రదికారు. ఇప్పుడు ఒకడు హలాన్ని తీసుకోబట్టి జనం బ్రదుకుతూ ఉన్నారు.

జడత గలిగిన హైమాద్రిసాను లందుఁ

దిరుగఁ జాలిన యంతటి దిట్టవైన,

జడత మీరిన ననుఁబోలు జనుల యెదల

నొక్క రవ్వంత సేపైన నుండఁ గలవె? 67

జడత,కలిగిన,హైమ-అద్రి-సానుల, అందున్ = చలికి మొద్దుబారిన హిమాచలపు చరియల మీద (జడము=చల్లనిది, జడత/జడత్వం=చల్లదనం.

తిరుగన్,చాలిన, అంతటి,దిట్టవు,ఐన = తిరగగల అంతటి సమర్థుడవే నీవైతే,

జడత,మీరిన,ననున్,పోలు, జనుల,ఎదలన్ = మొద్దుతనం పెచ్చరిల్లిన నాబోటి మనుషుల మనసులలో (జడము=మూఢము, జడత/జడత్వం=మూఢత్వం)

ఒక్క,రవ్వ,అంత,సేపు,ఐనన్,ఉండన్,కలవె? = ఒక్క కాస్తంత సేపు నిలువగలవా?

ఆ జడత్వం నిన్ను తిరగనిస్తుందేమో కాని, ఈ జడత్వం నిన్ను ఉండనీయదు అని భావం.

ఇక్కడ 'సానులందు' అనచోట చెప్పినవి సంస్కృతసానువులు గాని, తెలుగుసానులు కాదు. సానువు అంటే 'కొండ చరియ' బహువచనంలో,సానువులు=సానులు. ఇక, తెలుగు సానులు వేరు, వాళ్ళ కథలు వేరు, వాళ్ళతో గాని, వాటితో గాని, మనకు పని లేదు.)

ఒక్క రవ్వంత సేపు - ఇది పలుకుబడి.

ఆలు చండి, లంబోదరుం డగ్రసుతుడు,

షణ్ముఖుడు చిన్న కొడుకు, బిచ్చమ్ము వృత్తి,

ఇల్లు గడచుటకే బ్రదు కెల్లఁ దెల్ల

వారు నీకు; నే మొరగు నీవలన నాకు? 68

ఆలు,చండి = నీ భార్య చండి. (పార్వతి పేర్లలో ఒకటి చండి.)

(చండి=కోపన,గయ్యాళి. గయ్యాళి కాబట్టి,ఎంత తెచ్చినా ఇంకా తేలేదని అరుస్తుంది.)

అగ్ర-సుతుడు,లంబోదరుండు= పెద్ద కొడుకైన వినాయకుడేమో, ప్రేలు బొజ్జ వాడు (పెద్ద పొట్ట వాడు= బాగా తిండి పోతు)

చిన్న,కొడుకు,షట్-ముఖుడు = చిన్న కొడుకు కుమారస్వామేమో, ఆరు ముఖాల వాడు (ఆరుగురి తిండి తింటాడు)

వృత్తి,బిచ్చమ్ము = నీకు జీవనాధారమా, బిచ్చమెత్తుకోవటం. (అడుగుకోవటంతో ఇంత తిండి దొరకుతుందా?)

ఇల్లు గడచుటకు+ఏ,నీకున్,బ్రదుకు,ఎల్లన్, తెల్లవారు = కుటుంబపోషణతోనే నీకు బతుకంతా సరిపోతుంది.

నీవలన,నాకు,ఏమి,ఒరగు? = నీవలన నాకు వచ్చి పడేది ఏముంటుంది?

ఇల్లు గడవటం, బతుకు తెల్లవారటం , ఒరగటం - ఇవి పలుకుబడులు. -

నెత్తిఁ దాకిన నిలువున నీఱొనర్చు

వరముఁ గొని, దాని నీయందె పట్టి చూడ

నసుర దరుముచో, హరి గావడయ్యె నేనిఁ

గానఁబడకున్నె నీ యెమ్మెకానితనము? 69

నెత్తిన్,తాకిన,నిలువునన్,నీరు,ఒనర్చు వరమున్,కొని= తలమీద తాకగానే నిలువున బూడిద చేసే వరాన్ని పొంది,

దానిన్, నీ,అందె,పట్టి చూడన్,అసుర,తరుముచోన్ = ఆ వరాన్ని నీమీదనే పరీక్షించాలని రాక్షసుడు (భస్మాసురుడు) తరిమేటప్పుడు,

హరి,కావడు అయ్యెన్ ,ఏనిన్ = విష్ణువు కాపాడక పోయి ఉంటే గనుక,

నీ,ఎమ్మెకానితనము, కానబడక,ఉన్నె?= నీ నేర్పరితనం బయట పడి ఉండేదే కాదా?

ఇది, భస్మాసురుడికి కథకు సంబంధించినది.

నిలువున నీఱు చేయటం, పట్టి చూడటం - ఇవి పలుకుబడులు.

గడ్డిగాదము మేసి కడుపు నించును గాని, మెసవఁ బోవదు పెను విసపు ముద్ద;
గాడి చెంగటఁ ద్రాటఁ గట్ట నుండును గాని, కొండకుఁ గాటికి గునుకు లిడదు,
నార పట్టెడ నర్రు జేరనిచ్చును గాని, చెట్టపాముల మెడఁ జుట్టుకొనదు;
అరక దున్నుచు నూళ్ళ సిరుల నింపును గాని,యూళ్ళకూళ్ళను గాల్ప నురుకఁబోదు
పసర మయ్యు నుఁ దెలివితో బ్రదుక నేర్చి,
నీకు లేని వివేకమ్ము నెరపెఁ గనుక,
యెంచ నీకంటె నాబోతె యెంతొ మెరుగు;
దాని నెక్కకు, మోయు మద్దాని నీవ. **70**

గడ్డి గాదము,మేసి,కడుపు,నించును,కాని=ఏ గడ్డినో మేసి పొట్ట నింపుకొంటుంది గాని,
పెను,విసపు,ముద్ద,మెసవన్,పోవదు = పెద్ద విషపు ముద్దను తినదు.
గాడి ,చెంగటన్, త్రాటన్,కట్టన్, ఉండును,కాని = గాటి పక్కన తాడుతో కట్టి వేస్తే, అక్కడే ఉంటుంది గాని,
కొండకున్,కాటికిన్,గునుకులు,ఇడదు = ఏ కొండకో, ఏ వల్లకాటికో, పరుగులు పెట్టదు.
(గునుకు=పరుగు. శివుడైతే, అటు కైలాసం కొండకో, ఇటు వల్లకాటికో, పోతూనే ఉంటాడు.)
నార,పట్టెడన్,అర్రు,చేరన్,ఇచ్చును,కాని=నారతో చేసిన పట్టెడను మెడ మీదకు రానిస్తుంది గాని
చెట్ట,పాముల,మెడన్,చుట్టుకొనదు = పాడు పాములను మెడకు చుట్టుకోదు.
అరక,దున్నుచున్,ఊళ్ళ,సిరులు,నింపును,కాని = అరక దున్నుతూ, ఊళ్ళలో సంపదలను నింపుతుంది గాని,
యాళ్ళకు,ఊళ్ళనున్,కాల్పన్, ఉరుకన్,పోదు = ఊళ్ళకు ఊళ్ళనే పూర్తిగా తగుల బెట్టటానికి పరుగులు తీయదు.
పసరము, అయ్యునున్,తెలివితో, బ్రదుక, నేర్చి= పశువే ఐనప్పటికి, తెలివి గలిగి ఉండి, ఎలా

బ్రదకాలో అన్నది తెలుసుకొని ఉండి,

నీకు, లేని, వివేకమ్ము, నెరపెన్,కనుక = నీకు లేకపోయిన వివేకాన్ని అది చూపింది కాబట్టి,

ఏంచన్,నీకంటెన్,ఆ బోతు+ఎ, ఎంత+ఒ, మెరుగు= ఆలోచించగా, నీకంటె ఆబోతే చాలా మేలు.

నీకంటె, మంచిచెడ్డలు బాగా తెలిసిన ఆ ఎద్దే ఎక్కువ.

దానిన్,ఎక్కకు = ఆ ఎద్దును నీవు ఎక్కవద్దు.,

ఈవు+అ, ఆ+దానిన్,మోయుము=నీవే దానిని మోయి.

గడ్డి గాదము,కడుపు నింపటం/నింపుకొనటం,ఊళ్ళకు ఊళ్ళు,బ్రతక నేర్వటం- పలుకుబడులు.

సృష్టిఁ జేయుట, దాని రక్షించుటయును

గొప్ప యగుఁ గాని, సంహృతి గొప్ప యగునె?

వలతి గావలెఁ గుండ దొంతులనుఁ బేర్పఁ

గూలఁద్రోయగఁ జాలదే కుక్క కూన ? 71

సృష్టిన్,చేయుట,దాని,రక్షించుటయును ,గొప్ప,అగున్,కాని = సృష్టిని చేయటము, ఆ చేసిన సృష్టిని కాపాడటము , గొప్ప పనులు ఔతాయి గాని,

సంహృతి,గొప్ప,అగునె? = సృష్టిని సంహరించటం/నిర్మూలించటం గొప్ప అవుతుందా?

కుండ,దొంతులనున్,పేర్పన్,వలతి,కావలెన్=కుండల దొంతరలను పేర్చాలంటే నేర్పరి కావాలి

కూలన్.ద్రోయగన్,కుక్క,కూన,చాలదే! = (ఆ కుండ దొంతరలనే) పడ దోయాలంటే, కుక్క పిల్ల చాలదూ?

ఆలో రక్తముఁ ద్రావు, నేనుఁ దనయుం డైదారు నోళ్ళన్ దినన్

జాలం జిక్కదు బిచ్చ , మీదు టెటులీ జంజాట మంచేడ్చి, నీ

వాలుంబిడ్డలఁ బ్రోవలేక మడియన్ హాలాహలంబుం దినన్,

ప్రేలం జొచ్చిరి లోకరక్షకనుచున్, వెయ్యేల? మూఢుల్ జనుల్ . 72

ఆలు+ఓ, రక్తమున్,క్రోలున్= భార్యయా, రక్తం త్రాగుతుంది. (=పీడిస్తుంది)

ఏనున్, తనయుండు, ఐదు,ఆరు,నోళ్ళన్,తినన్ = నేను ఐదు నోళ్ళతో తినటానికి, నా కొడుకు ఆరు నోళ్ళతో, తినటానికి

చాలన్,బిచ్చము,చిక్కదు = సరిపడ బిచ్చం దొరకదు.

ఈ.జంజాటం,ఈదుట,ఎటులు,అంచు,ఏడ్చి= ఈ కష్టాన్ని ఈదటం ఎట్లాగా అని దుఃఖపడి.,

ఆలున్,బిడ్డలన్,ప్రోవలేక,మడియన్,నీవు, హాలాహలంబున్,తినన్= పెళ్ళాన్ని పిల్లలను పోషించలేక, చనిపోవటానికి నీవు హాలాహలాన్ని తింటే,

లోక-రక్షకు,అనుచున్,ప్రేలన్,చొచ్చిరి=లోకాల రక్షణకు- అని వాగటం మొదలు పెట్టారు(జనం).

వెయ్యి,ఏల? జనుల్,మూఢుల్ = వెయ్యి మాటలు ఎందుకు? జనులు వట్టి వెర్రి వాళ్ళు.

'నిర్విణ్ణః స పపౌ కుటుంబకలహా దీశో ఽపి హాలాహలమ్' అని చమత్కారశ్లోకం ఒకటి ఉన్నది.

రక్తము త్రాగటం, ఐదారు, జంజాటము ఈదటం, వెయ్యేల – ఇవి పలుకుబడులు.

దక్షుఁ జంపింపఁ జంద్రునిఁ దన్ని పంప,

మామ పగ యయ్యె , జగిలెడు మాడు మెట్టె,

వెక్కిరించుచోఁ బడి చట్ట విరిగినట్లు,

లేమి బూనితి వేమయ్యె నిందుమౌళి! 73

దక్షున్.చంపింపన్= దక్షుడిని చంపించటంవలన,

చంద్రునిన్,తన్ని,పంపన్ = చంద్రుడిని తన్ని పంపించటంవలన,

మామ,పగ,అయ్యె = మామ పగవాడు ఐనాడు.

జగిలెడు,మాడు,మెట్టె = తోడల్లుడు నెత్తి మీదికి వచ్చాడు.

(జగిలెడ=తోడల్లుడు. ఇలాంటివే, వీరకాడు=వియ్యంకుడు, వీరకత్తె=వియ్యపురాలు)

వెక్కిరించుచోన్,పడి,చట్ట,విరిగినట్లు = ఒకరిని వెక్కిరిస్తూ ఉండగా పడి బుజం విరిగినట్లు,

ఇందుమౌళి! = చంద్రమౌళీ! (ఈ సంబోధనం ఇక్కడ సాభిప్రాయం.)

ఏమి,పూనితివి?ఏమి,అయ్యె? =ఏమి చేయాలని ప్రయత్నించావు? చివరకు ఏమి జరిగింది?

ఇది దక్షయజ్ఞం కథకు సంబంధించినది.

చంపించిన దక్షుడేమో బ్రదికాదు, పగ మాత్రం మిగిలి పోయింది. తన్నులు తిన్న చంద్రుడేమో శివుడి నెత్తి మీదనే పీట పెట్టుకొన్నాడు. వెక్కిరించబోయి వెలకిల బడ్డట్లు ఐంది కదా!

వెక్కిరింపబోయి వెల్లకిల బడ్డట్లు - అనేది ఒక పలుకుబడి.

రాళ్ళు రప్పలు మోచి సర్పమ్ము గొలిచెఁ,

గొలిచె నాకు నలముఁ దెచ్చి కుంభి గూడ,

కడుపు చల్ల గదల కుండె గుడిన చెలది,

మూటి నొక పాటిఁ బాటించి ముక్తి నిడుదె? 74

రాళ్ళు,రపలు,మోచి,సర్పమ్ము,కొలిచె = రాళ్ళను రప్పలను (తలమీద పెట్టుకొని) మోసి తెచ్చి పాము పూజించింది.

కుంభి,కూడ, ఆకు, అలమున్, తెచ్చి, కొలిచె = ఏనుగు కూడ ఆకులు అవీ (చేతితో పట్టుకొని) తెచ్చి పూజించింది.

చెలది,కడుపు చల్ల,కదలక,గుడిన్+అ,ఉండె = సాలీడు, (బయట తిరిగే) శ్రమ ఏ మాత్రం పడకుండ, గుడిలోనే ఉన్నది.

మూటిన్,ఒక,పాటిన్,పాటించి,ముక్తిన్,ఇడుదు+ఎ? = ఈ మూడిటిని ఒక రీతిగానే మన్నించి, ముక్తిని ఇస్తావా?

ఇది, శ్రీకాళహస్తిక్షేత్రకథకు సంబంధించినది.ఇది చమత్కారానికే కాని, భక్తికి శరీరశ్రమకు ఏమీ సంబంధం ఉండదు.

రాళ్ళు రప్పలు, ఆకు అలము, కడుపులో చల్ల కదలకుండ – ఇవి పలుకుబడులు .

ఒక నిసుగు వెరచి ' నీవే

యిక నా ది' క్కనుచు నొరలి యెద వ్రాలిన, వా

నికినై, కన, కందిక పొం

దికయును౯ దగవౌనె సాటి దిక్పతి౯ గూల్పన్? 75

ఒక,నిసుగు,వెరచి = ఒక చిన్న బాలుడు భయపడి,

నీవే,ఇక,నా,దిక్కు,అనుచు = 'నీవు మాత్రమే ఇంక నాకు గతి' అని అంటూ,

ఒరలి,ఎద,వ్రాలిన =అరచి, అక్కున వాలిపోగానే,

వానికిన్,ఐ, అందిక,పొందికయునున్,కనక = ఆ పిల్లవానికోసమని, అందిక పొందిక

చూడకుండ (తగునా తగదా అని ఆలోచించకుండ)

సాటి,దిక్-పతిన్,కూల్పన్,తగవు,ఔనె?= నీ తోటి దిక్పాలకుడిని చంపటం న్యాయమౌతుందా?

ఇది మార్కండేయుడి కథకు సంబంధించినది.

నా దిక్కు, ఎద వ్రాలటం, అందిక పొందిక – ఇవి పలుకుబడులు.

భార్య యక్కని నెత్తి పై౯ దాల్చితివి గంగ, దాని నిమ్నగగతుల్ మానలేదు,

జగిలెకాడని చంద్రు సిగ౯ జెక్కితివి, వాని తలగాము తిప్పలు దప్పలేదు,

మరది యంచును౯ జుట్టి తఱుత వాసుకి౯ దెచ్చి వాని జిహ్మత్వంబు వదల లేదు,

నంది బంటని వాహనము జేసితివి, వాని పూరి మేసెడి బుద్ధి వోవలేదు,

ఎవరి౯ జేపట్టి వారికే మేమి వెతల౯ దొలగ౯ జేసితివో చెప్పు తొలుత నీవు,

పిదప౯ జూచెద, నేను నీ పదము౯ జేర౯ బొంగి పొరలెడు లాభమేమో యటంచు. 76

భార్య,అక్క,అని గంగన్,నెత్తి,పైన్, తాల్చితివి = భార్యకు అక్క గదా అని గంగను నెత్తి మీద పెట్టుకొన్నావు. ('అక్క+అని=అక్కయని' కావాలి కాని, 'అక్కని' అని సంధి చేయగూడదు.)

దాని,నిమ్నగ-గతుల్,మానలేదు = ఆ గంగకు ఉన్న, పల్లానికి పోయే నడకలు పోలేదు.

జగిలెకాడు,అని,చంద్రుని,సిగన్,చెక్కితివి = తోడల్లుడు అని, చంద్రుడిని సిగలో పూవుగా గుచ్చుకొన్నావు.

వాని,తలగాము,తిప్పలు,తప్పలేదు = ఆ చంద్రుడికి ఉన్న రాహుగ్రహం బాధలు తప్ప లేదు. (తలగాము=రాహువు.)

మరది,అంచును, వాసుకిన్,తెచ్చి,అరుతన్,చుట్టితి(వి) = బావమరది అని చెప్పి, వాసుకిని తెచ్చి మెడలో చుట్టుకొన్నావు.

వాని,జిహ్మాత్వంబు,వదలలేదు = వాది వంకర నడకలతనం వాడిని వదలి పోలేదు.

బంటు,అని,నంది,వాహనమున్,చేసితివి= సేవకుడు గదా అని నందిని నీ వాహనంగా చేసావు.

వాని,పూరి, మేసెడి,బుద్ధి,పోవలేదు= వాడికి ఉన్న ఆ గడ్డి తినే బుద్ధి పోలేదు.

ఎవరిఁన్,చేపట్టి, వారికి, ఏమి, ఏమి, వెతలన్,తొలగన్,చేసితివి+ఓ= ఎవరిని చేరదీసి, వాళ్ళకు ఏమేమి బాధలను నీవు పోగొట్టావో అన్నది,

నీవు,మొదట,చెప్పు= నీవు ముందు చెప్పు.

నీ, పదమున్,చేరన్,పొంగి, పొరలెడు, లాభము,ఏమి+ఓ,అట+అంచు = నీ పాదాన్ని ఆశ్రయిస్తే పొంగి పొర్లి పోయే అంత లాభం ఏమిటా- అన్నది

నేను, పిదపన్, చూచెద = నేను తరువాత ఆలోచిస్తాను.

నెత్తిన పెట్టుకోవటం, పొంగి పొర్లటం - ఇవి పలుకుబడులు.

ఇల్లాలు బోయి పుట్టింటిలో యయ్యతో వాదాడి తుదకుఁ దా బూది యయ్యె,

నెత్తిపై మోచి మన్నించిన గంగయుఁ గాళ్ళీడ్చుకొని పోయి కడలిఁ గలసె,

శేఖరత్వం బిచ్చి చేకొన్న చంద్రుండు క్షయరోగి యై యర జచ్చి యుండె,

పెండ్లిఁ జేయగఁ బిల్చి పీట వేసిన తాత వేలుపు తలకాయఁ గోలుపోయె,

కూర్మిఁ జూపిన నీ పెద్ద కొడుకు దననుఁ

బ్రథమునిగఁ గొల్వకున్నచోఁ బనులఁ జెరచు,

బళిర! నీ మన్ననం గన్న వారి తీరు

తెన్ను లిట్లు, నేనేమి గానున్న వాడ! **77**

ఇల్లాలు,పోయి,పుట్టింటిలో,అయ్యతో,వాదు,ఆడి= నీ భార్య సతీదేవి, పుట్టింటికి పోయి, తండ్రితో గొడవ పడి,

తుదకున్,తా,బూది,అయ్యె = చివరకు తానే కాలి బూడిద ఐ పోయింది.

నెత్తిపై, మోచి, మన్నించిన, గంగయున్ = నీవు తలమీద పెట్టుకొని ఆదరించిన గంగ కూడ,

కాళ్ళు,ఈడ్చుకొని, పోయి, కడలిన్,కలసె = కాళ్ళు ఈడ్చుకొంటూ నడిచి పోయి, సముద్రంలో కలసిపోయింది.

శేఖరత్వంబు,ఇచ్చి, చేకొన్న, చంద్రుండు = నీవు శ్రేష్ఠత్వాన్ని ఇచ్చి ఆశ్రయమిచ్చిన చంద్రుడు, (శేఖరం=శ్రేష్ఠము/తల పూవు. శేఖరత్వం ఇచ్చి= సిగపూవుగా చేసుకొని)

క్షయ-రోగి, ఐ, అర, చచ్చి, ఉండె = క్షయరోగం వచ్చి, సగం చచ్చి ఉన్నాడు.

పెండ్లిన్,చేయగన్,పిల్చి, పీట, వేసిన, తాత వేలుపు= పెండ్లి చేయటానికి నీవు పిలిచి పెద్ద చోటిచ్చిన బ్రహ్మ,

తలకాయన్,కోలుపోయె= తలను పోగొట్టుకొన్నాడు.

కూర్మిన్,చూపిన, నీ, పెద్ద, కొడుకు = నీవు ముద్దుతో ప్రేమను చూపించిన నీ పెద్ద కొడుకు,

తననున్, ప్రథమునిగన్,కొల్వక,ఉన్నచోన్,బనులన్,చెరచు = తనను మొదటి వాడినిగా పూజించకపోతే, పనులను చెడగొట్టుతాడు.

బళిర! నీ, మన్ననన్,కన్న, వారి, తీరు,తెన్నులు, ఇట్లు = బలే! నీ ఆదరణను పొందిన వాళ్ళ పద్ధతులు ఇలా ఉన్నాయి.

నేను, ఏమి కాన్,ఉన్న, వాడ! నేను ఏమి కాబోతున్నానో!

నెత్తిపై మోయటం, కాళ్ళీడ్చుకొని పోవటం, అర/సగం చావటం, పిలిచి పీట వేయటం, కోలుపోవటం, తీరుతెన్నులు,ఏమి గా నున్నది - ఇవి పలుకుబడులు.

కన్నెత్తి చూడడు కనఁబడ్డ చోటులఁ గూతునిచ్చితినన్న కూర్మికైన,
పల్లెత్తు మాటైనఁ బలుకడు నాతోడ నలుగురిలోన మన్ననకు నైన,
మామగారని సుంత మర్యాదఁ జూపడు సమయోచితముగ ధర్మమున కైన,
తన్నుఁగా దన్నట్లు తలఁ ద్రిప్పఁ బోడు నే మాటాడఁ బోవ, మోమోటకైన,
తోటి యల్లుండ్ర కెందును సాటి రాని
బిచ్చగాడయ్యుఁ దెగ నీల్గి బెట్టుఁజూపు
తలబిరుసు వాడనుచుఁ గాదె దక్షుడపుడు
నిన్నుఁ బిలువ మానెను తన జన్మమునకు . 78

కూతున్,ఇచ్చితిని,అన్న, కూర్మికి,ఐన = బిడ్డను ఇచ్చాను-అన్న ప్రేమతో నైన సరే. కనఁబడ్డ, చోటులన్, కన్ను,ఎత్తి, చూడడు = నేను కనబడ్డప్పుడు కన్నెత్తి చూడను గూడ చూడడు.
నలుగురిలోన, మన్ననకున్,ఐన = అందరిలో ఆదరణ చూపటం కోసమైనా,
నాతోడ, పల్లెత్తు, మాట,ఐనన్,పలుకడు = నాతో పల్లెత్తి ఒక మాట గూడ పలుకడు.
సమయ+ఉచితముగ, ధర్మమునకు,ఐన = సందర్భాన్ని బట్టి ధర్మం నిలుపుకోవటానికైనా,
మామగారు,అని, సుంత, మర్యాదన్, చూపడు = మామగారు అని నాపట్ల ఇంత కూడ మర్యాదను చూపించడు.
నే, మాట,ఆడన్,పోవ , తన్నున్,కాదు,అన్నట్లు = నేను మాటలాడటానికి ప్రయత్నిస్తే, పిలిచింది తనను కాదు అన్నట్లు,
మోమోటకు, ఐన,తలన్,త్రిప్పన్,పోడు=మొగమాటానికైన సరే,తల కూడ నా వైపు తిప్పడు.
తోటి, అల్లుండ్రకు, ఎందును, సాటి, రాని,బిచ్చగాడు,అయ్యున్ = తన తోడల్లుళ్ళకు ఏ

విషయంలోను సరి తూగని బిచ్చగాడే ఐ ఉండి కూడ,

తెగ,నీల్గి, బెట్టున్,చూపు,తల బిరుసు, వాడు, అనుచున్,కాదె =విపరీతంగా నీలుగుడుకు పోయి బెట్టు చూపించే తల పొగరు వాడు అని కదా,

అపుడు, దక్షుడు, తన, జన్నమునకు, నిన్నున్, పిలువ, మానెను = ఆ నాడు, దక్షుడు తాను చేసే యజ్ఞానికి నిన్ను పిలవటం మానుకొన్నాడు!

కన్నెత్తి చూడటం, బిడ్డను/కూతురును ఇవ్వటం, పల్లెత్తు మాట, నలుగురిలో, ధర్మానికి, తనను గాదన్నట్లు, తల తిప్పటం, తెగ నీలగటం, బెట్టు చూపటం, తల బిరుసు - ఇవి పలుకుబడులు

కూన తలఁ ద్రుంచితివి రోసమూని, చావఁ

దన్నితివి ధర్ము, ముది వేల్పు తలనుఁ గోసి,

తకట! నరకించితివి మామ తలను, నీకు

మానదయ్యె నీ తలకొట్లమారితనము. 79

రోసము,ఊని= కోపం తాల్చి,

కూన,తలన్,త్రుంచితివి= ఒక చిన్న పిల్లగాడి తలను నరికావు.

ధర్మునిన్, చావన్, తన్నితివి = యముడిని చచ్చేటట్లు తన్నావు.

ముది వేల్పు,తలనున్,కోసితి = బ్రహ్మ తలను కోసి వేసావు.

అకట! మామ,తలను,నరకించితివి = అయ్యో! నీ మామ ఐన దక్షుడి తలను నరికించావు.

నీకు, ఈ,తలకొట్లమారితనము, మానదు,అయ్యె = నీకు ఈ తలకొట్లమారితనము పోలేదు!

తలకొట్లమారి అంటే 'శిరశ్ఛేదశిక్ష పడ్డ వాడు' అని అర్థం ఉన్నప్పటికీ, aa మాటకు ఉన్న ప్రతిపదార్థాన్ని చూస్తే, 'తలలను కొట్టటానికి అలవాటు పడ్డ వాడు' అనే అర్థం వస్తుంది కాబట్టి, ఈ చిన్న శబ్దచమత్కారం.

చావదన్నటం, తలకొట్లమారి - ఇవి పలుకుబడులు.

తండ్రివంటి బ్రహ్మ తలఁ ద్రెంచితివి, మామ

దక్షు తలనుఁ గోయఁ దలకె నీకుఁ?

దల్లి చెవులఁ గోయు తనయుని చేతికిఁ

బిన్నతల్లి చెవులు బీరపూలు 80

తండ్రి వంటి,బ్రహ్మ,తలన్,త్రెంచితివి = నీకు తండ్రివంటి వాడైన బ్రహ్మ తలను నరికావు.

మామ,దక్షు,తలనున్,కోయన్,నీకున్, తలకు+ఎ? = మామ ఐన దక్షుడి తలను నరకటానికి నీకు భయం ఉంటుందా?

తల్లి,చెవులన్,కోయు,తనయుని,చేతికిన్=తన తల్లి చెవులను కోసే కొడుకు చేతికి,

పిన్న,తల్లి,చెవులు,బీరపూలు = పినతల్లియొక్క చెవులు, బీరపూలంత మాత్రమేగా!

బ్రహ్మ నుదుటినుండి శివుడు వచ్చాడని పురాణకథ. కాబట్టి, శివుడికి బ్రహ్మ నిజంగా తండ్రివంటి వాడే. దక్షుడు శివుడికి ,సాక్షాత్తు పిల్లనిచ్చిన మామ.

తండ్రివంటి అనేది ఒక పలుకుబడి. 'కన్న తల్లి చెవులు గోసిన వాడికి పినతల్లి చెవులు బీరపూలు' అని ఒక సామెత.

' తగవెరుగంగ లేక మును దక్షుఁ బ్రజాపతి మామఁ గొంతుఁగో

యగ నొనరించె పెన్మొరకుటల్లు' డ టంచును నీసడింతునో!

పొగడుదునో, ' జనంబు వగ బోవగ నేర్చున గొర్రె మోరఁ జ

క్కగఁ దలగా ఘటించెఁ, దలకాయలు మార్చెడు జాణ' యంచు నిన్! 81

తగవు,ఎరుగంగ,లేక,మును = 'ధర్మాన్ని తెలుసుకోలేక,మునుపు ...'

ప్రజాపతిన్,మామన్, దక్షున్ = '... ప్రజాపతి పదవిలో ఉన్న వాడిని, తన మామను, దక్షుడిని

గొంతున్,కోయగన్,ఒనరించెన్ = 'గొంతు కోయించాడు. ...'

పెన్,మొరకు,అల్లుడు,అట,అంచునున్ = '... చాల మొరటు అల్లుడు.' అని,

నిన్, ఈసడింతునో! = నిన్ను, తక్కువగా చూచి నిందించేదా!

జనంబు,వగ,వోవగ = ' జనుల దుఃఖం తీరేటట్లు, ...'

నేర్పున, గొర్రె,మోరన్,తలగా,చక్కగన్,ఘటించెన్ = '...నేర్పుతో, గొర్రె మొగాన్ని తలగా బాగా కూర్చాడు. ...'

తలకాయలు,మార్చెడు,జాణ,అట,అంచు= '... తలకాయలు మార్చి వేసే నేర్పరి'. అని,

పొగడుదునో! = మెచ్చుకొనేదా!

తలకాయలు మార్చటం - ఇది ఒక పలుకుబడి.

జనుల నుద్ధరింపఁ జనుదెంచి నీవు పెన్

గొండకొమ్ములందె యుండనేల?

గుట్టలెక్కి దిగగ గుట్టలు బడెఁ గాళ్ళు , సంబ

రమ్ము చా, లిక దిగి రమ్ము వేగ. 82

జనులన్,ఉద్ధరింపన్,చనుదెంచి,నీవు = లోకులను ఉద్ధరించటానికి వచ్చి, నీవు,

పెన్,కొండకొమ్ముల,అందు+ఎ, ఉండన్,ఏల? = ఎత్తైన కొండ కొనలమీదనే ఉండటం దేనికి?

గుట్టలు,ఎక్కి,దిగగ, కాళ్ళు,గుట్టలు,పడె = కొండలు ఎక్కి దిగటంతో,మాకు కాళ్ళు గుట్టలు పడ్డాయి.(=కాళ్ళు మిక్కిలి నొచ్చినవి.)

సంబరమ్ము,చాలు = నీ హడావిడి ఇంతటితో చాలు. (చాలులే సంబడం!)

ఇక,వేగ,దిగి,రమ్ము = ఇక తొందరగా కొండలు దిగి నేలమీదకు రా!

ఉద్ధరించటం, గుట్టలెక్కి దిగటం, కాళ్ళు గుట్టలు పడటం, చాలులే సంబరం!, దిగిరావటం - ఇవి పలుకుబడులు.

ఎద్దున్న మాత్రాన యెచ్చులు బడఁబోకు మూరూర నింటింట నుండు మాకు,
గంగయున్నదటంచు గంగవెర్రులు మాను, త్రవ్విన చోటెల్లఁ దగులు మాకు,
కొండపై నుంటి నన్ దండిమాటలు వద్దు గర్వపర్వతముపైఁ గలము మేము,
కేల శూలంబన్న గోల పగ్గెల వీడు, కడుపులోఁ దలలోనఁ గలుగు మాకు,
నొసట కన్నుండె నీకు, మా నొసట లేదు,
తగులఁ బెట్టనా యది? దానఁ దగుల? మిగుల?
నేటి నరులము, వాదులో మేటి వార,
మిప్పుడా నాటి నీ గొప్ప లెన్న మిచట. 83

ఎద్దు,ఉన్న, మాత్రము+న. ఎచ్చులు,పడన్,పోకుము = నీకు ఒక ఎద్దు అన్నంత మాత్రానికే ఎచ్చులు పడలని చూడకు.

మాకు, ఊరు+ఊరన్, ఇంట+ఇంటన్, ఉండు = మాకు, ప్రతి ఊళ్ళో ప్రతి ఇంటిలో ఉంటుంది.

గంగ,ఉన్నది,అట,అంచు, గంగవెర్రులు, మాను= నాకు గంగ ఉన్నది అంటూ, పిచ్చి మాటలు మానుకో. (గంగవెర్రులు=మద్యపానంవలన వచ్చే పిచ్చి చేష్టలు.మాటలు)

మాకు, త్రవ్విన, చోట,ఎల్లన్, తగులు= మాకు త్రవ్విన ప్రతి చోట దొరుకుతుంది.

కొండపైన్,ఉంటిని,అన్, దండి,మాటలు, వద్దు= ఎక్కడో కొండమీద ఉన్నాను-అని పెద్ద పెద్ద మాటలు వద్దు.

మేము , గర్వ-పర్వతము, పైన్,కలము = మేము, గర్వం అనే కొండ మీద ఉన్నాము.
(మా కంటికి ఇతరులు ఆనరు, ఇతరుల కంటికి మేము ఆనము.)

కేల, శూలంబు,అన్న, గోల, పగ్గెల, వీడు= చేతిలో శూలం ఉన్నది అన్న గొప్ప మాటల గొడవను వదలి పెట్టు.

మాకు, కడుపులోన్, తలలోనన్,కలుగు= మాకు తలలోను పొట్టలోను అది ఉంటుంది.

(శిరఃశూలం,ఉదరశూలం అని రోగాలు.)

నీకు,నొసట,కన్ను,ఉండె, మా,నొసట,లేదు=నీకు నుదుట కన్ను ఉన్నది,మా నుదుట లేదు.

అది, తగులన్,పెట్టన్+ఆ? దానన్, తగులు+అ? మిగులు+అ? = అది, ఆ నుదుటి కన్ను, ఎందుకు? తగలబెట్టటానికా? దానివలన నష్టం ఉందా, లాభం ఉందా?

నేటి, నరులము, వాదులో, మేటి, వారము = మేము ఈ కాలపు మనుషులం. వాదనలో గొప్ప వాళ్ళము.

ఆ,నాటి, నీ, గొప్పలు, ఇప్పుడు, ఇచట,ఎన్నము = ఆ పాతకాలపు నాటి నీ గొప్పలను ఇప్పుడు ఇక్కడ లెక్క చేయము.

శివుడి నొసటి కన్ను ఉన్నది నిజంగా 'తగుల బెట్టటానికే'.

ఎచ్చులు పడటం, గంగవెర్రులు, తగలబెట్టటం, గొప్పలెన్నటం - ఇవి పలుకుబడులు.

కలరు వేల్పులు పెక్కు, రలరుటమ్ముల కోడిరే కాని మన్మథు నెవడు గాల్చె?
మేరువిల్లని దానఁ జేరి యుండిరె కాని, విల్లుగా దాని నే వేల్పు బట్టె?
వారాశి యని గౌరవముఁ జూపిరే కాని యబ్ధి నెవ్వడు దాల్చె నంపపొదిగ?
పగ్గె గల్గియు విధి కగ్గమైరే కాని, వాని శీర్షమ్ము నెవ్వాడు దునిమె?
యముని చేఁ జిక్కిరే కాని యవధి దీర, నంతకుని యంతుఁజూచిన యధికు డెవడు?
ప్రాభవమ్ము యౌద్ధత్యమో పలుకరాదు, చేయ రానట్టి పనులనుఁ జేసి తీవు. 84

వేల్పులు, పెక్కురు, కలరు = దేవతలు ఎంతో మంది ఉన్నారు.

అలరు+అమ్ములకు, ఓడిరి+ఏ, కాని = (వాళ్ళందరు) మన్మథుడి పూలబాణాలకు ఓడిపోయి ఊరకున్నారే తప్ప,

ఎవడు, మన్మథున్,కాల్చె? = వాళ్ళలో ఎవడైన మన్మథుడిని కాల్చి వేసాడా?

(ఎవరూ కాల్చ లేదు,శివుడు తప్ప.)

మేరువు,ఇల్లు,అని, దానన్,చేరి,ఉండిరి+ఎ,కాని = మేరుపర్వతము తమకు నివాసం అని భావించి , (దేవతలు) దానిమీద అందరు కలసి ఊరక నివసించారే తప్ప,

దానిని, విల్లుగా, ఏ, వేల్పు, పట్టె? = ఆ మేరుపర్వతాన్ని ధనుస్సుగా ఏ దేవత చేత బట్టుకొన్నాడు? (ఎవరూ పట్టుకో లేదు, శివుడు తప్ప.)

వారాశి, అని, గౌరవమున్,చూపిరి+ఏ, కాని = జలరాశి అనే గౌరవాని చూపించారే తప్ప,

యబ్ధిన్, నంపపొదిగ, ఎవ్వడు, తాల్చెన్? = సముద్రాన్ని, అంబుల పొదిగా ఎవడు ధరించాడు? (ఎవరూ ధరించలేదు, శివుడు తప్ప.)

పగ్గె,కల్గియు,విధికి,అగ్గము,ఐరి+ఏ,కాని=తమకు ప్రజ్ఞ ఉన్నప్పటికి కూడ,విధికి లోబడ్డారేతప్ప,

వాని,శీర్షమ్మును, ఏ+వాడు, తునిమె? = ఆ విధి తలను ఎవడు తుంచాడు? (ఎవరూ తుంచ లేదు,శివుడు తప్ప.)

యవధి,తీరన్,యముని, చేన్, చిక్కిరి+ఏ, కాని = తమ కాలం ముగియగానే యముడి చేతికే చిక్కారు తప్ప.

అంతకుని, యంతున్, చూచిన, అధికుడు, ఎవడు?= ఆ యముడి అంతునే చూచిన గొప్ప వాడు ఎవడు? (ఎవడూ లేడు,శివుడు తప్ప.)

ప్రాభవమ్ము+ఒ,ఔద్ధత్యము+ఓ,పలుక రాదు=అధికారమో,పొగరో, చెప్పలేము కాని,

ఈవు, చేయ రాని+అట్టి, పనులనున్,చేసితి = నీవు, చేయరాని పనులను చేసావు.

(చేయరాని+అట్టి,పనులన్=1)చేయటానికి సాధ్యము కాని గొప్ప పనులను; 2) చేయటానికి తగనట్టి చెడ్డ పనులను.)

అగ్గం కావటం, చేజిక్కటం, అంతు చూడటం, చేయరాని - ఇవి పలుకుబడులు.

ఋషులు మధ్యవర్తులు, బ్రహ్మ ఋత్విజుండు,

వేల్పు లిష్టులు, విష్ణువు పెళ్ళి పెద్ద;

రెండవ మనువు కింత 'బ్రహ్మాండ' మైన,

తొలి వివాహంబ దింకెంత వెలిగి పోయె? 85

ఋషులు,మధ్యవర్తులు = సప్తర్షులు పెళ్ళి మాటలకు మధ్యవర్తులుగా ఉన్నారు.

బ్రహ్మ,ఋత్విజుండు = సాక్షాత్తు బ్రహ్మ పెళ్ళి క్రతువును చేయించే వాడిగా ఉన్నాడు.

వేల్పులు,ఇష్టులు = దేవతలే (పెళ్ళికి వచ్చిన) చుట్టాలైనారు.

విష్ణువు,పెళ్ళి పెద్ద = విష్ణువు, పెళ్ళిపెద్దగా వ్యవహరించాడు.

రెండవ,మనువుకు,ఇంత,బ్రహ్మాండము,ఐన = రెండవ పెళ్ళికే ఇంత గొప్ప ఏర్పాట్లైతే,

తొలి,వివాహంబు,అది,ఇంక,ఎంత,వెలిగి పోయె?్ = మొదటి పెళ్ళి, అది ఇంకెంతగా వెలిగి పోయిందో కదా!

నిజానికి మొదటి పెళ్ళి ఐనా, రెండవ పెళ్ళి ఐనా, ఇంకెన్నవ పెళ్ళి ఐనా, శివుడి పెళ్ళి అంటే ఎప్పుడైనా వీళ్ళే కదా వచ్చేది?

'బ్రహ్మాండం' అంటే,వ్యావహారికంలో, 'పెద్ద సన్నాహం'/'గొప్ప పని' అని భావం. 'చేద్దాం లే!అదేమంత బ్రహ్మాండమా!' అన్నట్లు.

మధ్యవర్తులు, పెళ్ళి పెద్ద, బ్రహ్మాండం, వెలిగిపోవటం - ఇవి పలుకుబడులు.

మామ యగు దక్షు గౌరవింపవు రవంత,

యెట్లు బిలుచును నిన్నత డిష్టిఁ జూడ ?

ముష్టిలింగడ వీవంత పొగరుఁ జూప,

నంత పెద్ద ప్రజాపతి కెంత యుండు? 86

మామ,అగు,దక్షు,రవ+అంత,గౌరవింపవు = నీకు మామ ఐన దక్షుడిని నలుసంత కూడ గౌరవించవు.

ఇష్టిన్,చూడ,నిన్ను,అతడు,ఎట్లు ,పిలుచును?= యజ్ఞాన్ని చూడటానికి రమ్మని, నిన్ను

అతడు ఎట్లా పిలుస్తాడు?

ముష్టి,లింగడవు,ఈవు,అంత,పొగరున్,చూపన్ = అడుక్కొనే లింగడుగాడివి, నీవు అంతటి పోగరును చూపిస్తే,

అంత,పెద్ద,ప్రజాపతికి,ఎంత,ఉండు? = అంత గొప్ప ప్రజాపతికి,అతడికెంత పొగరుంటుంది మరి?

ఇక్కడ 'ముష్టి లింగడు', 'అంత పెద్ద ప్రజాపతి' అనేవి సాభిప్రాయపదాలు. వివరణను, పెద్దలను అడిగి తెలుసుకొనండి.

ముష్టి లింగడు, అంత పెద్ద , ఎంత ఉంటుంది - ఇవి పలుకుబడులు.

కాటి బూదిఁ బారగ ప్తైచి, గంద మింత

యలదు, మెటనో, యే యయ్యనో యడిగి తెచ్చి;

ఒకరి కాళ్ళు గడుపులు బట్టుకొని యైన

యప్పుఁ బొడిచి గొప్పలఁ జూపు టిప్పుడొప్పు . 87

కాటి,బూదిన్,పారగ ప్తైచి = వల్లకాటి బూడిదను పారవేసి,

ఎటన్+ఒ, ఏ,అయ్యనో,అడిగి,తెచ్చి = ఎక్కడనో ఎవరినో అడిగి తెచ్చుకొని,

ఇంత,గందము,అలదుము = కొంచెం గంధాన్ని పూసుకో.

ఒకరి, కాళ్ళు,కడుపులు, పట్టుకొని,ఐన,అప్పున్, పొడిచి = ఒకరి కాళ్ళో కడుపులో పట్టుకొని (=బతిమాలి) ఐనా సరే, ఎరవు తెచ్చుకొని, (అప్పు పొడుచుట=అప్పు తెచ్చుట)

గొప్పలన్,చూపుట, ఇప్పుడు, ఒప్పు = గొప్పలు చూపించుకోవటం ఈ కాలంలో సరిపోతుంది/సరైనది.

పారవేయటం, ఇంత, ఎక్కడనో, ఏ అయ్యనో అడగటం,కాళ్ళు కడుపులు పట్టుకోవటం, అప్పు పొడవటం, గొప్పలు చూపించటం - ఇవి పలుకుబడులు .

నీ కడఁ గడలంత గలదు

వ్యాకృతి యని పెద్దవారలనగా వింటిన్,

ఏ కొలదియొ విదలింపుము

నాకయి, యేమైనఁ బోవునా నీ సొమ్ముల్ ? 88

నీ,కడ,వ్యాకృతి, కడలి+అంత,కలదు,అని,పెద్ద,వారలు,అనగా,వింటిన్ =నీ దగ్గర వ్యాకరణం సముద్రమంత ఉన్నది - అని పెద్ద వళ్ళు చెప్పగా విన్నాను.

ఏ,కొలది+ఒ,నాకయి,విదలింపుము = ఏ కొద్దిగానో నాకోసం/ నా చేతిలో, రాల్చు.

నీ,సొమ్ములు, ఏమైనన్,పోవునా? = నీ సొమ్ము ఏమైన పోతుందా ఏమిటి?

(నాకయి= 1.నాకై; 2.నా చేతిలో.)

కడలంత, ఏ కొద్దిగానో, విదలించటం, సొమ్ము పోవటం - ఇవి పలుకుబడులు.

'జడల తల జోగి యిల్లా

లడు గిడె' నని యమ్మలక్క లన, నది యుమకున్

గడుఁ జిన్నతనము; మేలౌ

యుడుపులఁ దొడవులనుఁ దాని నుడుపుట మేలౌ. 89

జడల,తల,జోగి,ఇల్లాలు,అడుగు,ఇడెన్,అని ='జుట్టు జడలు గట్టి ఉండే బైరాగి పెళ్ళాం కాలు మోపింది.' అని,

అమ్మలు,అక్కలు,అనన్= చుట్టుప్రక్కల ఉండే స్త్రీలు అందరూ అంటే,

అది,ఉమకున్, కడున్,చిన్నతనము = అది పార్వతికి చాల పరువుతక్కువగా ఉంటుంది.

మేలు+ఔ, ఉడుపులన్,తొడవులన్,దానిన్.ఉడుపుట,మేలు+ఔ = మేలి రకపు వస్త్రాలతోటి, ఆభరణాలతోటి, ఆ చిన్నతనాన్ని పోగొట్టటం మంచిది.

అడుగు పెట్టటం,అమ్మలక్కలు, చిన్నతనము - ఇవి పలుకుబడులు.

ఎందరనొ ప్రోచి యుంటివీ వెపుడొ యనుచు,

నిప్పుడుస్ నీవె దిక్కని యెదల నమ్మి,

మొర్ర పెట్టుచు నున్నారు వెర్రి జనులు,

చెట్లు మొలచెనా నీకేమి చెవులలోన? 90

ఈవు,ఎపుడొ,ఎందరనొ,ప్రోచి,ఉంటివి,అనుచున్ = నీవు, ఎప్పుడో పాతకాలం నాడు, ఎందరినో కాపాడి ఉన్నావు- అని అనుకొంటూ

ఇప్పుడున్,నీవు+ఎ,దిక్కు,అని,ఎదల.నమ్మి = ఇప్పుడు కూడ నీవే దిక్కు- అని తమ మనస్సులో నమ్ముకొని,

వెర్రి,జనులు,మొర్ర,పెట్టుచున్,ఉన్నారు = అమాయికపు జనం మొత్తుకొంటూ ఉన్నారు.

నీకు,చెవులలో,చెట్లు,మొలచెనా,ఏమి?=నీకు చెవులలో చెట్లు ఏమైన మొలిచినవా ఏమిటి? (=నీకు వినబడటం లేదా?)

నీవే దిక్కు, మొరపెట్టటం, చెవులలో చెట్లు మొలవటం - ఇవి పలుకుబడులు.

పొట్ట బగులఁగ దినిన నీ పట్టిఁ జూచి

చంద్రు డిగిలింప, నదియొక సందు గాగ,

వానిఁ గొలువక విఘ్నముల్ , వీని మొగముఁ

జూడఁ బాపము వచ్చునం చాడఁ దగునె? 91

పొట్ట,పగులగన్,తినిన,నీ,పట్టిన్,చూచి = పొట్ట పగిలిపోయేటట్లు తెగ తిన్న నీ కొదుకును చూచి,

చంద్రుడు,ఇగిలింపన్ = చంద్రుడు వెకలిగా నవ్వితే,

అది,ఒక,సందు,కాగ = నీకు అది ఒక అవకాశం కాగా,

వానిన్,కొలువక,విఘ్నముల్,వచ్చు,వీని,మొగమున్,చూడన్,పాపము,వచ్చున్= అతడిని పూజించకపోతే విఘ్నాలు వస్తాయి,ఇతది మొగం చూస్తే పాపం వస్తుంది

అంచు, ఆడన్,తగునె? = అని పలుకవచ్చునా?

ఇది, చంద్రుడు వినాయకుడిని చూచి నవ్విన కథకు సంబంధించినది.

పొట్ట పగల, మొగం చూస్తే పాపం - ఇవి పలుకుబడులు.

ముది వేలు పగు బ్రహ్మ సదన మించుక జూడు, వేదముల్ వీణతో బెరసి మొరయు,

చేరువ పొరుగౌ కుబేరు నింటినిఁ జూడు, రాజరాజశ్రీలఁ గ్రాలుచుండు,

సాటి వేల్పగు విష్ణు సౌధమున్ బరికింపు, సిరికిఁ దావిది యని చెప్పనొప్పు,

నీకు మ్రొక్కెడు నింద్రు నాకమున్ గనుగొమ్ము, దానిఁ జూచిన కన్ను దేని మెచ్చు?

కలిమి యన్న నీ కొక లెక్క గాదు గాని, యరయ వలెఁ గాదె యింటిలో యాడు గోడు?

కొంప గోడియు నగనట్రఁ గూర్చకున్న, నుమ సహించెను, సైప దింకొకతె యైన.   92

ముది, వేలుపు,అగు, బ్రహ్మ, సదనము,ఇంచుక చూడు = ముసలి దేవుడైన బ్రహ్మ ఇంటిని కాస్త చూడు.

వేదముల్, వీణతో, బెరసి, మొరయు = వేదాలు, వీణతో కలసి ప్రకాశించి మోగుతూ ఉంటాయి. (ఛాందసత్వం ఉన్నా విలాసం కూడ ఉన్నది.)

చేరువ,పొరుగు,ఔ,కుబేరుని,ఇంటినిన్,చూడు=పక్కపొరుగు వాడైన కుబేరుని ఇంటిని చూడు.

రాజరాజ-శ్రీలన్,క్రాలుచుండు = చక్రవర్తికి ఉండే సంపదలతో వెలిగి పోతూ ఉంటుంది.

సాటి,వేల్పు,అగు, విష్ణు,సౌధమున్, పరికింపు= నీ తోటి దేవత ఐన విష్ణువు మేడను చూడు.

ఇది,సిరికిన్,తావు.అని, చెప్పన్,ఒప్పు = 'ఇది లక్ష్మికి స్థానం' అని చెప్పటానికి సరి పోతుంది.

నీకు, మ్రొక్కెడు,ఇంద్రు,నాకమున్,కనుగొమ్ము =నీకు దండలు పెట్టే ఇంద్రుడి స్వర్గాన్ని చూడు.

దానిన్,చూచిన, కన్ను, దేని, మెచ్చు? = దానిని చూచిన కన్ను మరొక దానిని దేనిని మెచ్చుకొంటుంది?

కలిమి,అన్న, నీకు, ఒక, లెక్క, కాదు, గాని = సంపద అంటే నీకుమాత్రం ఒక లెక్కలోనిది

కాదులే కాని,

ఇంటిలో,ఆడు గోడు, అరయ వలెన్,కాదె? = ఇంటిలో ఉన్న ఆడు వాళ్ళ బాధను కూడ కాస్త పట్టించుకోవాలి కదా!

కొంప గోడియు, నగ నట్రన్,కూర్చక-ఉన్నన్,ఉమ, సహించెను= కొంపా గోడీ, నగా నట్రా సమకూర్చకపోతే, పార్వతి ఊరకున్నది గాని,

ఇంక,ఒకతె,ఐన, సైపదు = మరొకతె ఐతే కనుక ఊరకుండదు.

కుబేరుడు రాజరాజు కాబట్టి, అతడి ఇల్లు రాజరాజశ్రీలతోనే ఉంటుంది. విష్ణువు సౌధం నిజంగానే 'సిరికి తావే'.

చేరువ పొరుగు, ఒక లెక్క కావటం/కాకపోవటం, ఆడు గోడు, కొంప గోడి, నగ నట్ర – ఇవి పలుకుబడులు.

తలపండిన మౌనులు శి

ష్యులుగాఁ, బ్రామర్రి నీడ నుండుచుఁ, బలుకే

పలుకక వారల శంకలఁ

దొలగించెడు గురుని రూపు దొర వీవు శివా! 93

శివా! = శివా!

తల,పండిన,మౌనులు,శిష్యులు,కాన్ = ముదుసలులైన మునులు నీకు శిష్యులై చేరగా,

ప్రా,మర్రి,నీడన్,ఉండుచున్ = పురాతనకాలపు మర్రి చెట్టు నీడలో ఉంటూ,

పలుకే,పలుకక,వారల,శంకలన్,తొలగించెడు,గురుని,రూపు,దొరవు= ఒక్క మాటైన పలకకుండనే, వాళ్ళ సందేహాలను పోగొట్టే గురువు రూపంలో ఉన్న స్వామివి,

ఇది దక్షిణామూర్తిస్వరూపానికి సంబంధించింది.'చిత్రం!వటతరోర్మూలే శిష్యా వృద్ధా గురుర్యువా, గురోస్తు మౌనం వ్యాఖ్యానం, శిష్యాస్తు చ్ఛిన్నసంశయాః' అని దక్షిణమూర్తినిగురించి పూర్వోక్తి.

తలపండిన – ఇది ఒక పలుకుబడి.

జనులు నిన్నుఁ జేర సదమద మగుచుండఁ,
గన్నుగప్పి చేయి గడచి వోయి,
మిడుగురాళ్ళ మిట్ట మీదఁ గూర్చుందువా!
తెలియు మాకుఁ, బట్టి తెచ్చు దారి. 94

నిన్నున్,చేరన్,జనులు,సదమదము,అగుచు+ఉండన్ = నిన్ను చేరుకోవటానికి జనం చస్తూ ఉంటే (=తంటాలు పడుతూ ఉంటే),
కన్ను,కప్పి,చేయి,కడచి,వోయి= మా కళ్ళ బడకుండ (=మోసగించి) చేతికి అందకుండ వోయి,
మిడుగు,రాళ్ళ, మిట్ట,మీదన్,కూర్చుందువా?=కఠినశిలల కొండ(కైలాసం)మీదకూర్చుంటావా?
పట్టి,తెచ్చు,దారి,మాకున్,తెలియు=నిన్ను పట్టుకొని తీసుకొని వచ్చే మార్గం మాకు తెలుసులే!
సదమదం/సతమతం కావటం, కన్ను గప్పటం, చేయి దాటి/కడచి వోవటం, మిడుగు రాళ్ళ మిట్ట, పట్టి తేవటం - ఇవి పలుకుబడులు.

మణిహారములు రత్నమకుటాలు లేకున్న, గాజు రా దండకు గతియు లేదె?
పట్టుపుట్టముఁ గట్టఁ బైకమ్ము లేదేని ముదుక దోవతికైనఁ గొదువ యొక్కొ!
మందారమాలిక లందరానివ యైన, లేవొకో ఏ కొండపూవు లేని?
కస్తూరిఁ దెచ్చుకోఁ గల సొమ్ము లేదేని, యే యాకు పసరులో యెన్ని లేవు?
మేటి మిద్దెల మేడల మాటటుంచు,
చిన్న పూరి గుడిసెఁ గప్పఁ జేతఁ గాదె?
యిట్లు నగుబాట్లుగా, వల్లకాడిల్లు గాగ
నదవ కాపురముండ నేమంత వచ్చె? 95

మణి-హారములు, రత్న-మకుటాలు, లేక,ఉన్న = మణులు పొదిగిన గొలుసులు, రత్నాలు తాపిన కిరీటాలు, లేకపోతే,

గాజు,రా,దండకు,గతియు, లేదె? = గాజు రాళ్ళ దండను వేసుకోవటానికైనా గతి లేదా?

పట్టు,పుట్టమున్, కట్టన్,పైకమ్ము, లేదు,ఏని = పట్టు బట్టలు కట్టుకోవటానికి తగినంత డబ్బు లేకపోయినా,

ముదుక, దోవతికి,ఐనన్, కొదువ, ఒక్కొ! = ముతక పంచెకు కూడ కొరవ ఔతుందా?

మందార-మాలికలు,అందరానివి+అ, ఐన= మందారపుష్పాల దండలు అందుబాటులో ఉండేవి కాకపోయినా,

ఏ, కొండపూవులు,ఏని, లేవు,ఒకో = ఏ కొండపూవు లైనా కూడ లేవా?

కస్తూరిన్,తెచ్చుకోన్,కల, సొమ్ము, లేదు,ఏని = కస్తూరిని కొని తెచ్చుకోవటానికి సరిపడే అంత ధనం లేకపోతే,

ఏ,ఆకు పసరులు+ఓ, ఎన్ని లేవు? = ఏ ఆకుల పసరులో ఎన్నెన్ని లేవు గనుక?

మేటి,మిద్దెల,మేడల, మాట,అటు,ఉంచు=గొప్ప మేడల మిద్దెల సంగతి పక్కన ఉండనీ.

చిన్న, పూరి, గుడిసెన్,కప్పన్,చేతన్,కాదె? = చిన్న పూరి పాకనైనా వేసుకోవటం చేతకాదా?

ఇట్లు, నగుబాట్లుగా, వల్లకాడు,ఇల్లు, కాగన్= ఈ రకంగా, నవ్వుబాట్ల చేటుగా, వల్లకాడే ఇల్లై,

అదవ, కాపురము,ఉండన్,ఏమి,అంత, వచ్చె? =దిక్కు మాలిన కాపురం చేస్తూ ఉండటానికి, అంత కష్టం ఏమి వచ్చింది?

గతి ఉండటం/లేకపోవటం, అందరానివి, ఎన్ని లేవు?,మిద్దెలు మేడలు, నగుబాట్లు, అదవ కాపురం, ఏమంత - ఇవి పలుకుబడులు.

అచ్చటచటఁ దిరిగి యెచ్చటఁ జెల్లక,

నన్నుఁ బోలు జోగి నిన్నుఁ జూచి ,

తగిన తోడు గాగఁ దలచి నిన్ జేరితిఁ

గాని, నీదు గొప్పఁ గాంచి కాదు. 96

అచ్చట,అచటన్,తిరిగి, ఎచ్చటన్,చెల్లక = ఆ చోటా ఈ చోటా తిరిగి, ఎక్కడా పనికి రాక,

నన్నున్,వోలు, జోగిన్, నిన్నున్,చూచి = నాకుం సరిపోలిన బికారిని నిన్ను చూచి,

తగిన,తోడు,కాగన్,తలచి,నిన్,చేరితిన్,కాని=నాకు సరైన తోడు-అనుకొని,నీ దగ్గర చేరాను కాని,

నీదు,గొప్పన్,చూచి,కాదు= నీ గొప్పను మెచ్చి మాత్రం చేరలేదు.

అక్కడక్కడ, ఎక్కడా చెల్లక, తగిన తోడు, గొప్ప చూడటం - ఇవి పలుకుబడులు.

తిండితిప్పలకొరకు నీ యండ యేల?

యూళ్ళు నాళ్ళను నేల నా కూహ లేదు,

దిక్కుమాలిన భవలతల్ ద్రెంతువేమొ

శూలివని వచ్చితిని, పనిఁ జూడవయ్య . 97

తిండితిప్పలకొరకు, నీ, అండ, ఏల? = కూటి కోసమే ఐతే నీ ప్రాపు నాకెందుకు?

యూళ్ళు,నాళ్ళనున్,ఏల,నాకు,ఊహ,లేదు=ఊళ్ళనో దేశాలనో ఏలే ఆలోచన నాకు లేదు.

దిక్కుమాలిన, భవ-లతల్, త్రెంతువు,ఏమొ,శూలివి,అని, వచ్చితిని = ఈ పాడు జన్మలు అనే

తీగలను తెంచుతావేమో ,శూలం చేతగల వాడవు గదా అని, వచ్చాను.

పనిన్, చూడవయ్య=ఆ పనిని చేసిపెట్టవయ్యా!

తిండి తిప్పలు, ఊళ్ళు నాళ్ళు, దిక్కుమాలిన, పని చూడటం - ఇవి పలుకుబడులు.

అలుక చూపులు లేవె, చెలరేగు మన్మథు భస్మీకరింపఁ బాల్పడవు గాని,

విల్లునంబులు లేవె, వింటఁ ద్రిమ్మరు మూడు ప్రోళ్ళ నోకులఁ గూల్పఁబోవు గాని,

తలకట్లు లేవె, మిన్నులనుండి పరతెంచు దేవవాహినిఁ దాల్పఁ బోవు గాని,

వలపు కోర్కెలు లేవె, తొలుత జన్మపుటాలికై వేచి యుండంగఁ బోవు గాని,

కాలి తన్నులు లేవె యేకాలమందు, లావు మీరి కాలునిఁ గూల్పలేవు గాని,

లేరె వేల్పులు, నీ సాటి లేరు గాని; లేరె యల్పులు, నా బోటి లేడు గాని. 98

చెలరేగు, మన్మథు, భస్మీకరింపన్,పాల్పడవు , కాని = రెచ్చిపోతున్న మన్మథుడిని కాల్చటానికి సిద్ధపడవు గాని,

అలుక, చూపులు, లేవు+ఎ? = కోపపు చూపులు లేవా ఏమిటి?

వింటన్,త్రిమ్మరు, మూడు, ప్రోళ్ళ, సోకులన్,కూల్ పన్,పోవు,కాని = ఆకాశంలో తిరిగే మూడు ఊళ్ళ రాక్షసులను కూల్చవు గాని,

విల్లున్,అంబులు, లేవె? = ధనుస్సు, బాణాలు, లేవా ఏమిటి?

మిన్నులనుండి, పరతెంచు, దేవ-వాహినిన్.తాల్పన్,పోవు,కాని = ఆకాశంనుండి ప్రవహించి వచ్చే గంగానదిని భరించలేవు గాని,

తలకట్లు లేవె = తల జుట్లు (కేశపాశాలు) లేవా?

తొలుత, జన్మపు,ఆలికై, వేచి, ఉండంగన్,పోవు, కాని = గతజన్మలోని భార్యకోసం అని, వేచి చూస్తూ ఉండవు గాని,

వలపు, కోర్కెలు, లేవె? = ప్రేమవలన వచ్చిన కోర్కెలు లేవా?

లావు,మీరి,కాలునిన్,కూల్పలేవు,కాని = బలిమి హెచ్చి యముడిని కూలగొట్టవు గాని,

ఏ,కాలము+అందు, కాలి, తన్నులు,లేవె? = ఏ కాలంలోనైనా మాత్రం,కాళ్ళ తన్నులు లేవా?

నీ, సాటి, లేరు, కాని, వేల్పులు, లేరె? = నీతో సమానుడు ఐన వాడు లేడు గాని, దేవతలు లేక పోయారా?

నా,బోటి,లేడు,కాని,అల్పులు,లేరె? = నా లాంటి వాడైతే ఉండడు గాని, అల్పులు ఎందుకు ఉండరు?

అతడు, 'నే వ్రాయఁ జదువలే రన్య' లనియె,

నితడు, 'నే వ్రాయఁ జదువలే నేనె' యనియె ,

ఎవ్వ డెచ్చిందు? మెరుగొ, నిన్నింత యెరుగ

లేని బుధులు? నన్నెరుగని నేను మెరుగొ ? 99

అతడు, 'నే, వ్రాయన్, అన్యులు, చదువ లేరు, అనియెన్ = వాడు, 'నేను వ్రాస్తే, ఇతరులు చదువ లేరు' అని అన్నాడు.

ఇతడు, 'నే, వ్రాయన్, ఏను+ఎ, చదువ లేను,అనియె=వీడు, 'నేను వ్రాస్తే, నేనే చదువ లేను' అని అన్నాడు.

ఇందు, ఎవ్వడు,ఎచ్చు? =ఇందులో -ఈ ఇద్దరిలో- ఎవడు ఎక్కువ?

నిన్ను, ఇంత,ఎరుగ లేని, బుధులు, మెరుగు+ఒ? = నీగురించి కొంచెం కూడ తెలుసుకో లేక ఉన్న పండితులు మెరుగా? లేక,

నన్ను,ఎరుగని,నేను, మెరుగు+ఒ? = నాగురించి నాకే తెలియని నేను మెరుగా?

కామధూర్తుడు వచ్చి కనులు గప్పక యున్న,నిన్ను మున్నే చూడ నేరమొక్కొ!

క్రోధచోరుని మైత్రి కొంప ముంపక యున్న, నిన్ను వాకిటఁ గట్ట నేరమొక్కొ!

లోభశత్రువు బుద్ధి లోగఁ జేయక యున్న, నీ దారిఁ గనిపట్ట నేరమొక్కొ!

మోహపాశము గట్టి మూల పైవక యున్న, నీ పరు గందుకో నేరమొక్కొ!

మదము మాత్సర్యమునుఁ గూడి మతినిఁ జెరప

కున్న, నినుఁ గెల్వ లేకుంటి మొక్కొ! యింత

లేసి బాములఁ బడియు నీ కెడము గాక

యునికి, నే నాటికైన నిన్నొందఁగలము. 100

కామ-ధూర్తుడు, వచ్చి, కనులు,కప్పక,ఉన్న = కామము అనే మోసగాడు వచ్చి మా కళ్ళు కప్పకుండ ఉంటే గనుక,

నిను,మున్ను+ఏ,చూడ,నేరము,ఒక్కో= నిన్ను ఇంతకంటె మునుపే చూడలేక పోతామా? .

క్రోధ-చోరుని, మైత్రి, కొంప ముంపక,ఉన్న = క్రోధం అనే దొంగయొక్క చెలిమి మా కొంప ముంచి ఉండక పోతే,

నిన్ను,వాకిటన్,కట్ట నేరము,ఒక్కొ!= నిన్ను మా ఇంటి వాకిటిలో కట్టి వేయలేక పోతామా?

లోభ-శత్రువు,బుద్ధి,లోగన్,చేయక,ఉన్న =లోభమనే పగవాడు మా బుద్ధిని/వివేకాన్ని లొంగ దీసుకొని ఉండక పోతే,

నీ,దారిన్,కనిపట్ట నేరము,ఒక్కొ!= నీ దారిని కనుక్కోలేక పోతామా?

మోహ-పాశము,కట్టి,మూల,వైవక,ఉన్న =మోహం అనే బంధం,కట్టి మూలన పడవేయక పోతే

నీ,పరుగు,అందుకో నేరము,ఒక్కొ! = నీ వెంట పడి నిన్ను చేరలేక పోతామా?

మదము, మాత్సర్యమునున్,కూడి, మతినిన్,చెరుపక,ఉన్న = మదము,మాత్సర్యము కలసి మనస్సును చెడగొట్టక పోతే,

నినున్, గెల్వ లేక,ఉంటిమి,ఒక్కొ! = నిన్ను గెలువ లేకుండ ఉన్నామా ఏమి?

ఇంతలు,ఏసి, బాములన్,పడియు, నీకు,ఎడము,కాక,యునికిన్= ఇంతటి కష్టాలు పడి కూడ, నీకు దూరం కాకుండ ఉన్న కారణంగా,

ఏ,నాటికి,ఐన, నిన్ను,ఒందన్,కలము = ఎప్పటికైన సరే, నిన్ను పొందగలము.

కనులు కప్పటం, కొంప ముంచటం,మూలన వేయటం, ఒకరి పరుగు అందుకోవటం, ఇంతలేసి- ఇవి పలుకుబడులు.

వేదమంత్రముల హోమాదులస్ జేయ, నా కందులో నొక్క ముక్కైన రాదు,

అభిషేక మొనరింపనైన, నా పద్ధతు లింతేని నా తలకెక్క లేదు,

పూజ పునస్కారములటన్న, జాల నేఁ బువ్వు లాకులుఁ బండ్లుఁ బ్రోవు సేయ,

తీర్థముల్ క్షేత్రముల్ దిరిగి వచ్చుటకు విత్తమ్ము నంతంత మాత్రమ్మె మాకు,

నంతొ యింతొ సజ్జనగోష్ఠి యనిన, నట్టి

వారి దొక యూరు నాదొక యూరు గాదె?

దేనికినిఁ గాక చెడియున్న దీనదశనుఁ

దాల్తు, మది నీవు గలవన్న ధైర్యమొకటె 101

వేద-మంత్రముల,హోమ-ఆదులన్,చేయన్ = వేదమంత్రాలను చదువుతూ హోమాలూ అవీ చేయటానికి ,

అందులో,ఒక్క,ముక్క,ఐన,నాకు రాదు = ఆ వేదమంత్రాలలో ఒక్కటీ నాకు రాదు.

అభిషేకము, ఒనరింపన్,ఐనన్ = అభిషేకం చేయటానికైనా,

ఆ, పద్ధతులు,ఇంత,ఏని, నా, తలకు,ఎక్క లేదు = ఆ అభిషేకవిధానాలు ఏవీ నాకు అర్థం కాలేదు.

పూజ, పునస్కారములు,అట,అన్నన్ = పూజలు పునస్కారాలో అంటే,

పువ్వులు,ఆకులున్, పండ్లున్,ప్రోవు సేయ,ఏన్,చాలన్= పువ్వులను,ఆకులను,పండ్లను పోగు చేయటానికి నేను అశక్తుడను.

తీర్థముల్, క్షేత్రముల్, తిరిగి వచ్చుటకు = తీర్థాలూ క్షేత్రాలూ చూసి రావటానికి,

మాకు,విత్తమ్మున్,అంత,అంత,మాత్రమ్ము+ఎ= మాకు డబ్బు, చాలీ చాలనంతగానే ఉన్నది.

అంత+ఒ, ఇంత+ఒ, సత్-జన-గోష్ఠి, అనినన్ = కాస్తో కూస్తో సత్సంగం చేయటం అంటేనో,

అట్టి,వారిది,ఒక, ఊరు, నాది, ఒక, ఊరు,కాదె? = అలాంటి సజ్జనులు అనే వాళ్ళది ఒక దారి, నాది ఇంకొక దారి, గదా! (వాళ్ళు ఎక్కడ? నేను ఎక్కడ? మాకు పొంతన లేదే?)

దేనికినిన్,కాక, చెడి ఉన్న, దీన-దశనున్ = ఏ ఒక్క దానికీ పనికి రాక చెడిపోయి మిగిలి ఉన్న

ఈ కష్టదశలో కూడ,

మదిన్,ఈవు, కలవు,అన్న, ధైర్యము,ఒకటె,తాల్తు = మనసులో నీవు ఉన్నావు - అనే ధైర్యాన్ని ఒక్క దాన్ని మాత్రమే పూని ఉన్నాను.

ఒక్క ముక్క, తలకు ఎక్కటం, పూజ పునస్కారాలు, క్షేత్రాలు తిరగటం,అంతంత మాత్రం, వాళ్ళదే ఊరు వీళ్ళదే ఊరు, దేనికీ కాక పోవటం - ఇవి పలుకుబడులు.

నీటితోఁ జేసిన యోటిదై యభిషేక, మాజ్యకల్పితమైన నధిక మగునె?

సర్వపుష్పములచే సవరిల్లునే పూజ? కారాని దగునె యక్షతలఁ జేయ?

వేదమంత్రములచేఁ బెంపెక్కునే స్తుతి? హర హరా యనుకొన్న నవరమగునె?

అగురుతో మైపూత నర్పింప నాఢ్యమై, తగ్గునా యింత గంధమ్ముఁ బూయ?

వివిధభోజ్యంబు లున్న నైవేద్య మొప్పి,

యొప్పకుండునె చిన్న పండొకటి బెట్ట?

మదిని దృఢభ క్తి గలుగ సామగ్రి యేల?

విద్దె లేటికి, తగిన వివేక మున్న? 102

అభిషేకము, నీటితోన్,చేసిన, యోటిది,ఐ= అభిషెకము, నీళ్లతో చేసినదైతే నేమో శక్తి లేనిదై, ఆజ్య-కల్పితము,ఐనన్, అధికము, అగునె? = నేతితో చేసినది ఐతే, గొప్పది ఔతుందా?

పూజ,సర్వ-పుష్పములచే, సవరిల్లునే? = పూజ అనేది, అన్నీ పూలతో చేస్తే విలసిస్తుందా?

అక్షతలన్,చేయ,కారానిది,అగును+ఎ? = అక్షతలతో చేస్తే పనికిరాని దౌతుందా?

స్తుతి, వేద-మంత్రములచేన్,పెంపు,ఎక్కునే? =స్తోత్రం, వేదమంత్రాలతో చేస్తే, గొప్పదౌతుందా?

హర హరా, అనుకొన్నన్ అవరము,అగును+ఎ? ='హర హరా' అని మాత్రం అనుకొంటే, తక్కువదౌతుందా?

మై,పూతన్,అగురుతోన్, అర్పింపన్,ఆఢ్యము,ఐ= ఒడలి పూత, ఉత్తమజాతి గంధమైన అగురు

చెక్కతో సమర్పిస్తే నేమో గొప్పదై,

గందమ్ముఁన్,ఇంత, పూయన్, తగనిది,ఔను,ఏమి?= సాధారణపు చెక్క గంధాన్ని కొద్దిగా పూస్తే నేమో తగనిదౌతుందా?

వివిధ-భోజ్యంబులు,ఉన్న,నైవేద్యం,ఒప్పి=రకరకాల తినే పదార్థాలు ఉన్న నైవేద్యం బాగుండి,

చిన్న, పండు,ఒకటి, పెట్ట, ఒప్పక,ఉండును+ఎ?= చిన్న పండును ఒకదానిని మాత్రం పెడితే, బాగుండక పోతుందా?

మదిని, దృఢ-భ క్తి, కలుగ, సామగ్రి ,ఏల?=మనసులో గట్టి భక్తి ఉంటే, వస్తువులు ఎందుకు?

తగిన, వివేకము,ఉన్న, విద్దెలు, ఏటికి?= సరైన వివేకం ఉంటే గనుక, చదువులు దేనికి?

అచటిచట వారి వీరిని నడుగుకొనుచు

బీదకాపుర మీడ్చ నీ పాదమంటి

యవియు నివియునుఁ జేకూర్చు మనుట,యాము

దమ్ముతో మోముఁ గడుగు చందమ్ము గాదె! 103

అచట,ఇచట, వారి,వీరినిన్,అడుగుకొనుచు=అక్కడ ఇక్కడా,వాళ్ళనూ వీళ్ళనూ అడుగుకొంటూ

బీద,కాపురం,ఈడ్చి,నీ,పాదము,అంటి=పేద బతుకు ఈడ్చుకొంటూ ఉన్న నీ కాళ్ళు పట్టుకొని,

అవియున్,ఇవియునున్, చేకూర్చుము, అనుట ='అవీ ఇవీ సమకూర్చు'- అని అనటం,

ఆముదమ్ముతో, మోమున్,కడుగు, చందమ్ము, కాదె!= ఆముదంతో ముఖం కడిగినట్లు గాదా?

ఆముదమే ఒక పెద్ద జిడ్డు.ఇక దానితో కడిగితే, ముఖానికి ఇంకా జిడ్డు పట్టటమే తప్ప, ఉన్న జిడ్డు వదలదు గదా!

అక్కడక్కడ, వారిని వీరిని (వాళ్ళను వీళ్ళను), బీద కాపురం, కాపురం ఈడవటం, పాదం అంటటము, అవి ఇవి- ఇవి పలుకుబడులు. 'ఆముదంతో ముఖం కడుగు కొన్నట్లు'-సామెత.

మొత్తుకొన మొత్తుకొన నీకుఁ జిత్తమైన

యపుడు రవ్వంత రాల్ప నేమగును? నాక

దేల? లంక మేతకు నేటి యీతకు సరి

యన్నటులు గాక, శాశ్వత మైన దిమ్ము. 104

మొత్తుకొన, మొత్తుకొన, నీకున్, చిత్తము,ఐన,అపుడుం నేను మొర పెట్టగా మొర పెట్టగా, నీ మనసుకు తోచినప్పుడు,

రవ్వ,అంత, రాల్పన్,ఏమి, అగును?= నలుసంత ఏదో నాకు రాల్చితే, ఏమి ఉపయోగం?

నాకు,అది,ఏల? = నాకు అది ఎందుకు?

లంక, మేతకున్,ఏటి, యీతకు, సరి,అన్న,అటులు,కాక ='లంక మేతకూ ఏటి ఈతకూ సరిపోయింది' అన్నట్లు కాకుండ,

శాశ్వతము,ఐన+అది,ఇమ్ము = నిత్యమైనది ఏదో దానిని నాకు ఇవ్వు.

మొత్తుకోవటం, మొత్తుకోగా మొత్తుకోగా, చిత్తం కావటం, రవ్వంత,రాల్చటం - ఇవి పలుకుబడులు. 'లంక మేతకు,ఏటి ఈతకు సరి' అని ఒక సామెత.

గుడులఁ గట్టి, మనుప మడులు మాన్యములిచ్చి,

చనిరి తొంటి ప్రభులు, కనిరి యశము;

గుడులొకండె కాదు గుడులలో లింగముల్

మ్రింగు చుంద్రు నేటి దొంగ ప్రభులు. 105

తొంటి, ప్రభులు = మునుపటి పాలకులు,

గుడులన్,కట్టి, మనుప, మాన్యములు,ఇచ్చి = గుళ్ళను కట్టించి, వాటిని పోషించటానికి పొలాలను మాన్యాలుగా ఇచ్చి,

చనిరి,యశమున్,కనిరి = గడచిపోయారు, పేరు పొందారు.

నేటి,దొంగ,ప్రభులు = ఈ కాలపు దొంగ ఏలికలు,

గుడులు,ఒకండు+ఎ,కాదు, గుడులలో,లింగముల్,మ్రింగుచు-ఉంద్రు = ఒక్క గుళ్ళను మాత్రమే కాదు, గుళ్ళలోని లింగాలను కూడ మింగివేస్తున్నారు.

'మడులు మాన్యాలు' అన్నది ఒక పలుకుబడి. 'గుడి మింగే వాడు ఒకడైతే, గుడితో పాటు లింగాన్ని మింగే వాడు ఇంకొకడు' అని ఒక సామెత.

ఉత్సవముల పేర నున్నదూడ్చును ప్రభు
త్వమ్ము వాడు గుడుల, భక్తి గాదు
వాడి పాడె పచ్చిబద్దలు గాదది,
గుడుల సొమ్ము దోచుకొనగ నెపము. 106

ప్రభుత్వమ్ము,వాడు,గుడుల=ప్రభుత్వం వాడు(ప్రభుత్వం పక్షాన గుడిని నడిపే వాడు),గుళ్ళలో, ఉత్సవముల,పేరన్, గుడుల,ఉన్నది,ఊడ్చును = ఆ ఉత్సవం ఈ ఉత్సవం అని చెప్పి, ఆ పేరుతో, గుళ్ళలో ఉన్న సొత్తునంతటినీ వెచ్చ పెట్టేస్తాడు.

అది,= అది (ఆ ఉత్సవాలను చెయటం అనేది),

భక్తి,కాదు,వాడి,పాడె,పచ్చిబద్దలు,కాదు = దైవభక్తి కాదు, వాడి పాడే పచ్చిబద్దలూ కాదు.

గుడుల,సొమ్ము,దోచుకొనగ,నెపము =జనం సొమ్మును దోచుకోవటనికి ఒక వంక మాత్రమే.

'ఉన్నది ఊడ్చటం' అన్నది ఒక పలుకుబడి. 'పాడె పచ్చి బద్దలు' అనేది ఒక తిట్టు.

గుడులఁ గుప్పిటఁ బట్టి, చెడు రీతులన్ వాని నడపి, భక్తుల సొమ్ము నడుమ మ్రింగి
గుడులఁ గొట్టుల నాచికొని, వారి వారికిఁ గూర్చి కోట్లకుఁ గోట్లు గూడఁ బెట్టి,
దైవదర్శనమైనఁ దగినట్లు గానీక, యరచుచు భక్తులఁ దరిమి తరిమి,
యెండ బారికి నీడ నేనిఁ గల్పింపక, గుడుల సొత్తన్యుల యొడులఁ బోసి,

అడుగడుగునందుఁ బ్రజ సొమ్ము నొడిచికొనుచు,గుళ్ళ,భక్తులన్,ధర్మము స్గుతిలపరుచు
నీచనేతల నొకసారి నీకుఁ గలుగు నన్ని కన్నులతోఁ జూడు మలికనయన! 107

అలిక-నయన! = నుదుట కన్ను ఉన్న శివా!

గుడులన్, గుప్పిటన్,పట్టి = గుడులను తమ చెప్పుచేతలలో పెట్టుకొని,

చెడు, రీతులన్, వాని, నడపి = తగని పద్ధతులలో వాటిని నిర్వహించి,

భక్తుల, సొమ్ము, నడుమ, మ్రింగి = భక్తులు ఇచిన ధనాన్ని మధ్యలో తామే తినివేసి,

గుడులన్.కొట్టులన్.ఆచికొని, వారి, వారికిన్,కూర్చి = గుళ్ళలో ఉండే కొట్లను బలవంతంగా కాజేసి, వాటిని తమ వాళ్ళకే కట్టబెట్టి,

కోట్లకున్,కోట్లు, కూడఁ బెట్టి = కోట్ల కొద్ది సొమ్మును వెనుక వేసుకొని,

దైవ-దర్శనము,ఐనన్, తగిన,అట్లు,కాన్+ఈక =దేవదర్శనాన్ని కూడ కావలసినట్లు కానీయక,

అరచుచు, భక్తులన్,తరిమి, తరిమి = కేకలు వేస్తూ, భక్తులను తోసి తోసి,

ఎండ,బారికి, నీడన్,ఏనిన్,కల్పింపక=ఎండ దెబ్బకు తట్టుకోవటానికి నీడనైన ఏర్పాటు చేయక,

గుడుల, సొత్తు, అన్యుల, ఒడులన్,వోసి = గుడులకు చెందిన డబ్బును వాటికి సంబంధించని వాళ్ళ ఒళ్ళలో వోసి, ,

అడుగు,అడుగునందు,బ్రజ,సొమ్మున్,ఒడిచికొనుచు=ప్రతి సందర్భంలో ప్రజల సొమ్మును లాగుకొంటూ,

గుళ్ళ,భక్తులన్,ధర్మమున్,కుతిలపరుచు,నీచ-నేతలన్ = గుళ్ళను,భక్తులను,ధర్మాన్ని, పాట్లు పెట్టే నీచులైన మా పాలకులను,

నీకున్,కలుగు,అన్ని, కన్నులతోన్,ఒక,సారి,చూడుము = నీకు ఉన్న అన్ని కళ్ళతోనూ ఒక సారి చూడు. అంటే, 'ఆ నీచులను మూడు కళ్ళతో చూడు' అని ప్రార్థన.

ఇక్కడ, అలికనయన! అన్న సంబోధనం సాభిప్రాయం.

గుప్పిట బట్టటం, సొమ్ము మింగటం, వాళ్ళ వాళ్ళు, కోట్లకు కోట్లు, కూడబెట్టటం, ఒడిలో వేయటం , అడుగడుగున - ఇవి పలుకుబడులు.

జాగరంబని చందాలు వోగు జేసి,

వెలకుఁ బడుచులఁ దెప్పించి వీథులందుఁ

దులువ లాడించు వెకలి యాటలను నాట్య

మనెడి మాటునఁ జెల్లనీయకు నటేశ! **108**

జాగరంబు, అని, చందాలు,వోగు,చేసి= జాగరం చేయిటం అనే పేరు చెప్పి, జనంనుండి డబ్బు వోగు చేసి,

వెలకున్,పడుచులన్,తెప్పించి = డబ్బు ఇచ్చి అమ్మాయిలను రప్పించి,

వీథులందున్,తులువలు,ఆడించు,వెకలి,ఆటలను = వీథులలో చెత్త వెధవలు వేయించే లేకి గంతులను,

నాట్యం, అనెడు,మాటునన్,చెల్లన్,ఈయకు = నాట్యం అనే వంకతో నడిచేటట్లు చేయకు.

తొలుత నినుఁ గొలుచుటే మా

కలయిక, యిక నీదు సుతున కగ్రార్చన గా

వలయునె? 'తాఁ దూరనె క్రం

త లేదు, మెడ కొక్క డోలు' నా వినవె శివా! **109**

శివా!

నినున్,కొలుచుట+ఏ,మాకు,తొలుత,అలయిక = నిన్ను పూజించటమే మాకు మొదటికి మొదట ఆయాస మౌతున్నది.

ఇక,నీదు,సుతునకు,అగ్ర-అర్చన,కా వలయును+ఎ? = ఇంకా పైపెచ్చు, నీ కొడుకుకు మొదటి పూజ కావాలా?

తాన్,దూరన్+ఎ,క్రంత,లేదు,మెడకు,ఒక్క,డోలు,నాన్,వినవు+ఎ? = 'తాను దూరనే కంత లేదు, మెడకు ఒక డోలు' అని చెప్పటం నీవు వినలేదా?

'తా దూర కంత లేదు, మెడ కొక డోలు' అని సామెత. అవకాశం ఉన్నదానికంటె ఎక్కువగా చేజిక్కించుకోవాలని చేసే అవివేకానికి/అత్యాశకు ఉదాహరణగా ఈ సామెతను వాడుతారు. తానొక్కడు దూరటానికే చాలనంత సన్నని కన్నంలోనుండి దూరి పోయే వాడు, తన మెడలో ఒక పెద్ద డోలును తగిలించుకొని, దానితో సహా దూరి పోదామనుకోవటం, తెలివితక్కువ ఐనా కావాలి, అత్యాశ ఐనా కావాలి కదా!

యోగిపూజ్యత నీకు, రాగిగమ్యత నాకుఁ, గావునఁ బో లికే కలుగకుండె;
సర్పాశ్రయము నీకు, సర్వాశ్రయము నాకుఁ, వర్ణభేదమ్ము స్వల్పముగఁ దోచె;
నార్యావినతినీకు నార్యావినతి నాకు సంధిఁ జేయగఁ దగు సామ్య మమరె ;
ధర్మదండన నీకు, ధర్మదండన నాకు, గాన నభేదమ్మె కానవచ్చె;
పొసగుచున్నది మనమధ్య పోను పోను
సాన్నిహిత్యంబు , నేడు నేఁ జనుచునున్న
దారి వేరన్న యొక తారుమారె కాని,
కలసినపు డేను నీవు నొక్కటియె సుమ్ము. 110

యోగి-పూజ్యత నీకు = యోగులకు పూజ్యుడవై ఉండే లక్షణం నీకు ఉన్నది.
రాగి-గమ్యత,నాకున్ =రాగులు చేరదగ్గవాళ్ళుగా ఉండే లక్షణం నాకు ఉన్నది.
(రాగులు=వైరాగ్యం లేని వాళ్ళు . అన్నీ వదలుకొన్న వాళ్ళు నిన్ను సేవిస్తే, దేనినీ వదలని వాళ్ళను నేను చేరుతాను.)
కావునన్,పోలిక+ఏ, కలుగక ఉండె = కాబట్టి, మన మధ్య పోలిక అనేదే లేకపోయింది.
నీకు,సర్ప-ఆశ్రయము = పాములు వచ్చి నిన్ను ఆశ్రయించటం , నీకు ఉన్నది.

నాకు, సర్వ-ఆశ్రయము = అందరనూ ఆశ్రయించటం, నాకు ఉన్నది.

స్వల్పముగన్, వర్ణ-భేదమ్ము,తోచెన్ = కొద్దిగా, అక్షరపు తేడా కనిపించింది.

ఆర్యా,వినతి,నీకున్ = పార్వతీదేవి నమస్కరించటం, నీకు ఉన్నది.

ఆర్య-అ-వినతి, నాకు = పెద్దలకు నమస్కరించకపోవటం, నాకు ఉన్నది.

సంధిన్, చేయగన్,తగు, సామ్య ము,అమరె = (శబ్దరూపంలో) సంధి చేస్తే, తగిన సమానత్వం ఏర్పడింది. (సంధి చేస్తేనే కదా ఈ రెండు శబ్దాలూ ఒకలాగే కనబడుతూ ఉన్నాయి!)

దీనికి మరొక అర్థం:

సంధిన్,చేయగన్,తగు,సామ్యము,అమరె = సంధి చేయటానికి యోగ్యమైన సమానత్వం వచ్చింది. సమానులతోనే కదా సంధి!

ధర్మ-దండన, నీకు = యముడిని దండించటం- నీకు ఉన్నది.

ధర్మ-దండన, నాకు = యముడిచేత దండన- నాకు ఉన్నది.

కానన్, అ-భేదమ్ము+ఎ, కాన వచ్చె = కాబట్టి, మనకు ఏకత్వమే కన బడ్డది .

పోను, పోను, మన,మధ్య, సాన్నిహిత్యంబు, పొసగుచున్నది = పోగా పోగా,మన ఇద్దరి మధ్య దగ్గరతనం ఎక్కువౌతున్నది.

పోలిక అన్నదే లేకపోవటం దగ్గరనుండి, కొంచెం మాత్రం తేడా ఉండటం, కొద్దిగా పోలిక రావటం, చివరకు ఏకత్వం కనబడటం దాక వచ్చింది. ఇదే పోను పోను దగ్గర కావటం అంటే.

నేడు, నేన్,చనుచున్,ఉన్న, దారి, పేరు, అన్న, యొక, తారుమారె, కాని = ఇప్పుడు నేను నడచే దారి పేరు- అనే ఈ ఒక్క వ్యత్యాసం తప్ప,

కలసినపుడు, ఏను, నీవున్, ఒక్కటి+ఎ, చుమ్ము = కలుసుకొన్నప్పుడు మాత్రం, నీవూ నేనూ ఒకటే సుమా!

ఏదియో మదిఁ దోచు, నేమని తర్కింప, నది యిది యని చెప్ప ననువు గాదు.
ముందేదియో రూపు పొడగట్టి నట్లౌను, విశదీకరింపగ వీలు గాదు,
పిలచిన ట్లనిపించుఁ, తలఁ ద్రిప్పి చూడగఁ బ్రాణిమాత్రుడు గానరాడొకండు,
తాకిన ట్లనిపించుఁ, తడవి చూడగఁ జెంత, నొక్క పుర్వేనియు నుండ దచట;
నాల్క యేమేమియో పల్కఁ బోవును గాని, మాటొక్కటియు నోరు దాటి రాదు,
అంది యందక యున్న యీ చంద మేమొ ?
చేరి చేరక యున్న యీ చేష్ట లేమొ?
నీకు వేడుక గావచ్చు, నాకుఁ గాదు;
యాపవా యిట్టి దోబూచులాట లింక? 111

ఏది+ఓ, మదిన్,తోచున్ =ఏదో మనసులో తోచుతుంది.
ఏమి,అని, తర్కింపన్ = ఇది ఏమిటా- అని అలోచించితే,
అది,ఇది,అని, చెప్పన్,అనువు,కాదు= అది అనో, ఇది అనో, స్పష్టంగా చెప్పటానికి వీలు కాదు.
ముందు,ఏది+ఓ, రూపు, పొడగట్టిన,అట్లు,ఔను= ఎదురుగా,ఏదో ఆకారం కనబడ్డట్లు ఔతుంది.
విశదీకరింపగ, వీలు, కాదు = అది ఏమిటో- స్పష్టంగా చూడటానికి,చెప్పటానికి,వీలు కాదు.
పిలిచిన,అట్లు,అనిపించున్= ఎవరో పిలిచినట్లు అనిపిస్తుంది.
తలన్,త్రిప్పి, చూడగన్ = తల తిప్పి చూస్తే,
ప్రాణి-మాత్రుడు, ఒక్కడు,కానరాడు = జీవి అన్నవాడు ఒక్కడు కూడ కనబడడు.
తాకిన,అట్లు,అనిపించున్ = ఏదో శరీరాన్ని తాకినట్లు అనిపిస్తుంది.
చెంతన్, తడవి, చూడగన్= పక్కన తడిమి చూచుకొంటే,
అచట,ఒక్క,పురువు,ఏనియున్,ఉండదు = అక్కడ ఒక్క పురుగు కూడ ఉండదు.
నాల్క, ఏమి,ఏమి+ఓ, పల్కన్ పోవును, కాని= నాలుక, ఏమిటేమిటో చెప్పబోతుంది.

మాట,ఒక్కటియు, నోరు, దాటి, రాదు = కాని, ఒక్క మాట కూడ, నోరు దాటి బయటకు రాదు.
అంది,అందక,ఉన్న,ఈ, చందము,ఏమొ? = అందినట్లు,అందనట్లు, ఉన్న ఈ పద్ధతి ఏమిటో?
చేరి, చేరక, ఉన్న,ఈ,చేష్టలు,ఏమొ? = దగ్గరకు వచ్చినట్లు,రానట్లు, ఉన్న ఈ పనులు ఏమిటో?
నీకు,వేడుక,కావచ్చు,నాకున్,కాదు = నీకు వినోదం కావచ్చు గాని,నాకు మాత్రం అలా కాదు,
ఇట్టి, దోబూచుల,ఆటలు,ఇంక,ఆపవు+అ? = ఇలాంటి దాగుడుమూతల ఆటలు ఇంకా ఆపవా?
అది ఇది అని, పొడగట్టటం, ప్రాణిమాత్రుడు, ఒక్క పురుగైన, మాట నోరు దాటటం,
అంది అందని, చేరి చేరని, దోబూచులాట – ఇవి పలుకుబడులు.

ఇవ్విధి నన్నుఁ దిట్టఁ దగునే యని మోమును వ్రేలపైచుకో;
కివ్వరుసల్ జమత్కృతుల; యింతకుఁ దిట్టను దిమ్మనుస్ మరిం
కెవ్వరు నీకు దిక్కు, చనవెక్కిన వారము మేమె కానిచో?
దవ్వుల వారమా? యుసురుఁ దాల్చిన వీడిన, నిన్నె చేరమా? 112

ఈ+విధి,నన్నున్,తిట్టన్,తగును+ఏ,అని = 'ఈ రకంగా నన్ను తిట్టవచ్చునా?' అని
మోమును, వ్రేల,పైచుకోకు = మొగం వేలాడేసుకో వద్దు.
ఈ+వరుసల్,చమత్కృతులు+అ = ఈ పోకడలు చమత్కారాలు మాత్రమే!
ఇంతకున్,తిట్టినన్,తిమ్మినన్ = ఐనా,ఇంతకూ, తిట్టాలన్నా తిమ్మాలన్నా,
చనవు,ఎక్కిన,వారము,మేము+ఎ, కాని,చో = చనవు బాగా పెరిగి ఉన్న వాళ్ళం మేమే కాకపోతే,
నీకు,మరి,ఇంక,దిక్కు,ఎవ్వరు? = నీకు వేరు దిక్కు ఎవరున్నారూ- అని?
దవ్వుల,వారము+ఆ? = మేము నీకు దూరపు వాళ్ళమా?
ఉసురున్, తాల్చిన,వీడిన,నిన్ను+ఎ,చేరము+ఆ? = ప్రాణం ఉన్నా,పోయినా, నిన్నే చేరే
వాళ్ళం కాదూ?
'మొగం వ్రేలాడ వేసుకోవటం', 'తిట్టటం తిమ్మటం', 'దిక్కెవరు?' 'చనవెక్కటం', 'దవ్వుల వారు'

అనేవి పలుకుబడులు.

నిండు చంద్రుడు మింటఁ బండు వెన్నెలఁ గాయ,మిణుగురుల్దమ వెల్గు లణచుకొనునె?

కారు మేఘమ్ములు గ్రమ్మె నల్లడనని ముంతనీటినిఁ బారఁబోయు నెవడు?

బంధుమిత్రులకు సంపద మిక్కుటంబని స్వార్జనంబును మాను వాడు గలడె?

వీథిదీపంబులు వెలుగుచున్నవి గదా యని యింటిలో దీపమార్పఁ దగునె?

కవులుఁ బండితులైన పెక్కండ్రు గలుగ నేను రచియించుటేలని మానుకొనక,

వాణి దయచేసి యున్నంతవరకు వ్రాత హితముగాఁ దలపోసి వ్రాసితిని దీని 113

నిండు,చంద్రుడు, మింటన్,పండు, వెన్నెలన్,కాయ= నిండు చంద్రుదు ఆకాశంలో ముదురు వెన్నెలను చిమ్ముతూ ఉంటే,

మిణుగురుల్, తమ, వెల్గులు, అణచుకొనునె?= మిణుగురు పురుగులు తమ వెలుగులను లోపలనే ఆపుకొంటాయా?

కారు, మేఘమ్ములు, నల్,కడన్, క్రమ్మె,అని = నల్లని నీటి మేఘాలు అన్ని ప్రక్కల కమ్ముకొన్నాయని,

ముంత,నీటినిన్, ఎవడు,పారన్,పోయున్?= ముంతలోని నీళ్ళను ఎవదు క్రింద పారబోస్తాడు?

బంధు-మిత్రులకు, సంపద, మిక్కుటంబు,అని =తన బంధువులకు,మిత్రులకు చాల సంపద ఉన్నదని,

స్వ-ఆర్జనంబును,మాను,వాడు,కలడె?=తన సొంత సంపాదనను మానుకొనే వాడు ఉంటాడా?

వీథి-దీపంబులు, వెలుగుచు,ఉన్నవి,కదా,అని= బయట వీథులలో దీపాలు వెలుగుతూ ఉన్నవి గదా అని,

ఇంటిలో, దీపము, ఆర్పన్,తగునె?= ఇంటిలో వెలిగే దీపాన్ని ఆర్పివేయవచ్చునా?

కవులున్,పండితులు,ఐన, పెక్కండ్రు,కలుగన్= 'కవులు,పండితులు, చాలమంది ఉండగా...,'

ఏను, రచియించుట,ఏల,అని, మానుకొనక='...నేను వ్రాయటం దేనికి?'- అని మానుకోక,
వాణి, దయచేసి, యున్న,అంతవరకు, వ్రాత, హితము,కాన్, దలపోసి= భాష అనుగ్రహం
ఉన్నంత కాలం, వ్రాయటమే మంచిది అని అనుకొని,
దీని, వ్రాసితిని= దీనిని వ్రాసాను.
నిండు చంద్రుడు, పండు వెన్నెల, దయ చేయటం - ఇవి పలుకుబడులు. 'మొగిలి కమ్మిందని
ముంతలో నీళ్ళు పారబోస్తారా?' అని ఒక సామెత.

చదువుల సుద్దు లెరుంగని

యదవ మొగము వీడు వ్రాయుటా యని తలతే?

చదివిన వారలకంటెనుఁ

జదువని వారి ప్రభ నేడు శతగుణమభవా! 114

అభవా! =శివా!
చదువుల, సుద్దులు,ఎరుంగని, యదవ, మొగము= 'చదువుల సంగతులే తెలియని ఈ
బదుగు మొగము వాడైన ...'
వీడు, వ్రాయుట+ఆ,అని తలతు+ఏ?= '...వీడు వ్రాయటం ఏమిటి?' అని అనుకొంటున్నావా?
నేడు, చదివిన, వారలకంటెనున్= ఈ కాలంలో, చదువుకొన్న వాళ్ళకంటె కూడ,
చదువని, వారి, ప్రభ,శత-గుణము = చదువుకొనని వాళ్ళ చెల్లుబడి, నూరు రెట్లు.
(ప్రభ=ప్రాభవం అని, వాడుకలో అర్థం. '... అందుచేతనే, ఇంగిలీషు రాకపోయినా నా ప్రభ
యిలా వెలుగుతూంది.'-కన్యాశుల్కంలో రామప్పపంతులు మాట.)

నవరాత్రుల నీ గౌరిని,

శివరాత్రికి నిన్నుఁ గొలుచు శిష్టుల కెల్లన్

నవనిధులఁ గురియకున్నను,

నవకాశముఁబట్టి యొసగు మర్థేప్సితముల్. 115

నవ-రాత్రుల, నీ, గౌరిని,శివరాత్రికి, నిన్నున్,కొలుచు,శిష్టులకు,ఎల్లన్ =నవరాత్రులప్పుడు నీ పార్వతిని, శివరాత్రప్పుడు నిన్ను, కొలిచే సజ్జనులకందరకు,

నవ-నిధులన్, కురియక,ఉన్ననున్= నవనిధులను కురిపించక పోయినా,

అవకాశమున్ పట్టి, అర్థ-ఈప్సితమున్,ఒసగుము=వీలునుబట్టి, తగిన కోర్కెలను తీర్చు.

మార్కండేయుడు గాంచె ను

దర్కము నీ యెడలభక్తిఁ దవిలి యనుచు మున్

బేర్కొనిరి పెద్ద, లాచం

ద్రార్కము కవివాక్కు నిలువ నగుఁ గాక శివా! 116

శివా! = శివా!

నీ, ఎడల,భక్తిన్,తవిలి ='నీ పట్ల భక్తిని అనుసరించుకొని...,'

మార్కండేయుడు, ఉదర్కమున్,కాంచెన్, అనుచు= '... మార్కండేయుడు తరువాతి కాలంలో మేలు పొందాడు' అని,

పెద్దలు,మున్, పేర్కొనిరి = పెద్దలు మునుపు చెప్పారు.

కవి-వాక్కులు,ఆ-చంద్ర-అర్కము,నిలువన్,అగున్,కాక = కవుల వాక్కులు చంద్రసూర్యులు ఉన్నంతకాలం, నిలిచేటట్లు అగును గాక!

***** ఇతి శ్రీః *****

*

ఉపసంహారము

లేదిందుస్ బదభావశుద్ధరసవల్లీలావిలాసోక్తి, యా
స్వాదింపస్ , శివరాత్రిజాగరణఁ దీర్పం బోవు వారెవ్వరే
మోదార్థంబు పఠించుకొందురనుచుం, బూర్వోక్తిసారంబుగా
నేదో బుద్ధికిఁ దోచి చాపలము వ్రాయింపంగ నే వ్రాసితిస్ 1

దీనిలో, ఆస్వాదించటానికి పదాలనుబట్టి కాని, అర్థాలనుబట్టి కాని, స్వచ్ఛమైన రసవంతమైన లీలావిలాసం గల వాక్కు లేదు. శివరాత్రిజాగరణ చేసే వాళ్ళు ఎవరైన వినోదం కోసం చదువు కొంటారు లే అని, పూర్వుల మాటల సారం వచ్చేటట్లు, బుద్ధికి ఏదో తోచగా, నా ఉబలాటం కొద్ది, దీనిని వ్రాసాను.

పానకముఁ ద్రావి తీపితోఁ బళ్ళు విరియు
నెడల మిరెపుగింజల కార మించునట్లు,
సకలశాస్త్రంబు లెరిగిన సుకవికృతుల
మెచ్చు వారికీ వ్రాతయు నిచ్చకెక్కు. 2

పానకం తాగి, ఆ తీపికి పళ్ళు వివశమై ఉన్నప్పుడు, మిరియపు గింజలా కారం ఎంతో బాగా రుచించినట్లు, అన్ని శాస్త్రాలు తెలిసిన పండితకవుల రచనలను మెచ్చుకొనే వాళ్ళకు, ఈ వ్రాత కూడ మనసుకు నచ్చుతుంది.

ఆంధ్రః కుత్ససగోత్రో
జోగాంబాసుబ్బరాయయోః పుత్రః
నందవరవంశవిప్రో
మార్కణ్డేయప్రసాదనామాహమ్ 3

నేను తెలుగు వాడను. నందవరబ్రాహ్మణుడను. కుత్సగోత్రం వాడను. జోగమ్మ సుబ్బారావుల కొడుకును. మార్కండేయప్రసాద్ అనే పేరు గలవాడను.

శాకే ఉ శ్వాబ్ధిరసేందౌ (1947) విశ్వావసుపుష్యబహుళసప్తమ్యాం ;

ఋతునేత్రఖద్విశి (2026) హూణే (10-01-2026), వర్షే కావ్యస్య రచన మస్యాభూత్ .

శాలివాహన శకం 1947 లో, విశ్వావసు సంవత్సరపు పుష్యమాసపు బహుళ సప్తమి నాడు, ఆంగ్లశకం 2026 లో (10-01-2026 న), ఈ కావ్యం వ్రాయటం పూర్తి ఐంది.

*** **ఇతి శమ్** ***

***